సాహితీ గత వారం రోజుల పై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తిరుపతి : fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-9-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 226 పేజీలు: 10+4 వెల: 6.50

భారత్‌కు రష్యా బంపర్ ఆఫర్ హైస్పీడ్ 'ఇవోల్గా' రైలు

5.05 కి.మీ పొడవైన టేబుల్ గిన్నిస్ రికార్డు

5

## వినాయకచవితి శుభాకాంక్షలు

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు వినాయకచవితి శుభాకాంక్షలు.

- డా. గిరీష్ కుమార్ సంఘీ
'వార్త' సిఎండి & మేనేజింగ్ డైరెక్టర్



## సెలవు

పండుగ సందర్భంగా 14-9-2026 సోమవారం వార్త కార్యాలయానికి సెలవు. కావున15-9-2026న సంచిక వెలువడదు. పునర్దర్శనం 16వ తేదీ బుధవారం.



# శ్రీశైలం ఖాళీ!

## రాయలసీమ చూపులన్నీ ఆ జలాశయంపైనే

● తుంగభద్ర జలాశయానికి జీరో ఇన్‌ఫ్లో ● సీమలో కరువు పరిస్థితులు భయానకం ● ఖరీఫ్‌లో వర్షపాతం 56శాతం లోటు ● అడుగంటిన భూగర్భ జలాలు ● ప్రజల దాహార్తికి, పశుగ్రాసానికి తీవ్ర ఇబ్బందులు?

**అనంతపురం, సెప్టెంబరు 13 ప్రభాతవార్త బ్యూరో:** రాయలసీమ ప్రజానీకానికి ముఖ్యంగా అన్నదాతలకు మళ్లీ పాత రోజులు గుర్తొస్తున్నాయి. తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల్లో తాగునీళ్ల కోసం.. రాగి గంజి కోసం.. కూలీలకు పనుల కోసం.. మూగ జీవులకు పశుగ్రాసం కోసం అలమటించే రోజులు దగ్గర పడుతున్నాయి. వర్షం జాడే లేకపోవడంతో వాడిన పంట పొలాల వైపు వెళ్లాలంటేనే రైతులకు మొగం ఎక్కడం లేదు. రాయలసీమ జిల్లాల్లోని ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల్లో ఈపరిస్థితి ఎక్కువగా ఉంది. నీటిపారు దల సౌకర్యం ఉన్న కొద్ది శాతం భూములు మినహా వర్షంపై ఆధారపడ్డ భూముల పరిస్థితి, వాటిని నమ్ముకున్న రైతుల పరిస్థితి భయానకంగా ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ పరిస్థితి ఇంకా ఎక్కువగాఉంది. భారీ వర్షాలు రాకపోగా చెరువులు, రిజర్వాయర్లను నీటితో నింపేందుకు అవసరమైన నీరు రాకపోవడంతో భూగర్భ జలమట్టం పెరగడం లేదు. భూగర్భ జలమట్టం >>2

## రూల్స్ ఫాలో అవ్వడం కాదు..

# సెట్ చేయాలి

### గ్లోబల్ సౌత్ బలమైన వాణికి వేదిక బ్రిక్స్

### సమ్మిళిత ఆర్థికవృద్ధికి బ్రిక్స్‌దేశాల పరస్పర సహకారమే ప్రధానం

### బ్రిక్స్ ముగింపు సభలో ప్రధాని మోడీ




బ్రిక్స్ సభ్యదేశాధినేతల గ్రూప్ ఫోటో

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** బ్రిక్స్ కూటమిలో గ్లోబల్ సౌత్ దేశాల గళాన్ని బలంగా వినిపిస్తున్నామని, అందుకే ఆ దేశాలకు ఈ కూటమిపై విశ్వాసం గణనీయంగా పెరిగిందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. భిన్నత్వం, సహకారమే బ్రిక్స్ బలానికి మూలమని ఆయన ఉద్ఘా టించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపం లో ఆదివారం జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో ప్రధాని ప్రసంగించారు. రూల్స్ ఫాలో కావడం కాదని, రూల్స్ మన మే సెట్‌చేయాలని ప్రధాని

బ్రిక్స్ సదస్సుపై విదేశీ మీడియా ప్రశంసలు 2

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

రేపు ధ్వజారోహణం 2లో



## అమరావతిలో ఐకానిక్ భవనాల నిర్మాణం 2లో

రెండేళ్లలో పూర్తి చేసేలా పనులు: మంత్రి నారాయణ




## పంటను కాపాడాలి

ప్రతి నీటి వనరునూ వినియోగించాలి

వ్యవసాయ, జలవనరుల శాఖలు సమన్వయంతో పనిచేయాలి మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు 2లో







ఎండిన చీనీ తోటలను పరిశీలిస్తున్న వైసిపి శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ , సిపిఎం నేతలు, రైతు సంఘం నేతలు

## ఎండిన పండ్లతోటలను పరిశీలించిన నేతలు

### ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్

**అనంతపురం, సెప్టెంబరు 13, (ప్రభాతవార్త బ్యూరో):** అనంతపురం జిల్లాలోని బుక్కరాయసముద్రం మండలంలో వైసిపి నేతలు, గార్లదిన్నె మండలంలో సిపిఎం నేతలు వర్షాభావంతో దెబ్బతిన్న వేరుశనగ పంటలను, చీనీ తోటలను ఆదివారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. మాజీ మంత్రి, సింగనమల నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త డాక్టర్ శైలజనాథ్ నేతృత్వంలో వైసిపి నాయకులు బుక్కరాయసముద్రం మండలంలో పర్యటించారు. సిపిఎం రాష్ట్ర నాయకుడు రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు, రైతు సంఘాల నాయకుల బృందం గాలదిన్నె మండలంలో పర్యటించి పంటల పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం, వైసీపీ నేతలు వేరువేరుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన స్పందించి సహాయకు చర్యలు చేపట్టాలని, రైతులు మనో ధైర్యాన్ని నింపాలని విజ్ఞప్తి చేశారు.

# పంటను కాపాడాలి

## ప్రతి నీటి వనరునూ వినియోగించాలి

**రైతులకు అండగా ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

**ప్రత్యామ్నాయ, తక్కువ నీటి అవసరమయ్యే పంటలను పెద్దఎత్తున ప్రోత్సహించాలి**

**వ్యవసాయ, జలవనరుల శాఖలు సమన్వయంతో పనిచేయాలి: మంత్రి అచ్చెన్నాయుడు**

**విజయవాడ, సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని, తేమ ఒత్తిడికి గురవుతున్న పంటలను కాపాడేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం, ఖరీఫ్ సాగు, పంటలపై ప్రభావం, పంట ఆరోగ్య పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటల సాగు, అందుబాటులో ఉన్న నీటి వనరులతో పంటలను కాపాడేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆదివారం మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తేమ ఒత్తిడికి గురైన ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరునూ సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడేందుకు రక్షక తడులు అందించాలని వ్యవసాయ, జలవనరుల శాఖల అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అవసరమైన చోట తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో జూన్ 1 నుంచి సెప్టెంబర్ 12 వరకు సాధారణంగా 476.1 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 218.2 మి.మీ. మాత్రమే నమోదైందని అధికారులు మంత్రికి వివరించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 54.2 శాతం వర్షపాతం లోటు నమోదైందన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వర్షాభావ ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఈ ఉన్నతస్థాయి సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వ్యవసాయ-సహకార శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాజుని కుమారి, మత్స్య శాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్, జలవనరుల శాఖ ఇంజనీర్ఇన్‌చీఫ్, జలవనరుల శాఖ కార్యదర్శి, రాజమౌళి, వ్యవసాయ, జలవనరుల శాఖలకు చెందిన వివిధ విభాగాధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆదివారం బ్రిక్స్ దేశాధినేతలు

## ఫాలో అవ్వడం కాదు.. సెట్ చేయాలి

>> పిలుపునిచ్చారు. పాటించడం పక్కనపెట్టి నిబంధనలు రూపొందించేస్థాయిలో మనం కొనసాగాలని అన్నారు. ఈ కూటమిలో గ్లోబల్ సౌత్ దేశాల ఆందో ళనలు, అనుభవాలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నందునే వాటి నమ్మకాన్ని చూరగొన్నామని తెలిపారు. నా వ్యక్తిగత అనుభవం నుంచి చెబుతున్నాను, బ్రిక్స్ పట్ల గ్లోబల్ సౌత్ దేశాల విశ్వాసం పెరిగింది. ఎందుకంటే వారి గొంతు ఇక్కడ వినిపిస్తుంది, వారి అనుభవాలను గౌరవిస్తాం. పరిష్కారాలను కేవలం వారి కోసం మాత్రమే కాకుండా, వారితో కలిసి రూపొందిస్తాం. మా భిన్నత్వం, సహకారమే బ్రిక్స్ అసలైన బలం" అని ప్రధాని మోడీ వివరించారు. ఈ వేదికపై విభిన్న దేశాల మధ్య సహకారం ప్రపంచ పురోగతికి, మానవాళి శ్రేయస్సుకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ప్రాముఖ్యతను ప్రధాని నొక్కిచెప్పారు. భారతీయ నాగరికతలో ప్రకృతికి తల్లి స్థానం ఇచ్చాం. శతాబ్దాలుగా, అభివృద్ధి, పర్యావరణం అనేవి ఒకదానికొకటి ప్రత్యామ్నా యాలు కాదని, అవి పరస్పర పూరకాలు అనే బలమైన నమ్మకం మాది అని మోడీ అన్నారు. భవిష్యత్ తరాల పట్ల తమ బాధ్యతను గుర్తిస్తూ మానవాభివృద్ధి, పర్యా వరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను పాటించడంపై బ్రిక్స్ దృష్టి సారించిందని తెలిపారు. బ్రిక్స్ ఫ్రేమ్‌వర్క్‌లో చేపట్టిన పలు కార్యక్రమాలను ప్రధాని ప్రస్తావించారు. "స్వచ్ఛ ఇంధన వ్యవస్థలను మరింత విశ్వసనీయంగా, సమర్థవంతంగా, అందుబాటులోకి తెచ్చేందుకు స్మార్ట్ గ్రిడ్లు, ఇంధన నిల్వల కోసం బ్రిక్స్ డిజిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. అదేవిధంగా, వ్యవసాయం, వాతావరణ మార్పుల అనుసరణ, పర్యావరణ సుస్థిరత వంటి రంగాల్లో సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రంతో అనుసంధానించడం ఎంతో ముఖ్యమని అన్నారు. "వ్యవసాయ పర్యావరణం, పునరుత్పాదక వ్యవసాయం కోసం ఏర్పాటు చేసిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌సంప్రదాయ పరిజ్ఞానాన్ని ఆధునిక విజ్ఞానంతో కలుపుతాయి" అని పేర్కొన్నారు. మనమంతా విభిన్న వాస్తవికతలతో ముడిపడి ఉండవచ్చు, కానీ సహకారంతో కలిసికట్టుగా ఎదుగుతాం, మానవాళి కోసం వికసిస్తామన్నారు. బ్రిక్స్ స్టార్టప్ ఇన్నొవేషన్‌ఫండ్ ఏర్పాటుచేయాలని ప్రధాని ప్రతిపాదించారు. సాంకతికతను, సంక్లిష్ట ఖనిజాలనుచూపి బెదిరింపులకు పాల్పడటాన్ని వ్యతిరేకించాలని చైనానుద్దేశించేపరోక్షంగా ప్రస్తావించారు. ప్రత్యేక స్టార్టప్ నిధులు ఉంటే బ్రిక్స్‌దేశాల్లోని పారిశ్రామికవేత్తలు పెట్టుబడిదారులు ఆవిష్కర్తలమధ్య పరస్పర సహకారం మరింతపెరుగుతుం దని సూచించారు. ప్రపంచంలోని అరుదైన ఖనిజాల్లో సుమారు 90శాతం చైనాయే శుద్ధిచేస్తోంది. సోలార్ ప్యానెళ్లనుంచి స్మార్ట్‌ఫోన్లవరకూ అన్నింటిలోనూ వీటిని ఉపయోగిస్తారు. కఠినచర్యలు వృద్ధికి అవరోధాలుగా నిలుస్తాయని చెప్పినమోడీ మన భిన్నత్వమే మన గుర్తింపుగా, మన సహకారమే మన స్ఫూర్తిగా నిలవాలి. మన పురోగతి సమస్త మానవాళికి సేవ చేయాలి అంటూ ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.

**బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారం కీలక: ప్రధాని మోడీ**

ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి, సమ్మిళిత అభివృద్ధిని సాధించడానికి బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారం అత్యంత కీలకమనిప్రధాని నరేంద్రమోడీ నొక్కి చెప్పారు. న్యూఢిల్లీ వేదికగా జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీమాట్లాడుతూ సదస్సుకు హాజరైన సభ్య దేశాల అధినేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తదుపరి బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం ఇవ్వనుండటంతో, ఆ దేశానికి ప్రధాని మోడీ శుభాకాంక్షలు తెలియజేశారు. పపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఘర్షణల వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికత, కీలకమైన ఖనిజాలను కొన్ని శక్తులు ఆయుధాలుగా మార్చుకోవడంపై ఆయన తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. బ్రిక్స్ కూటమి మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న తరుణంలో, ప్రపంచం ఈ కూటమి నుంచి కేవలం ఆలోచనలు, వాగ్దానాలు కాకుండా ఉపయోగకరమైన ఫలితాలను ఆశిస్తోందని మోడీ స్పష్టం చేశారు. ఈ సదస్సులో ఆమోదించిన న్యూఢిల్లీ డిక్లరేషన్ కూటమి భవిష్యత్ దార్శనికతకు, పరస్పర సహకారానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్‌సిసి, ఇథియోపియా ప్రధాని అబీయ్ అహ్మద్ అలీ, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ వంటి పలువురు దేశాధినేతలు పాల్గొన్నారు. వీరితో పాటు ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, పలు దేశాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

## బ్రిక్స్ సదస్సుపై విదేశీ మీడియా ప్రశంసలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** భారత్ అధ్యక్షతన న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో సభ్య దేశాల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి, ఒక బలమైన ఉమ్మడి ప్రకటనపై ఏకాభిప్రాయం సాధించడంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక దౌత్య విజయం సాధించారు. భారత్ చొరవతో రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సు విజయవంతంగా ముగిసింది. సదస్సులో 10 పూర్తిస్థాయి సభ్య దేశాలతో పాటు సౌదీ అరేబియా కూడా పాల్గొంది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా సంయుక్త తీర్మానాన్ని ఆమోదించాయి. ఈ తీర్మానంలో ఏ దేశం పేరునూ నేరుగా ప్రస్తావించనప్పటికీ, అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, పరిస్థితిని మరింత దిగజార్చే చర్యలకు పాల్పడవద్దని పిలుపునిచ్చాయి. పౌర మౌలిక సదుపాయాలు, అణు కేంద్రాలపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు జపాన్ టైమ్స్ తన కథనంలో హైలైట్ చేసింది. ప్రపంచ వాణిజ్యం, సరఫరా గొలుసులు, ఇంధన ప్రవాహానికి అంతరాయం కలగకుండా చూసేందుకు సమష్టి కృషి అవసరమని ఈ ప్రకటన నొక్కి చెప్పిందని అల్ జజీరా పేర్కొంది. సదస్సు ప్రారంభోపన్యాసంలో ప్రధాని మోడీ, బ్రిక్స్ కూటమికి రాబోయే 20 ఏళ్లకు సంబంధించి ఒక ప్రతిష్టాత్మక విజన్‌తో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# శ్రీశైలం ఖాళీ!

>> తగ్గి పండ్ల తోటల పరిస్థితి ఇంకా ఆందోళనలోకి నెట్టి వేస్తోంది. గత రెండు దశాబ్దాల కాలంలో పండ్ల తోటల సాగు సీమ జిల్లాల్లో విపరీతంగా పెరిగింది. ఇప్పుడు ఎల్‌నినో ప్రభావం వల్ల పండ్ల తోటల రైతుల బాధలు వర్ణనాతీతం.

రాయలసీమ జిల్లాల్లో పెన్నాలో సహజ ప్రవాహం లేదు.. ఇన్నాళ్లు రైతుల్లో ఆశలు లేపిన తుంగభద్ర జలాశయంలో ఇన్‌ఫ్లో నిలిచిపోయింది.. ఇప్పుడు శ్రీశైలం జలాశయం నీళ్లే రాయలసీమ ప్రాంతానికి ప్రధాన ఆధారం. రాయలసీమ జిల్లాలో పలు రిజ ర్వాయర్లు ఉన్నాయి.. కాలువలు ఉన్నాయి.. లిఫ్ట్ పథకాలు ఉన్నాయి.. కానీ వాటిని నింపే తాజా ఇన్‌ఫ్లోలు లేకపోవడం ఆందోళన కలిగిస్తుంది.

రాయలసీమలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు సాగునీటి వ్యవస్థపై, మంచి నీటి వ్యవస్థ పై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. చెరువుల్లోకి, కాలువల్లేకి నీరు వచ్చి ఉంటే భూగర్భ జలం పెరిగి వివిధ రూపాల్లో ఫలితం ఉండేది. ముఖ్యంగా అనంత పురం జిల్లాలో ఎన్నో చెరువులు ఎండిపోయి వట్టి కుండల్లా దర్శనమిస్తున్నాయి. చెరువుల్లో పశు వులు, మేకలు, గొర్లుతాగేందుకు నీళ్లు లేని పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు.. గతంలో కొన్ని యేళ్ల కిందట కోస్తా జిల్లాల నుంచి అనంతపురం జిల్లాకు పాలక ప్రభుత్వాలు వరిగడ్డి సరఫరా చేసిన సంఘటనలు ఉన్నాయి. ఈ యేడాది సెప్టెంబరు 11 నాటికి రాయలసీమలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం 138.8 మిమీ మాత్రమే నమోదైంది. సాధారణం 319.8తో సరిచూస్తే 56.6శాతం లోటు ఉంది. రాయలసీమలో జిల్లాల వారీగా వర్ష పాతం వివరాలు పరిశీలిస్తే.. అనంతపురంలో 48 శాతం, శ్రీ సత్యసాయి 63శాతం, అన్నమయ్య 78శాతం, చిత్తూరు 65శాతం, వైయస్సార్ కడప జిల్లాలో జిల్లాలో 59శాతం, నంద్యాలలో 55 శాతం, కర్నూలులో 47శాతం వర్షపాతం లోటుగా నమోదైంది. ఈ ప్రభావం నదులు, చెరువులు, కాలువలు, రిజర్వాయర్ల పైన స్పష్టంగా కనిపిస్తోంది. రాయలసీమకు రిజర్వాయర్లు. కాలువలు,ఎత్తిపోతలపథకాలు ఉన్నాయి.. కానీ ఈ ఏడాది వాటిని నింపాల్సిన సహజ వర్షాలు, వరద ప్రవాహాలే భారీగా తగ్గిపోయాయి.

ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలోకి వచ్చే నీరు నిలిచిపోయింది. పెన్నా బేసిన్‌లో అనేక రిజర్వాయర్‌లకు తాజా ఇన్‌ఫ్లో జీరోగా ఉన్నాయని చెప్పవచ్చు. శ్రీశైలం జలాశయంలోకి వస్తున్నది కేవలం 800 క్యూసెక్కులు మాత్రమే. కానీ శ్రీశైలం నుంచి రాయలసీమ అవసరాలకు వేల క్యూసెక్కుల నీరు తీసుకోవాల్సి వస్తోంది. దీనితో పోతిరెడ్డిపాడు -బనకచర్ల- జీఎన్ఎస్ఎస్/ ఎస్.ఆర్.బి.సి- గోరకల్లు- అవుకు- గండికోట హెచ్.ఎన్.ఎస్.ఎస్- జీడిపల్లి, పిఎబిఆర్‌లలో రాయలసీమ నీటి భద్రతకు శ్రీశైలం నిల్వల ప్రాధాన్యత మరోసారి స్పష్టమవుతోంది. ఇదే సమయంలో తుంగభద్ర హెచ్ఎల్‌సి, కెసి కెనాల్ వ్యవస్థకు తాజా ఇన్‌ఫ్లోలు రావడం కూడా చాలా అవసరం. రాయలసీమలో సగటు భూగర్భజల మట్టం 14.46 మీటర్ల దిగువన ఉండగా, గత యేడాది ఇదే సమయంలో 9.44 మీటర్లు. అంటే సంవత్సరానికి 5.02 మీటర్ల క్షీణత నమోదైంది.

ఇప్పుడు రాయలసీమకు కావాల్సింది ఒకటి రెండు రోజుల చెదురుమదురు వర్షాలు కాదు. ఎగువ కృష్ణా- తుంగభద్ర పరివాహక ప్రాంతాలతో పాటు పెన్నా పరివాహక ప్రాంతంలోనూ విస్తృతంగా, నిరంతరంగా కురిసే భారీ వర్షాలు. అప్పుడే రిజర్వాయర్‌లకు తాజా ఇన్‌ఫ్లోలు వస్తాయి... శ్రీశైలంపై ఉన్న అసాధారణ ఒత్తిడి తగ్గుతుంది. తుంగభద్రలో నిల్వ ఉంది... కానీ కొత్త నీరు రావడం లేదు... తుంగభద్ర డ్యామ్‌లో 105.788 టిఎంసిల సామర్థ్యానికి గాను 89.73 టిఎంసిల నీరు ఉంది. కానీ ఆంధ్ర, కర్ణాటక ఉమ్మడి ప్రాజెక్టు అయినా తుంగభద్ర జలాశయం నుంచి సెప్టెంబరు 11న ఇన్ ఫ్లో 0 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 10,549 క్యూసెక్కులు ఉంది. అంటే ప్రస్తుతం ఉన్న నిల్వలనే వినియోగించాల్సిన పరిస్థితి. గత యేడాది ఇదే రోజున తుంగభద్రలో 80 టిఎంసిల నీరు నిల్వ ఉండగా, 19,565 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఈసారి నిల్వ ఎక్కువగా ఉన్నా తాజా ఇన్‌ఫ్లో లేకపోవడం గమనించదగ్గ విషయం. ఈ నేపథ్యంలో రాయలసీమకు ఇప్పుడు శ్రీశైలం జలాశయం నీళ్లు ఎంతో కీలకం అయ్యాయి. శ్రీశైలం నీళ్ల విషయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఇప్పటికే వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. శ్రీశైలం జలాశయం నీళ్ల విషయానికొస్తే 215.807 టిఎంసిల పూర్తి సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో 124.53 టిఎంసిల నీరు మాత్రమే ఇప్పుడు ఉంది. జలాశయంలో నీటిమట్టం 865.60 అడుగులు వరకు ఉంది. మరోవైపు ప్రస్తుతం ఇన్‌ఫ్లో కేవలం 800 క్యూసెక్కులు మాత్రమే ఉండగా, మొత్తం ఔట్ ఫ్లో 32,684 క్యూసెక్కులు ఉంది.అంటే వస్తున్న నీటి కంటే దాదాపు 41 రెట్లు ఎక్కువ నీరు బయటకు వెళుతోంది. అయినా రాయలసీమ అవసరాల కోసం శ్రీశైలం నుంచి నీరు తీసుకోవాల్సిన పరిస్థితి కొనసాగుతోంది అని లెక్కలు చెబుతున్నాయి. పోతిరెడ్డిపాడు 8,000 క్యూసెక్కులు, మల్యాల హెచ్ఎన్ఎస్ఎస్ 2,005 క్యూసెక్కులు, ముచ్చుమర్రి కెసిసి ఎల్ఐఎస్ 720 క్యూసెక్కులు, వెలిగొండ 3,500 క్యూసెక్కులు విడుదలలు నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో రాయలసీమ జిల్లాల్లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సి ఉంది. ప్రస్తుతం ఎండాకాలం తలపించే విధంగా ఎండలు ఉండడం, ఆకాశంలో మేఘాలే కనిపించకపోవడం, చెరువుల్లో నీళ్లే లేకపోవడం, భూగర్భ జలమట్టం గణనీయంగా తగ్గిపోతున్నడంతో శ్రీశైలం, తుంగభద్ర జలాశయం నీళ్లపైనే సీమ ప్రజలకు గంపెడి ఆశలున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో అదనపు నీళ్ల కోసం ఏ విధంగా ప్రయత్నం చేస్తారో.. ఉన్న నీటిని ఏ విధంగా పొదుపుగా వాడుకుంటారో వేచి చూడాల్సిందే.

**అమరావతిలో ఐకానిక్ భవనాల నిర్మాణం**

## రెండేళ్లలో పూర్తి చేస్తాం!

### మున్సిపల్, పట్టణాభివృద్ధి మంత్రి నారాయణ

**విజయవాడ, సెప్టెంబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో ఐకానిక్ భవనాల నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేసేలా పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సూచించారు. నిర్దిష్ట ప్రణాళికలను ఏ మాత్రం అలసత్వం లేకుండా అమలు చేస్తూ నిర్మాణం పనులు సాగాలన్నారు.అధికారులు నిర్మాణ పనుల్లో తీసుకుంటున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. అయినప్పటికి నిర్మాణ పనులు వేగవంతంగా సాగాలన్నారు. రాజధాని అమరావతిలో కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిపై అధికారులకు కీలకాదేశాలు జారీ చేసారు. రాయపూడిలోని సిఆర్‌డిఏ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షకు ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాలకృష్ణారెడ్డి, చీఫ్ ఇంజినీర్లు, వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. సమీక్షలో ప్రధానంగా అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. జిఎడి టవర్, హెచ్‌ఓడి టవర్లు, అసెంబ్లీ భవన నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయనే అంశాలను అధికారులు మంత్రికి వివరించారు. అమరావతిలోని ఐకానిక్ భవనాలకు సంబంధించి ఐదు టవర్లకు స్టీల్ డయాగ్రిడ్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. నిర్మాణ పనుల్లో సాధించిన పురోగతిని, ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరాలను సమీక్షలో వెల్లడించారు. అసెంబ్లీ భవన నిర్మాణానికి సంబంధించి కీలకమైన స్పైర్ (ఎత్తైన శిఖరం) నిర్మాణ పనులను వారం రోజుల్లో ప్రారంభించనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రతినిధులు మంత్రికి తెలిపారు. అసెంబ్లీ భవన నిర్మాణంలో స్పైర్ పనులు ప్రారంభం కానుండటంతో తదుపరి దశ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణ పనులను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం వేగంగా పూర్తి చేయాలని అధికారులను, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ఆదేశించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

## పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సిఎం చంద్రబాబు, ఆర్జిత సేవలు,ప్రత్యేక దర్శనాలు రద్దు

**తిరుమల,సెప్టెంబరు 13ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతునికి స్వయంగా బ్రహ్మదేవుడే నిర్వహించే బ్రహ్మోత్సవాలు తిరుమలలో నేటి సాయంత్రం తొలిఘట్టంగా అంకురార్పణ జరగనుంది. ఈ యేడాది రెండు దఫాల బ్రహ్మోత్సవాల్లో తొలిగా సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు రేపటి నుండిప్రారంభం కానున్నాయి. వైఖానస ఆగమ సాంప్రదాయం ప్రకారం నేటి రాత్రి 7గంటల నుండి 8 గంటల మధ్యలో నిర్వహించే అంకురార్పణ ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు బీజం పడనుంది. ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఆగమశాస్త్రం ప్రకారం ప్రతి వైదిక ఉత్సవానికి ముందు అంకురార్పణ చేపడతారు. నవధాన్యాలను మొలకెత్తించి ఈ భూమండలమంతా పాడిపంటలతో, పశుపక్ష్యాదులతో సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తారు.

**సేనాధిపతి ఉత్సవం:**

శ్రీవారిసర్వ సైన్యాధ్యక్షుడు విష్వక్సేనులని ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. జగద్రక్షకుడైన శ్రీవారికి నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు విష్వక్సేనులు ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతారు. నవధాన్యాలు మొలకెత్తేందుకు అవసరమైన పుట్టమన్ను కోసం ముందుగా భూదేవిని ప్రసన్నం చేసుకునేందుకు మేదినిపూజ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అర్చకులు భూసూక్తాన్ని పఠిస్తారు.

**నేడు అంకురార్పణ:**

వైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురార్పణ ముఖ్యమైనది. ముందుగా పాలికల్లో(మట్టికుండలు) పుట్టమన్ను నింపుతారు. వీటిలో నవగ్రహాలకు సంకేతంగా నవధాన్యాలు పోస్తారు. ఈ విత్తనాలు బాగా మొలకెత్తాలని కోరుతూ ఓషధీసూక్తాలను పఠిస్తారు. యాగశాలలో ఈ పాలికల చుట్టూ అష్టదిక్పాలకులైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నిర్రృతి, వరుణుడు, వాయుదేవుడు, కుబేరుడు, ఈశానతోపాటు మొత్తం 49 మంది దేవతలను ఆవాహన చేస్తారు. ఈ పాలికల్లోని నవధాన్యాలను బ్రహ్మోత్సవాల తొమ్మిదిరోజుల పాటు పెంచుతారు. చివరిరోజున ఈ మొలకలను వేరుచేసి స్వామివారికి అక్షతారోపణ చేస్తారు. ఈ మొలకలు ఎంత గొప్పగా చిగురిస్తే బ్రహ్మోత్సవాలు అంత ఘనంగా నడుస్తాయని భక్తుల విశ్వాసం స్వయంగా బ్రహ్మదేవుడు నిర్వహించే తిరుమలేశుని సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఏడుకొండలు సిద్ధమయ్యాయి. తిరుమలలో అంగరంగవైభవంగా తొమ్మిది రోజులు పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు మంగళవారం (రేపు)సాయంత్రం జరిగే ధ్వజారోహణంతో ఉత్సవాల వేడుకలు మొదలుకానున్నాయి. శ్రీదేవిభూదేవి ఉభయదేవేరులతో కలసి మలయప్ప స్వామికి మంగళవారం ఉదయం బంగారువాకిలిలో విశేష సమర్పణ చేస్తారు. యాగశాలలో సంప్రదాయ కార్యక్రమాల అనంతరం ఉత్సవర్లతో బాటు అనంత,గరుడ,చక్రత్తాళ్వార్, సేనాధిపతి ధ్వజపటం తదితరాలు తిరుచ్చిలో నాలుగు మాఢవీధుల ప్రదక్షిణగా ఆలయానికి వేంచేపుచేస్తారు. సాయంత్రం మీనలగ్నంలో ధ్వజస్తంభంపైకి గరుడపటాన్ని అధిరోహిస్తారు. ఈ గరుడపటం ధ్వజారోహణంతో వెంకన్న బ్రహ్మోత్సవ వాహనసేవలు మొదలవుతాయి. మంగళవారం రాత్రికి రాష్ట్రప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు పట్టువస్త్రాలు సమర్పిస్తున్నారు. తొలి వాహనంగా మంగళవారం రాత్రి 9గంటలకు వైకుంఠ శ్రీమహావిష్ణువు కలియుగప్రత్యక్షదైవంగా శ్రీనివాసుడు అవతారంలో ఏడుతలల పెద్దశేషవాహనంపై అధిరోహించి ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతారు. 22వతేదీ మంగళవారం రాత్రి అశ్వవాహన సేవవరకు వివిధ వాహనసేవలు ఉదయం,రాత్రి వేళల్లో ఆగమోక్తంగా జరుగుతాయి. బ్రహ్మోత్సవాలలో ఐదవరోజురాత్రి జరిగే గరుడసేవకు ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఈ ఆనవాయితీని 2004 నుండి బ్రహ్మోత్సవాల ప్రారంభంరోజే సమర్పించడం జరుగుతుంది.



అనంతరం రంగనాయకుల మండపంలో 2027కు సంబంధించిన నూతన సంవత్సర క్యాలండర్లు, డైరీలను ఆవిష్కరిస్తారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమల ఆలయంలో జరిగే సుప్రభాతం మినహా మిగిలిన తోమాల,అర్చన ,కల్యాణోత్సవం, డోలోత్సవం, ఆర్జితబ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలుతోబాటు తొమ్మిదిరోజులు అన్ని ప్రత్యేక ప్రవేశ దర్శనాలు రద్దుచేశారు. పూర్తిగా సర్వదర్శనంలో మాత్రమే భక్తులకు దర్శనం కల్పిస్తారు.

**రేపటి సిఎం పర్యటనకు భద్రత తనిఖీలు :**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం సాయంత్రం తిరుమలకు విచ్చేసి వెంకన్నకు పట్టువస్త్రాలు సమర్పించనున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం భద్రతపరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. మంగళవారం సాయంత్రం చంద్రబాబు తిరుపతి, తిరుమలలో పర్యటించనున్నారు. భద్రత పరంగా అనుసరించాల్సిన వ్యూహం, చర్యలపై ఆదివారం సాయంత్రం తిరుపతిజిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్‌పి లంకెల సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, శ్రీనివాసులు, డిఎస్పీలు, సిఐలు కలసి రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుమలకు కాన్వాయ్‌ట్రయల్‌రన్ చేరింది, తిరుమలలో పద్మావతి విశ్రాంతి గృహం, బేడి ఆంజనేయస్వామి ఆలయం, శ్రీవారి ఆలయం, తిరిగి వాహనమండపం, అతిదిగృహం చేరుకోనుండటంతో పరిసరాల్లో భద్రత పరంగా తీసుకోవాల్సిన చర్యలపై తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణకు, డిఎస్పీ విజయశేఖర్‌కు ఎస్పీ సూచనలు చేశారు.

### వారం - వర్జ్యం

**14-09-2026, సోమవారం**
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,
తి.తదియ ఉ.7.08, న.చిత్త మ.1.59
వ.రా.7.55 - రా.9.36
దు.మ.12.27 - మ.1.16
2) మ.2.55 - మ.3.43
రాహు ఉ.7.30-ఉ.9.00.
శుభ స. ఉ.6.00-ఉ.7.00

### వార్తాఫలం

**మేషం :** చాలా వరకు మీ అంచనాలకు అనుగుణంగానే నేడు కాలం గడుస్తుంది. వస్తువులను కొనుగోలు చేస్తారు.

**వృషభం :** ఉల్లాస భరితంగా కాలం గడుపుతారు. కష్టించి పనిచేసే తత్వం వలన లాభపడతారు.

**మిథునం :** మీ పరోక్షంలో మీపై నేరారోపణలు చేస్తున్న వారిని గుర్తించగలుగుతారు. స్వల్ప ధనలాభ సూచన.

**కర్కాటకం :** గృహోపకరణ వస్తువులను కొనుగోలు చేస్తారు. కాంట్రాక్టుదారులకు లాభసాటిగా ఉంటుంది.

**సింహం :** ప్రశాంతత కలిగి ఉంటారు. వాయిదా వేయకుండా పనులను సానుకూల పరచుకోవడం చెప్పదగినది.

**కన్య :** సంతాన ఆరోగ్య విషయంలో శ్రద్ధను కనబరచవలసి ఉంటుంది. రాయబారాలు సాగిస్తారు

**తుల :** రహస్య సంప్రదింపులు జరుపుతారు. ముఖ్యమైన అగ్రిమెంట్లలోని కీలకమైన లోపాలు మీ దృష్టికి వస్తాయి.

**వృశ్చికం :** క్రమబద్ధమైన ప్రణాళికలను రూపొందించుకుంటారు. ద్రవ పదార్థాలను అధికంగా స్వీకరిస్తారు.

**ధనుస్సు :** ఆత్మీయ వర్గానికి సహాయ పడతారు.ఉన్నత విద్యాభ్యాసానికి మార్గాలు సుగమం అవుతాయి.

**మకరం :** ఇరువర్గాల మధ్యలో సయోధ్యను కుదర్చగలుగుతారు. ప్రశాంతత కలిగి ఉంటారు. దైవదర్శనం చేసుకుంటారు.

**కుంభం :** ఆర్థికంగా చెప్పుకో దగిన ఇబ్బందులు చోటు చేసుకోవు. సంగీత సాహిత్యాలపట్ల శ్రద్ధను కనబరుస్తారు.

**మీనం :** కఠినమైన మనస్తత్వం కలిగిన వారితో కలిసి పనిచేయవలసి వస్తుంది. హాస్య ప్రియత్వం కలిగి ఉంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

### వారం - వర్జ్యం

**15-09-2026, మంగళవారం**
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,
తి.చవితి ఉ.7.45, న.స్వాతి మ.3.24
వ.రా.9.29 - రా.11.13
దు.ఉ.8.22 - ఉ.9.11
2) రా.11.03 - రా.11.52
రాహు మ.3.00-4.30
శుభ స. ఉ.7.55-ఉ.8.15

### వార్తాఫలం

**మేషం :** ఉపాధి మార్గాలు కలిసి వస్తాయి సహోదరీ వర్గం పట్ల మంచి అభిమానం కలిగి ఉంటారు.

**వృషభం :** ఉన్నత విద్యాభ్యాసానికి మార్గాలు సుగమం అవుతాయి. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా కాలాన్ని గడుపుతారు.

**మిథునం :** రాజకీయ, వ్యాపార రంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది.సంగీత సాహిత్యాలపట్ల శ్రద్ధను కనబరుస్తారు.

**కర్కాటకం :** ఒకానొక విషయంలో మీది కేవలం భ్రాంతేనని తేలిపోతుంది.మీ కోరిక నేడు నెరవేరే సూచనలున్నాయి.

**సింహం :** ప్రశాంతమైన మనస్సుతో ఆలోచించి విషయాలను అవగతం చేసుకోవడం మంచిది.దైవదర్శనం చేసుకుంటారు.

**కన్య :** మంచి ఆశయంతో నూతన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా కాలాన్ని గడుపుతారు.

**తుల :** విదేశీయాన వ్యవహారాలు సానుకూల పడతాయి. కీలక వ్యవహారాలలో ఏర్పడిన ప్రతిబంధకాలు తొలగిపోతాయి.

**వృశ్చికం :** హాస్య ప్రియత్వం కలిగి ఉంటారు. చతుర సంభాషణలు సాగిస్తారు. స్నేహితులకు అండదండలుగా ఉంటారు.

**ధనుస్సు :** సంతాన పురోభివృద్ధి మనసు సంతోషానికి కారణం అవుతుంది. అగ్రిమెంట్స్ వాయిదా పడతాయి.శుభవార్తా శ్రవణం.

**మకరం :** పరోపకార బుద్ధి కలిగి ఉండటం వలన మీ ఔన్నత్యం మరింతగా పెంపొందుతుంది. ఆరోగ్యపరంగా జాగ్రత్తలు అవసరం.

**కుంభం :** చిన్నచిన్న విషయాలు తరచుగా మరచిపోతారు. ఆధ్యాత్మిక సంబంధ మైన కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మీనం :** ఆలోచనలలో స్పష్టత ఏర్పడుతుంది. అలంకార సంబంధమైన వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

14-9Pg3exHMNWJQE:14-9Pg3exHMNWJQE.qxd 9/13/2026 11:34 PM Page 1





## గుచ్చిమి ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన నాగబాబు

### గజరాజుల సంరక్షణపై ఆరా, ఖాళీ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని అధికారులకు సూచన

**అమరావతి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలోని గుచ్చిమి ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని ఆంధ్ర ప్రదేశ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు ఆదివారం సందర్శించారు. పర్యటనలో భాగంగా గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో రావి, వేప మొక్కలను నాటారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రతీ ప్రదేశంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. పచ్చదనం పెంపుతోపాటు అటవీ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం ఏనుగుల సంరక్షణ కేంద్రంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను సమీక్షించారు. అడవి ఏనుగుల సంచారాన్ని క్షేత్రస్థాయిలో ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారనే విషయాన్ని ఏనుగుల ట్రాకర్లను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వన్యప్రాణులు–మానవుల మధ్య ఘర్షణలను తగ్గించేందుకు అటవీ శాఖ చేపడుతున్న ముందస్తు చర్యలను పార్వతీపురం డిఎఫ్ఓ ఎస్.వెంకటేష్, ఎఫ్ఆర్ఓ తదితర అధికారులు మ్యాప్ సహాయంతో నాగబాబు వివరించారు. ఏనుగులు సంచరించే అటవీ ప్రాంతాల్లో నెలకొన్న కఠినమైన భౌగోళిక పరిస్థితులు, వాటి కదలికలను పర్యవేక్షించడంలో ఎదురవుతున్న ఇబ్బందులును, క్షేత్రస్థాయి పరిస్థితులను తెలియజేశారు. ఏనుగుల సంరక్షణతోపాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అటవీ శాఖ అధికారులు, సిబ్బంది చేస్తున్న క్షేత్రస్థాయి కృషిని నాగబాబు అభినందించారు. అనంతరం గుచ్చిమి సంరక్షణ కేంద్రంలోని జయంత్, అభిమన్యు అనే రెండు కుంకీ ఏనుగుల మావటిలతోపాటు పశు వైద్యుడిని నాగబాబు కలిశారు. ఏనుగుల ఆరోగ్యం, వాటి సంరక్షణ, ఆహారపు విధానం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుంకీ ఏనుగులకు రాగి, స్వీట్ కార్న్, చెరకు, బెల్లం వంటి ఆహారాన్ని తినిపించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సలహాదారుడు పి. మల్లికార్జున రావు, ఎపిసిసిఎఫ్ రాహుల్ పాండే,సిసిఎఫ్ బి.ఎన్.ఎన్. మూర్తి, విశాఖపట్నం సర్కి ల్ సిసిఎఫ్ ఐ.కె.వి.రాజు, పార్వతీపురం మన్యం డిఎఫ్ఓ ఎస్.వెంకటేష్,విజయనగరం డిఎఫ్ఓ సోమసుందరం పాల్గొన్నారు.

## వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన డి.సిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** మట్టి వినాయకుణ్ణి పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని డీసీఎం పవన్ కల్యాణ్ అన్నారు'ఎక్స్' వేదికగా ఆయన ప్రజలకు గణేష్ చతుర్థి శుభాకాంక్షలు తెలిపారు .విఘ్నాలను తొలగించి, శుభాలను ప్రసాదించే పర్వదినం వినాయక చవితి. అందరూ భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. దేశ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు. ప్రకృతిని దైవ స్వరూపంగా భావించి, నదులను, వృక్షాలను, పర్వతాలను, జీవరాశులను గౌరవించడం మన సంస్కృతిలో అంతర్భాగం. తొలి పూజలందుకునే వినాయకుడి అర్చనలో ఉపయోగించే పత్రి, పుష్పాలు.. వృక్ష సంపదతో ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని చాటుతాయి. వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించుకోవాలని కోరుకుంటున్నాను. సంప్రదాయబద్ధంగా మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామన్నారు. ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు.

## డిఎ మంజూరుపై హర్షం

**విజయవాడ, సెప్టెంబరు 13, ప్రభాతవార్త :** ఉద్యోగులకు కరువు భత్యం మంజూరు చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌కు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌కు రాష్ట్ర ప్రభుత్వానికిఅమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జెఎసి చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఉద్యోగులకు బకాయిలున్న రెండు డిఎలను త్వరగా విడుదల చేయాలన్నారు. రెవెన్యూశాఖలో సహాయకులకు కూడా డిఎలు ఇవ్వాలని కోరారు. విఆర్ఎలకు 2019 వరకు డిఎలు, 2019 నుండి డిఎలను కూడా ఇవ్వాలన్నారు.

## ఆయుధాల చోరీ కేసు..

### మల్లేష్ కస్టడీకి మల్కాజ్‌గిరి కోర్టు అనుమతి

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** బొల్లారం మద్రాస్ రెజిమెంట్‌లో జరిగిన ఆయుధాల చోరీ కేసులో నిందితుడు, మాజీ ఆర్మీ అధికారి మల్లేశ్‌కు రెండు రోజుల కస్టడీకి మల్కాజ్‌గిరి కోర్టు అనుమతించింది. దీంతో ఎల్లుండి(మంగళవారం) నిందితుడిని పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. కేసులో నిందితుడి పాత్ర, ఘటనకు దారితీసిన పరిస్థితులు, అతడితో సంబంధం ఉన్న ఇతర వ్యక్తుల వివరాలపై పోలీసులు ఆరా తీయనున్నారు. ఇప్పటికే దర్యాప్తులో సేకరించిన ఆధారాల ఆధారంగా మల్లేష్ ను ప్రశ్నించి, మరిన్ని కీలక విషయాలను రాబట్టేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. కస్టడీ సమయంలో నిందితుడి నుంచి పూర్తి సమాచారం సేకరించి దర్యాప్తును మరింత ముందుకు తీసుకెళ్లాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసులో మల్లేశ్‌కు ఎవరెవరు సహకరించారు, మరేదైనా కుట్ర ఉందా, గతంలో ఇలాంటి ఘటనలకు పాల్పడ్డాడా అనే కోణాల్లోనూ పోలీసులు విచారణ జరిపే అవకాశం ఉంది. నిందితుడి వాంగ్మూలంతో పాటు ఇప్పటికే తమ వద్ద ఉన్న ఆధారాలను సరిపోల్చిన కేసులో వాస్తవాలను నిర్ధారించనున్నారు. కస్టడీ విచారణ పూర్తయిన అనంతరం మల్లేష్ అలియాస్ రాజును తిరిగి కోర్టులో హాజరుపరచనున్నారు.

## పిడుగుల గర్జనకు ఆగిన గుండెలు

### ఇద్దరు వృద్ధ మహిళలు మృతి

**నరసరావుపేట,సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** పల్నాడు జిల్లాలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం విషాదాన్ని మిగిల్చింది. పిడుగుల భారీ శబ్దానికి భయాందోళనకు గురై వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు వృద్ధ మహిళలు పిడుగుల గర్జనకు కనుమూశారు.ఉరుములు.. మెరుపులతో భయానక వాతావరణం ఏర్పడింది.నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన తల్లపనేని నాగమ్మ (63) శనివారం రాత్రి పిడుగుల భారీ శబ్దానికి ఒక్కసారిగా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అనంతరం గుండెపోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందారు.అదేవిధంగా లక్ష్మీ నృపురం గ్రామానికి చెందిన మేకల వెంకాయమ్మ (60) కూడా పిడుగుల గర్జనకు భయాందోళనకు గురయ్యారు. గుండెపోటు రావడంతో ఆమె ప్రాణాలు కోల్పోయారు.ఒకే మండలంలోని వేర్వేరు గ్రామా ల్లో పిడుగుల గర్జన అనంతరం ఇద్దరు వృద్ధ మహిళలు మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో విషాఛాయలు అలుముకున్నాయి.



ఈదురుగాలులకు ఆటోలపై పడిన వృక్షం



పిడుగుల శబ్దానికి మృతి చెందిన మహిళ(ఫైల్)

# అంటువ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

### రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



**విజయవాడ, సెప్టెంబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** వర్షాల నేపథ్యంలో అంటువ్యాధుల వ్యాప్తికి అవకాశం లేకుండా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. రాష్ట్రంలో మలేరియా, డెంగ్యూ, స్క్రబ్ టైఫస్, టైఫాయిడ్, నీరు–ఆహారం ద్వారా వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పరిస్థితిపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఒ ప్రకటన విడుదల చేశారు కేసులు పెరుగుతున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా మలేరియా ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో మందు పిచికారీ, దోమతెరల పంపిణీ, దోమల పిల్లల నిర్మూలనను ముమ్మరం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో వెంటనే దోమల నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు, వర్షాల కారణంగా నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి దోమల పెరుగుదలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' (ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి నీటిని తొలగించే కార్యక్రమం)ను సమర్థంగా నిర్వహించాలని, ప్రజల భాగస్వామ్యంతో దోమల పెరుగుదల ప్రాంతాలను తొలగించాలని మంత్రి పేర్కొన్నారు. జిల్లాల నుంచి వచ్చే వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పరిస్థితి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో వెంటనే చర్యలు చేపట్టాలని, సంబంధిత శాఖల సమన్వయంతో పారిశుద్ధ్య, దోమల నియంత్రణ కార్యక్రమాలను పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించారు. కేసుల రిపోర్టింగ్ వ్యవస్థను పటిష్టం చేయడం ద్వారా ముందస్తు జాగ్రత్తలు ఇతర చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయమై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. కేసులు కేసులు నమోదు పరిమితికి మించి పెరుగుతున్నప్పుడు వెంటనే అలర్టులు అన్ని స్థాయిలోని వారికి వచ్చేలా వ్యవస్థను రూపొందించుకోవాలని స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో పలు జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలోని వివిధ జిల్లాల్లో అల్పపీడన ప్రభావంతో మోస్తారు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. పలు జిల్లాల్లో ఈదురు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. విజయవాడలోని చిట్టినగర్ కొండప్రాంతంలో వర్షం వల్ల ఓ ఇంటి ప్రహరీ కూలింది. మూడు ఇళ్లపై ప్రహరీ గోడ శిథిలాలు పడ్డాయి. ఇళ్లల్లో ఉన్నవారు బయటకు రావడంతో ప్రాణనష్టం తప్పింది.విజయవాడలో వర్షం ఉదయం నుంచి తెరిపి ఇస్తూ కురుస్తుంది. అర్ధరాత్రి తరువాత నగరంలో కురిసిన వర్షానికి కొన్ని ప్రాంతాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. ఆదివారం ఉదయం 8:30 గంటల వరకు కృష్ణా జిల్లా పెనమలూరులో 100.2మిమీ, అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో 97.6మిమీ, పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో 94.2మిమీ, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో 90.8 మిమీ, బాపట్ల జిల్లా మార్టూరులో 90.6మిమీ, కోనసీమ జిల్లా అయినవిల్లిలో 89.6మిమీ, పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో 88.4 మిమీ, ప్రకాశం జిల్లా అద్దంకిలో 85.4మిమీ, కోనసీమ జిల్లా సనేటిపల్లిలో 84.6మిమీ, గుంటూరు పశ్చిమలో 84.2మిమీ చొప్పున వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖాధికారులు వివరించారు. ఆదివారం ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల నాటికి శ్రీకాకుళం జిల్లా మెట్టక్కివలసలో 34.1మిమీ, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో 33మిమీ, నర్స న్నపేటలో 32.2మిమీ, విజయనగరం జల్లా మల్లంపేటలో 31.2మిమీ, శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళిలో 31మిమీ వర్షపాతం రికార్డైందని వాతావరణ శాఖాధికారులు వెల్లడించారు. మధ్యప్రదేశ్, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర విదర్భ ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే 24 గంటల్లో రాజస్థాన్ , గుజరాత్ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో సోమవారం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు,మార్కాపురం, నంద్యాల, కడప, అన్నమయ్య,చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.మిగతా జిల్లాల్లో చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. 4050 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు.ప్రజలు చెట్ల క్రింద, హోర్డింగ్స్ వద్ద నిలబడరాదన్నారు. అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సముద్రం అల్లకల్లోలంగా మారిన నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మత్స్యకారులకు అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. రానున్న 48 గంటల పాటు ఎవరూ చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదని ఆదేశాలు ఇచ్చింది. సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉన్నందున చిన్న పడవలు, మరబోట్లు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సమాచార వ్యవస్థల ద్వారా సందేశాలు పంపుతున్నారు. తాజా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, పోలీసు, మత్స్య శాఖల అధికారులను అప్రమత్తం చేసింది. విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వాతావరణ

# కాకినాడ సమగ్ర అభివృద్ధికి చర్యలు

### రూ.354కోట్ల తాగునీటి ప్రాజెక్టు. రూ.39 కోట్లతో రహదారులు, రూ.25 కోట్లతో గ్రీనరీ.. రూ.200-250 కోట్లతో యూజీడీ ఏర్పాటుకు కసరత్తు: మంత్రి నారాయణ



కాకినాడ అభివృద్ధి ప్రణాళికను విడుదల చేస్తున్న మంత్రి నారాయణ తదితరులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** కాకినాడ నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు భారీ ప్రాజెక్టులతో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ వార్షిక అభివృద్ధి, ప్రాజెక్టుల పైనిర్వహించిన సమావేశానికి ఇన్చార్జి మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఇతర ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ కాకినాడలో రూ.354 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయని, నీటి కేటాయింపులకు సంబంధించిన జీవో త్వరలో వెలువడనున్నందున పనులను మరింత వేగవంతం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ద్వారా పరిసర మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి సేకరించే ఘన వ్యర్థాలను శుద్ధి చేసి విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. ప్లాంట్‌కు అవసరమైన నీటి సరఫరా సమస్యను కూడా త్వరగా పరిష్కరిస్తా మన్నారు.

నగర పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ఎండ్ టు ఎండ్ రోడ్లు అవసరమని పేర్కొన్న మంత్రి, రహదారుల అభివృద్ధికి రూ.39 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బ్యాలెన్స్ రోడ్లతో పాటు కచ్చా, గ్రావెల్ రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో సెంట్రల్ డివైడర్లు ఏర్పాటు చేస్తామన్నారు. స్వీపింగ్ యంత్రాలు సమర్థంగా పనిచేసేందుకురహదారులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో గ్రీన్ ఏరియాను 50 శాతానికి పెంచాలన్న లక్ష్యానికి అనుగుణంగా కాకినాడలో పార్కులు, గ్రీనరీ అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే టెండర్లు పిలిచామని,త్వరలో ఖరారు చేసి ఏడాదిన్నర నుంచి రెండేళ్లలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాకినాడలో యూజీడీ ప్రాజెక్టు కు రూ.200–250 కోట్ల వరకు నిధులు సమ కూర్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని, యూఐడీఎఫ్3, యూఐడీఎఫ్4 తదితర పథకాల ద్వారా నిధుల సమీకరణకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కన్సల్టెంట్‌ను నియమించి ప్రాజెక్టును త్వరగా ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు,ఎస్ఈ పి. వెంకటరావు,హెల్త్ ఆఫీసర్ డా. పృధ్వి చరణ్, ఈఈలు మాచిరాజు, కనకారావు, మెప్మా పీడీ శైలజ, టౌన్ ప్రాజెక్ట్ మేనేజర్ డి.వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

# బిఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులకు 16న చివరి గడువు

**విజయవాడ, సెప్టెంబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో బిఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సులో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తూ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే విడుదలైన ఈ నోటిఫికేషన్‌లో ఈ నెల 16 సాయంత్రం 7 గంటల వరకు దరఖాస్తుకు గడువు విధించారు. నీట్ యూజీ2026 ర్యాంక్, ఇతర అర్హత ప్రమాణాల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించారు. అభ్యర్థి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన నీట్ యూజీ 2026 పరీక్షకు హాజరై ఉండాలి. అదేవిధంగా ఇంటర్మీడియట్ (10+2 విధానం) లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణ సాధించాలి. ఇందులో ఫిజిక్స్ (భౌతికశాస్త్రం), కెమిస్ట్రీ (రసాయనశాస్త్రం), బయాలజీ (వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం) సబ్జెక్టులు ఉండాలి. ఇంటర్ వొకేషనల్ అయితే బ్రిడ్జ్ కోర్సుతో సహా ఇంగ్లీష్ తప్పనిసరి సబ్జెక్టుగా ఉండాలి. ఓసీ అభ్యర్థులు సైన్స్ సబ్జెక్టుల్లో కనీసం 45 శాతం మార్కులు సాధించాలి. బీసీ/ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు సైన్స్ సబ్జెక్టులలో కనీసం 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థి 31-12-2026 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.అయితే గరిష్ఠ వయో పరిమితి లేదు. దరఖాస్తు ఫీజును ఓసీ అభ్యర్థులకు రూ.2500 (బ్యాంకు ఛార్జీలు అదనం). బీసీ/ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.2,000/ (బ్యాంకు ఛార్జీలు అదనం). ఫీజును డెబిట్ కార్డ్ / క్రెడిట్ కార్డ్ / నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించాలి.

# దశలవారీగా అందుబాటులోకి సీప్లేన్ సేవలు

**అమరావతి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ప్రభుత్వం రాష్ట్రంలో పర్యాటక ఆకర్షణకు కీలక కార్యచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలను సీప్లేన్లతో అనుసంధానించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పది ప్రాంతాల్లో ఏరోడ్రోమ్‌లు అభివృద్ధి చేసి, దశలవారీగా సీప్లేన్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. స్లీ ప్లేను నడిపేందుకు కేంద్రం సాయంతో వాటర్ డ్రోమ్‌ల నిర్మాణ పనులు చేపట్టేందుకు రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ త్వరలో టెండర్లు పిలవనుంది. ప్రతి ఏరోడ్రోమ్ నిర్మాణానికి సుమారు రూ.20 కోట్లు ఖర్చు చేయనున్నారు. 10 ప్రాంతాల్లో కలిపి రూ.200 కోట్లతో మినీ విమానాశ్రయాల తరహాలో మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగానే 10 ప్రాంతాల్లో సీప్లేన్ సేవలను అందించేందుకు స్కై హాప్ ఏవియేషన్, మారిటైం ఎనర్జీ హెలీ ఎయిర్ సర్వీసెస్ మె ఎయిర్ సంస్థలు ముందుకొచ్చాయి. ఈ రెండు సంస్థల ప్రతిపాదనలకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఫలితంగా రాష్ట్రంలో సీప్లేన్ సేవల ఏర్పాట్లు వేగవంతం చేసారు. విజయవాడ నుంచి శ్రీశైలం వరకు సీప్లేన్ ప్రయాణానికి ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించారు. గతేడాది నిర్వహించిన ఈ ట్రయల్ రన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు సీప్లేన్‌లో శ్రీశైలం వరకు



ప్రయాణించారు. ఇప్పుడు ఈ అనుభవాన్ని మరింత విస్తరించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. విజయవాడ, శ్రీశైలం, తిరుపతి పరిధిలోని రాయలచెరువు, సూర్యలంక, గండికోట, కాకినాడ, విశాఖ, అరకు సమీపంలోని జోలాపుట్, లంబసింగి సమీపంలోని తాజంగి రిజర్వాయర్, పోలవరంలో ఏరోడ్రోమ్‌లు అభివృద్ధి చేయనున్నారు. 10 ప్రాంతాల్లో ఒకేసారి సీప్లేన్ సేవలు ప్రారంభించకుండా, ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి దశలవారీగా అందుబాటులోకి తీసుకురానున్నారు. తొలిదశలో విజయవాడ, శ్రీశైలం,విశాఖ, లంబసింగి, సూర్యలంక, కాకినాడ ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. ప్రారంభ దశలో ప్రయాణికుల సంఖ్య, ఆదాయం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆపరేటర్లకు కేంద్ర ప్రభుత్వం ఉడాన్ పథకం కింద విజిఎఫ్– లోటు భర్తీ నిధి ద్వారా కొంతకాలం ఆర్థిక సహాయం అందించనుంది. ఈ ఏరోడ్రోమ్‌లు కేవలం సీప్లేన్ల కోసమే కాకుండా పర్యాటక బోట్లకు కూడా ఉపయోగపడేలా డిజైన్ చేయనున్నారు. విజయవాడ, దిండి, శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాంతాల్లో ఇప్పటికే పర్యాటక బోటింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రైవేట్ సంస్థలకు హౌస్‌బోట్ల నిర్వహణకు కూడా అనుమతులు ఇస్తున్నారు. సీప్లేన్ సేవలు, బోటింగ్, హౌస్‌బోట్ టూరిజంను అనుసంధానం చేసిపర్యాటకులకు మరింత మెరుగైన అనుభూతిని అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది.



## గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుని కలిసిన చిన్న శ్రీను

**విజయనగరం, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీలో చేరిన అనంతరం ఉమ్మడి విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు గోవాలోని గవర్నర్ బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిన్న శ్రీనుతో పాటు ఆయన కుమార్తె మజ్జి సిరి సహస్ర (సిరమ్మ) కూడా గవర్నర్ అశోక్ గజపతిరాజును కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో ఆత్మీయంగా మాట్లాడి, పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు కూడా పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీలో తన కొత్త రాజకీయ ప్రయాణం నేపథ్యంలో అశోక్ గజపతిరాజుని కలసి ఆయన ఆశీస్సులు తీసుకోవడం ఎంతో ఆనందంగా, గౌరవంగా ఉందని చిన్న శ్రీను తెలిపారు. విజయనగరం, ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి పెద్దల సూచనలు, ఆశీస్సులతో ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూసపాటి అశోక్ గజపతిరాజు చిన్న శ్రీనుకి, సిరి సహస్ర (సిరమ్మ)కి శుభాకాంక్షలు, ఆశీస్సులు అందించారు.

## కాణిపాకం బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

### ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఇఒ పెంచల కిషోర్



**కాణిపాకం, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో సోమవారం నుండి ప్రారంభం కానున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసినట్లు ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌లు తెలిపారు. ఆదివారం వారు స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 14 నుండి అక్టోబర్ 4 వరకు 21 రోజుల పాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈమేరకు ఉత్సవాల సందర్భంగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు దేవస్థానం వద్ద విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.వినాయకచవితి రోజున 80 వేల నుండి లక్షమంది వరకు భక్తులు తరలివచ్చే అవకాశమున్నట్లు తెలిపారు., ఈమేరకు ఆలయంలో అర్ధరాత్రి 12 గంటల నుండి 3 గంటల లోపు ఉభయదారులచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన అనంతరం వేకువజామున 4 గంటల నుండి భక్తులకు సర్వదర్శనం వుంటుం దన్నారు.అలాగే వినాయకచవితి రోజున ఉదయం 9 గంటలకు రాష్ట్రదేవాదా యశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరపున సమర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం వినాయకవ్రతకల్పంలో పాల్గొంటారని చెప్పారు. అలాగే భక్తులకు అవసరమైన స్వామివారి లడ్డూ ప్రసాదాలను అందించేందుకు లక్ష లడ్డూలను సిద్దంగా వుంచినట్లు తెలిపారు. దీనితో పాటు ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ఉదయం నుండి రాత్రి వరకు దేవస్థానం తరపున అన్నప్రసాద వి తరణ చేస్తున్నట్లు ఛైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌లు తెలిపారు. అలాగే భక్తుల భద్రతను దృష్టిలో వుంచుకుని 210 సీసీ కెమెరాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఆలయం వద్ద వాహనాల పార్కింగ్‌కు నాలుగు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే దేవస్థానం వద్ద రెండు ప్రత్యేక వైద్య శిభిరాలను ఏర్పాటు చేయడంతో పాటు నాలుగు అంబులెన్స్‌లను, ప్రత్యేక వైద్య నిపుణులను అందుబాటులో వుంచుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ వాహన సేవలను రాత్రి 8 గంటలకల్లా ప్రారంభమయ్యే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ఛైర్మన్ ఈఓలు తెలిపారు.ఉత్సవాల సందర్భంగా 21 రోజుల పాటు ఆలయంలో జరిగే అన్నిరకాల ఆర్జిత సేవలను పూర్తిగా రద్దు చేసినట్లు తెలిపారు.కావున భక్తులు ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకుపాత్రులు కావాలని ఛైర్మన్ మణినాయుడు,ఈఓ పెంచల కిషోర్‌లు తెలిపారు.



దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న దృశ్యం

## దుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవ ఏర్పాట్లకు శ్రీకారం

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 13, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లలో ముఖ్యమైన క్యూలైన్ల నిర్మాణానికి ఆదివారం శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. ఇఒ వికె శీనా నాయక్ కొబ్బరికాయలు కొట్టి పూజాదికాలు అనంతరం ఆనవాయితీ ప్రకారం వినాయకుడి గుడి, ఘాట్ రోడ్డు వద్ద ప్రత్యేక పూజలుఆలయ స్థానాచార్యుల ఆధ్వర్యంలో పూజా క్రతువు నిర్వహించారు. కెనాల్ రోడ్ వినాయక గుడి ప్రాంగణం వద్ద మరియు ఘాట్ రోడ్డు ప్రారంభ ప్రాంతంలో ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పండితులు గణపతి పూజ తదితర వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. **నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం గుంటూరుకు చెందిన దాతలు రు.1,00,116ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. **వేదవిద్యార్థులకు వస్త్రపంపిణీ:** దుర్గమ్మవారి ఆలయ నిర్వహణలో నడుపుతున్న పోరంకి వేదపాఠశాల విద్యార్థులకు ఆదివారం ఇఒ వికె శీనా నాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణలు వస్త్ర పంపిణీ చేశారు.

## ఖైరతాబాద్ మాదిరిగా విజయవాడలో దూండీ గణపతి: మంత్రి సవిత



**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఖైరతాబాద్ వినాయక ఉత్స వాలకు మాదిరిగా దూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏపీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూ ఎస్ సంక్షేమ, చేనేత,జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. విజయవాడ లోని విద్యాధర పురంలో దూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పా టు చేస్తున్న 72 అడుగుల చముఖ వరసిద్ధి మహా గణపతి భారీ విగ్రహం ఆగమన వేడుకను మంత్రి సవిత ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తరవాత ఆరేళ్ల నుంచి భారీ ఎత్తున వినాయక నవరాత్రి ఉత్సవాలను దూండీ గణేశ్ సేవా సమితి నిర్వహిస్తూ వస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత దూండీ గణేశ్ సేవా సమితి మహిళా ప్రతినిధులతో కలిసి కోలాటం ఆడి సందడి చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, కార్పొరేషన్ ఛైర్మన్లు దూండీ రాకేశ్, పేరేపి ఈశ్వరరావు, సినీ నిర్మాత, ప్రముఖ పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

14-9pg4:14-9pg4.qxd 9/13/2026 10:49 PM Page 1



వార్త

మానవునికి తెలిసిన అతి ప్రాచీనమైన దివ్య ఔషధం ఊరట కలిగించే మాటలు నేర్పుగా చెప్పడమే.

న- లూయిస్ నైజర్

# కృత్రిమ మేధ మింగేస్తుందా?


మానవ మేధస్సును మించింది లేదనుకునే పరిస్థితి నుంచి దానికి సమాంతరంగా ధీటుగా వచ్చిన 'కృత్రిమ మేధ'ను కనిపెట్టగలిగాం. అంటే సృష్టికి విశ్వామిత్ర సృష్టి కన్నా మిన్నగా 'ఆంథ్రోపిక్' ఒకటుందని అన్వేషణలో బయటపెట్టాం కానీ ఇప్పుడా కృత్రిమ మేధను కళ్లారా చూసి అదేమీ కనికట్టు కాదని ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం అద్భుతః అని గొప్పగా చెప్పుకుంటున్నాం. తాజాగా మనం సృష్టించిన మేధస్సు ఎప్పటికయినా మనల్ని కాటేస్తుందని చెప్పే విశ్లేషణలు కూడా వస్తున్నాయి. శాస్త్రం ఎంత అభివృద్ధి చెందితే అంత మేలే కానీ అదే మనకు ముప్పుగా పరిగణిస్తుందని వినగానే జనంలో కొంత గాభరా బయలుదేరింది. కళ్లెదుట రోబోలు, డ్రోన్‌ల విన్యాసాలు చూసి టెక్నాలజీ అభివృద్ధిని ఎంతగానో పొగుడుకుంటున్నాం. అలాంటిది కృత్రిమ మేధ మనుషులను చంపడానికి కూడా వెనుకాడదని అనగానే గుండెల్లో గుబులు కాక మరేమిటి? కృత్రిమ మేధ జపం జీవం గురించి మరెన్ని విశ్లేషణలొస్తాయో భవిష్యత్తే చెప్పాలి. కృత్రిమ మేధ (ఎఐ) రంగంలో ఆకాశానికి చేరుకున్న టెక్నాలజీ సంస్థలు సూపర్ ఇంటెలిజెన్స్ దిశగా ఎఐ అభివృద్ధికి నిచ్చెనలు వేస్తూ రానున్న పదేళ్లలో కృత్రిమ మేధ, మానవాళి భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతుందని ఓపెన్ ఎఐలో పనిచేసిన జాకబ్ కాక్సన్ అనే పరిశోధకుడు ముందుగానే హెచ్చరించాడు. తను పనిచేసే కంపెనీలో మంచి జీతం తీసుకుంటూ కూడా కృత్రిమ మేధ భవిష్యత్తులో చేయగల వికృత విన్యాసాలను పరిశీలించిన అనంతరం ఆకస్మికంగా రాజీనామా చేశారు. కృత్రిమ మేధ వల్ల కలిగే నష్టాలను తెలిసీ చెప్పకపోయావో, 'నీ తల వేయిముక్కలవుతుంద'ని భేతాళుడు విక్రమార్కుడిని అన్నట్లుగా అతడినిఎవరూ హెచ్చరించలేదు. గత మూడేళ్లుగా జాకబ్ కాక్సన్ ఎఐతో మమేకమై కృత్రిమ మేధకు సంబంధించిన పరిశోధనలే చేస్తున్నాడు. ఓపెన్ ఎఐ, ఆ తర్వాత ఆంథ్రోపిక్ కంపెనీల్లో పనిచేసి అక్కడ జరుగుతున్న పరిశోధనలను పరిశీలించాడు. కృత్రిమ మేధ కంపెనీలు పరస్పర పోటీ కారణంగా ఎలాంటి ముందు జాగ్రత్తలు లేకుండానే తమ పరిశోధనల్లో వేగం పెంచుతున్న మాట నిజమే. అదే మానవాళి కొంప ముంచుతుందని విశ్లేషించడానికి అతనికి ఎంతో కాలం పట్టలేదు. దీని ఫలితంగా 'దేన్నయినా హ్యాక్ చేయగలం, రాత్రికిరాత్రే ఏ రంగాన్నయినా, ఏ వ్యవస్థనయినా విధ్వంసం చేయగలం' వనరులను స్వాధీనం చేయగలమంటూ కృత్రిమ మేధ కట్టడికి మాత్రం ఎలాంటి ప్రమాణాలు ప్రామాణికంగా ఏర్పాటు చేసుకోకపోవడమూ ఇబ్బందికరమే. ఏ కృత్రిమ మేధ కంపెనీ బాధ్యతాయుతంగా పనిచేయకపోవటమే దీనికంతకూ కారణమని ఆ మాజీ ఉద్యోగి ఆరోపించాడు. ఇదే పరిస్థితి ఆ రంగంలో కృత్రిమ మేధ అభివృద్ధిలో ఎదురౌతుందని అందుకే సరైన ప్రమాదాల పాటింపు ఉండదని వివరించారు. టెక్నాలజీతో పోటీ పడటమే కాదు. దానిని అభివృద్ధి చేసే దిశలో మానవ సమాజానికి నష్టం కలిగించే అంశాలను గుర్తించడంలో విఫలమవుతున్నామని చెప్పారు. ఆంథ్రోపిక్ వేగం ఓపెన్ ఎఐ మరింత వేగం అనే ధోరణిలో సాగుతున్నందున తారతమ్యాలు తెలియని పరిస్థితి ఉందని ఆ పరిశోధకుడు చెప్పారు. అనియంత్రిత టెక్నాలజీ భయాందోళనలు కలిగిస్తోంది. నిజానికి ఈ విషయం ఆ ఉద్యోగి బయటకు చెప్పకపోయినా ఎప్పుడో అప్పుడు కృత్రిమ మేధ ఆందోళన కలిగించేదే. మానవాళిని నిర్వీర్యం చేసి చంపగల ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటెలిజెన్స్ పదేళ్లలో బయటపడ్తుందని ఆయన అంచనా వేశారు. మనిషి ఆలోచనలను దాటే స్థాయికి కృత్రిమమేధ ఉంటుందని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఎంతో కాలం క్రితమే హెచ్చరించినా చాలా మంది మేధావివర్గపు టెక్ దిగ్గజాలు కొట్టిపారేశారు. మనుషుల కన్నా ఎఐ పేరిట మరో మేధావివర్గం ఆవిర్భవిస్తుందంటే నమ్మలేకపోవడం తప్పేకాదు. అది మన మీదమనకున్న ఆత్మవిశ్వాసం. కానీ ఎదురయ్యే పరిస్థితులను అంచనా వేసుకోలేకపోతే మన గొయ్యి మనం తవ్వుకున్నట్లే. ఇప్పటికే 'కృత్రిమ మేధ' శక్తియుక్తులు మనకు అర్థమవుతున్నాయి. విద్యుత్ గ్రిడ్‌లను హ్యాక్ చేయడం, నీటి సరఫరాల నిలిపివేత, ప్రమాదకర జీవాయుధాల రూపకల్పనలో ఎఐ పాత్ర మనకు తెలిసిందే. ఈహెచ్చరికలనేపథ్యం 'కృత్రిమ మేధ' మరికొంత అభివృద్ధి జరిగి 'ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్'గా మారినప్పుడు దాని వలన కలిగే ప్రమాదాన్ని అంచనా వేయడం సాధ్యం కాదని ఎలాన్ మస్క్ అభిప్రాయపడి ఉండవచ్చు. ఎఐ రంగంలో పెట్టుబడులు పెడ్తున్నందున వీటి విషయాల్లో ఆయనకే ఎక్కువ ప్రణాళికలుంటాయి కనుక అధ్యయన అనుశీలనఎక్కువగానే ఉంటుంది. ఒకప్పుడు 'ఎఐ' రంగానికి గాడ్‌ఫాదర్‌గా ఉన్న జెఫ్రీ హింటన్ కూడా ఇలాంటి హెచ్చరికలే చేశారు. ఎజిఐ మేధస్సు మనుషులను మించితే వినాశనం అన్న అధ్యయనం చేసిన ఆయన ఎఐ మోడళ్ల శిక్షణను నియంత్రించాల్సిన ఆవశ్యకత గురించి చెప్పేవారు. ఈ నేపథ్యంలోనే ఆయన సహాధ్యాయిలు గూగుల్ డీప్ మైండ్ సిఇఒ డెమిస్ హసాబిస్ వంటివారు ఎజిఐస్థాయిలో వచ్చే అంతరాయాలను నిరోధించడం మేలని హితవు చెప్పేవారు. మనిషికి తాను సృష్టించిన దానిని నియంత్రించలేని పరిస్థితి ఉంటే అదే భస్మాసుర హస్తం కాగలదు. తప్పుడు సమాచారవ్యాప్తి, ప్రమాదకర లక్ష్యాలతో ఎఐఅభివృద్ధి మానవులే తలపెట్టడం కూడా వాంఛనీయం కాదని మేధా సంపన్నులైన శాస్త్రజ్ఞులు, నిపుణులు ఎఐమోడళ్లను నియంత్రించి ముందడుగు వేయాలి. అంతకన్నా ముందుగా ఎఐమీద నియంత్రణతో ఉండే పరిస్థితిని అధ్యయనంచేసి అందరూ దానికే కట్టుబడి ఉండాలి.

మాటలతో నీ శక్తిని వ్యర్థం చేయక, కార్యరూపంలో సాధించి చూపెట్టు.



స్వామి వివేకానంద

ప్రపంచాన్ని మార్చదలచినవాడు ముందుగా తనను తాను మార్చుకోవడం నేర్చుకోవాలి.



సోక్రటీస్

# భారత్ ప్రత్యామ్నాయ శక్తిగా నిలబడాలి!

**చైనాకు సమర్థమైన సమాధానం ఇవ్వాలంటే వినియోగదారుల చేతుల్లోని బహి ష్కరణ పిలుపు కంటే ప్రభుత్వ విధానాల్లో, పరిశ్రమల సామ ర్థ్యంలో, పరిశోధనా సంస్థల్లో మార్పు రావాలి. చైనాపై ఆధారపడే ప్రతి ఉత్పత్తికి ప్రత్యామ్నాయాన్ని ఒక్కరోజులో సృష్టించడం సాధ్యం కాదు. కానీ పది, ఇరవై సంవత్సరాల దీర్ఘకాలిక ప్రణాళికతో వ్యూహాత్మక రంగాల్లో దేశీయ సామ ర్థ్యాన్ని నిర్మించడం మాత్రం సాధ్యమే. దిగుమతుల మూ లాలను వైవిధ్యీకరించాలి. ఒకే దేశంపై ఆధారపడకుండా జపాన్, దక్షి ణ కొరియా, యూరప్, అమెరికా, ఆగ్నేయాసి యా దేశాలతో సాంకేతిక, పారిశ్రామిక భాగస్వామ్యాలను పెంచుకోవాలి. అదే సమయంలో భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో స్థానకల్పించాలి. చైనాతో వాణిజ్యాన్ని పూర్తిగా తెంచుకోవడం కన్నా, చైనాతో సమానంగా పోటీ చేయగలస్థాయికి భారత్ ఎదగడం అసలు లక్ష్యంకావాలి.**

నందూరి రవిశంకర్

చైనీస్ ఉత్పత్తులను బహిష్కరించాలనే పిలుపులు కొత్తవేమీ కావు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తిన ప్రతిసారీ ప్రపంచంలోని అనేక దేశాల్లో ఈ నినాదం మారుమోగుతూనే ఉంటుంది. భారత్‌లో 1962 యుద్ధం అనంతరం మొదలైన చైనా వ్యతిరేక భావోద్వేగాలు, 2020గల్వాన్ ఘర్షణల తర్వాత మరింత ఉధృతమయ్యాయి. ఐరోపా దేశాల్లో మానవ హక్కుల ఉల్లంఘనలు, జాతీయ భద్రతపై ఆందోళనలు చైనా ఉత్పత్తులపై అనుమానాలను పెంచాయి. అమెరికా వాణిజ్యపరమైన ఆంక్షలు, భారీ సుంకాలు, సరఫరా గొలుసుల వైవిధ్యీకరణ వంటి చర్యలకు దిగింది. వియత్నాం, ఫిలిప్పీన్స్, జపాన్ వంటి దేశాల్లోనూ భౌగోళిక వివాదాలు చైనా వ్యతిరేక భావనలకు ఆజ్యం పోస్తున్నాయి. అయితే ఒక కీలకమైన ప్రశ్నకు మాత్రం ఈ బహిష్కరణ ఉద్యమాలు సమాధానం చెప్పలేకపోతున్నాయి. చైనా ఉత్పత్తులను నిజంగా ప్రపంచ మార్కెట్ల నుంచి దూరం చేయగలిగాయా? సమాధానం స్పష్టంగా లేదు. రాజకీయంగా చైనాను వ్యతిరేకిస్తున్న దేశాలే ఆర్థికంగా చైనాపైనే ఆధారపడాల్సి వస్తోంది. వినియోగదారులు చైనా వస్తువులను బహిష్కరించాలని పిలుపునిస్తున్నా, సరసమైన ధర, విస్తృత లభ్యత, భారీ ఉత్పత్తి సామర్థ్యం కారణంగా ఆ వస్తువులు మళ్లీ మార్కెట్లలోకి చేరుతున్నాయి. ఇది కేవలం చైనా బలమేకాదు. ప్రపంచ సరఫరా గొలుసుల్లో అది ఎంత లోతుగా పాతుకుపోయిందో సూచించే వాస్తవం. వాణిజ్యం భావోద్వేగాలతో నడవదు. ధర, నాణ్యత, సరఫరా, సాంకేతిక సామర్థ్యం, మార్కెట్ అవసరం వంటి అంశాలే చివరికి వినియోగదారుడి నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. చైనాను రాజకీయంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ, చైనా ఉత్పత్తులు తక్కువ ధరకులభిస్తే వాటిని కొనుగోలు చేయడానికి ప్రపంచ వినియోగదారులు వెనుకాడటం లేదు. ఇదే చైనా ఆర్థిక వ్యూహానికి ఉన్న బలమైన పునాది. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పారిశ్రామిక విడిభాగాలు, సోలార్ పరికరాలు, రసాయనాలు, ఔషధ పరిశ్రమకు అవసరమైన ముడిసరకులు. ఇలా అనేక రంగాల్లో చైనా ప్రపంచ ఉత్పత్తి వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోంది. ఒక దేశం చైనా నుంచి తుది ఉత్పత్తుల దిగుమతులను తగ్గించినా, ఆ ఉత్పత్తి తయారీలో ఉపయోగించే విడిభాగాలు, యంత్రాలు లేదా ముడిసరకుల రూపంలో చైనాతో సంబంధం కొనసాగుతూనే ఉంటుంది. అందుకే చైనా వస్తువులను బహిష్కరించండి అనే పిలుపు వినడానికి దేశభక్తి నినాదంలా అనిపించినా, దాని ఆర్థిక ప్రభావం పరిమితమే. బహిష్కరణకంటే ప్రత్యామ్నాయ ఉత్పత్తిసామర్థ్యాన్ని నిర్మించడం ఎంతో ముఖ్యమైనది. చైనా ఆర్థిక శక్తిగా ఎదగడం ఒక్కరోజులో జరిగిన పరిణామం కాదు. భారీ మౌలిక సదుపాయాల పెట్టుబడులు, పారిశ్రామిక విధానాలు, ఎగుమతులకు ప్రోత్సాహం, పరిశోధన అభివృద్ధికి ప్రాధాన్యం, ప్రపంచ వాణిజ్యంతో అనుసంధానం ఇవన్నీ దశాబ్దాలపాటు అమలు చేసిన వ్యూహంలో భాగం. విస్తీర్ణం, జనాభా, సహజ వనరులు వంటి ప్రయోజనాలను పారిశ్రామిక సామర్థ్యంగా మార్చుకోవడంలో చైనా విజయవంతమైంది. ప్రపంచానికి అవసరమైన వస్తువులను పెద్దఎత్తున, తక్కువ ధరకు, వేగంగా ఉత్పత్తి చేసే కేంద్రంగా ఎదిగింది. ఫలితంగా రాజకీయంగా చైనాను దూరంగా ఉంచాలనుకునే దేశాలకూ ఆర్థికంగా దాని నుంచి పూర్తిగా విడిపోవడం కష్టసాధ్యమైంది. ఈ వాస్తవాన్ని అమెరికా, ఐరోపా దేశాలు కూడా గుర్తించాయి. అందుకే అవి కేవలం బహిష్కరణ పిలుపులతో ఆగిపోవడం లేదు. దేశీయ తయారీకి ప్రోత్సాహకాలు, వ్యూహాత్మక రంగాల్లో పెట్టుబడులు, సరఫరా గొలుసుల వైవిధ్యీకరణ, చైనా ఉత్పత్తులపై సుంకాలు వంటి చర్యలను చేపడుతున్నా



యి. ఇది భారత్‌కు కూడా కీలకమైన పాఠం. చైనాతో సరిహద్దు వివాదాలు, గల్వాన్ ఘర్షణలు, భద్రతా పరమైన ఆందోళనలు ఉన్నప్పటికీ భారత్ ఆర్థికంగా చైనాపై ఆధారపడాల్సి వస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా' వోకల్ ఫర్‌లోకల్, ఆత్మనిర్భర్ భారత్, వంటి కార్యక్రమాల లక్ష్యం ఇదే ఆధార పడటాన్ని తగ్గించడం. కానీ వాస్తవ పరిస్థితి చూస్తే ప్రయాణం ఇంకా పూర్తికాలేదు. భారత పరిశ్రమలకు అవసరమైన పారిశ్రామిక విడిభాగాలు, ఎలక్ట్రానిక్ భాగాలు, ముడి సర కులు, యంత్ర పరికరాల విషయంలో చైనా కీలక సర ఫరాదారుగా ఉంది. ఫలితంగా చైనా నుంచి భారత దిగు మతులు గత దశాబ్దంలో గణనీయంగా పెరిగాయి. అదే సమయంలో చైనాకు భారత ఎగుమతులు ఆశించిన స్థాయి లో పెరగకపోవడం మరింత ఆందోళన కలిగించే అంశం. ఈ అసమతుల్యత కొనసాగితే ద్వైపాక్షిక వాణిజ్య లోటు మరింత విస్తరించే ప్రమాదం ఉంది. ఇది కేవలం వాణిజ్య లోటు సమస్య కాదు. ఒక దేశం కీలక ఉత్పత్తుల కోసం మరో దేశంపై అధికంగా ఆధారపడితే, అది ఆర్థిక భద్రతకు సంబంధించిన అంశంగా మారుతుంది. యుద్ధ సమయంలో ఆయుధాలు ఎంత కీలకమో, ఆర్థిక పోటీ సమయంలో సరఫరా గొలుసుల నియంత్రణ అంతే కీలకం. చైనా ఉత్పత్తుల విషయంలో ఆర్థిక అంశాలతో పాటు డేటాభద్రత, సైబర్ భద్రత, జాతీయ భద్రత వంటి అంశాలూప్రాధాన్యం సంతరించుకున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, యాప్‌లు, కమ్యూనికేషన్ పరికరాలు కోట్లాది మంది వినియోగదారుల వ్యక్తిగత సమాచారంతో ముడిపడి ఉంటాయి. అందువల్ల ఏ దేశమైనా విదేశీ సాంకేతిక ఉత్పత్తులవిషయంలో భద్రతాప్రమాణాలను కఠినంగా పరిశీలించాల్సిందే. అయితే భద్రత పేరుతో ప్రతి చైనా ఉత్పత్తినీ తిరస్కరించడం పరిష్కారం కాదు. సాంకేతిక సామర్థ్యాన్ని మనమే అభివృద్ధి చేసుకోవడం, డేటా రక్షణ చట్టాలను బలోపేతం చేయడం, దేశీయ పరిశోధనకు పెట్టుబడులు పెంచడం, నమ్మకమైన అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి ప్రత్యామ్నాయ సాంకేతిక పర్యావరణాన్ని నిర్మించడం అవసరం. భారత్ ముందున్న అతిపెద్ద అపోహ ఇదే. ఆత్మనిర్భరత అంటే ప్రతి వస్తువునూ దేశంలోనే తయారు చేసుకోవడం కాదు. ప్రపంచ వాణిజ్యంతో సంబంధాలు తెంచుకోవడం అంతకన్నా కాదు. అవసరమైన చోట దిగుమతులు చేసుకుంటూనే, వ్యూహాత్మక రంగాల్లో విదేశీ ఆధారపడటాన్ని తగ్గించడమే నిజమైన స్వావలంబన. రక్షణ, పునరుత్పాదక ఇంధనం, ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలు ఫలితాలు ఇస్తున్నాయి. ఇదే నమూనాను సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, యంత్ర పరికరాలు, అధునాతన తయారీ సాంకేతికత, కీలక రసాయనాలు వంటి రంగాలకు విస్తరించాలి. దేశీయ పరిశ్రమలకు కేవలం రక్షణ కల్పిస్తేసరిపోదు. ప్రపంచస్థాయినాణ్యత, ధర, ఉత్పాదకతను సాధించేలా వాటిని తీర్చిదిద్దాలి. లేకపోతే చైనా ఉత్పత్తులను నిషేధించినా వినియోగదారులు అధిక ధరలకు తక్కువ నాణ్యత కలిగిన ప్రత్యామ్నాయాలను కొనుగోలు చేయాల్సి వస్తుంది. అది దీర్ఘకాలికంగా దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు చేయదు. చైనాకు సమర్థమైన సమాధానం ఇవ్వాలంటే వినియోగదారుల చేతుల్లోని బహిష్కరణ పిలుపు కంటే ప్రభుత్వ విధానాల్లో, పరిశ్రమల సామర్థ్యంలో, పరిశోధనా సంస్థల్లో మార్పు రావాలి. చైనాపై ఆధారపడే ప్రతి ఉత్పత్తికి ప్రత్యామ్నాయాన్ని ఒక్కరోజులో సృష్టించడం సాధ్యం కాదు. కానీ పది, ఇరవై సంవత్సరాల దీర్ఘకాలిక ప్రణాళికతో వ్యూహాత్మక రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని నిర్మించడం మాత్రం సాధ్యమే. దిగుమతుల మూలాలను వైవిధ్యీకరించాలి. ఒకే దేశంపై ఆధారపడకుండా జపాన్, దక్షిణ కొరియా, యూరప్, అమెరికా, ఆగ్నేయాసి యా దేశాలతో సాంకేతిక, పారిశ్రామిక భాగస్వామ్యాలను పెంచుకోవాలి. అదే సమయంలో భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో స్థానకల్పించాలి. చైనాతో వాణిజ్యాన్ని పూర్తిగా

# ప్రజల ధైర్యమే ఎసిబికి అసలైన ఆయుధం!



కొలను వెంకటేశ్వర రెడ్డి

ప్రభుత్వ కార్యాలయం ప్రజలకు సేవ చేయాల్సిన చోటు. కానీ అక్కడికి వెళ్లిన సామాన్యుడికి నిబంధనల కంటే ముందే ఇంత ఇస్తే పని త్వరగా అవుతుంది అనే మాట ఎదురైతే, అది కేవలం లంచం కాదు, ప్రజల హక్కును డబ్బుకు అమ్మే ప్రయత్నం. భూమి రికార్డులు, రిజిస్ట్రేషన్లు, నిర్మాణ అనుమతులు, విద్యుత్ కనెక్షన్లు, ధ్రువపత్రాలు, సేవ ఏదైనా లంచం అడుగుతున్నారన్న ఫిర్యాదులు వినిపిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో 2024 నుంచి 2026 మధ్య ఏసీబీ నమోదు చేసిన కేసులు, నిర్వహించిన ట్రాప్‌లు, అక్రమాస్తుల దర్యాప్తులు ఈ సమస్య తీవ్రతను గుర్తుచేస్తున్నాయి. 2024లో 152 కేసుల్లో 223 మంది అరెస్టు కాగా, 2025లో 199 కేసుల్లో 273మంది అరెస్టయ్యారని పేర్కొన్న గణాంకాలు పరిస్థితిని తెలియజేస్తున్నాయి. 2026లోనూ కేసుల నమోదు కొనసాగుతోంది. ఇవి కేవలం సంఖ్యలు కావు, ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి ఏస్థాయిలో ఉందో ప్రశ్నించే పరిణామాలు చిన్న లంచం కూడా పెద్ద సమస్యే. అవినీతి అంటే కోట్ల రూపాయల అక్రమాస్తులు మాత్రమే కాదు. రూ. 500 అడిగినా అవినీతే, రూ.5,000 అడిగినా అవినీతే. ఇచ్చేద్దాం, పని త్వరగా అయిపోతుంది అనే ధోరణి అవినీతికి సామాజిక అంగీకారం కల్పిస్తుంది. చిన్న మొత్తాలను పట్టించుకోకపోతే అవినీతిపరుడికి మరింత పెద్ద మొత్తాలు అడిగే ధైర్యం వస్తుంది. అందుకే లంచం అడిగినప్పుడు మౌనంగా ఉండటం సమస్యను మరింత పెంచుతుంది. ఫిర్యాదు చేస్తే నా పని ఆగిపోతుంది, తర్వాత ఇబ్బందులు వస్తాయి అనేభయాలు సహజమే. కానీ ప్రతిఒక్కరూ మౌనంగా ఉంటే అవినీతి వ్యవస్థలో మరింత బలపడుతుంది. ఏసీబీ ట్రాప్‌లో లంచం తీసుకుంటూ ఒక అధికారి పట్టుబడటం అవసరమైన చర్య. కానీ దర్యాప్తు అక్కడితో ఆగకూడదు. అధికారిక ఆదాయానికి మించి భారీగా ఆస్తులు ఉన్నట్లు అనుమానం ఉంటే, వాటి మూలాలను లోతుగా పరిశీలించాలి. ఆస్తులు ఎవరి పేర్లలో ఉన్నాయి? బినామీ లావాదేవీలు ఉన్నాయా? బ్యాంకు లావాదేవీలు ఏమిటి? ఆదాయానికి ఆస్తులకు మధ్య వ్యత్యాసం ఎంత? వంటి అంశాలు వెలుగులోకి రావాలి. కొన్ని అక్రమాస్తుల కేసుల్లో వందల కోట్ల మార్కెట్ విలువ ఉన్న ఆస్తులు బయటపడుతున్నాయన్న వివరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే దర్యాప్తు పూర్తయ్యే వరకు ఆరోపణలను తుది నిజాలుగా చూడకూడదు. చట్టబద్ధమైన విచారణ, ఆధారాలపరిశీలన, న్యాయపరమైన నిర్ణయమే అంతిమ ప్రమాణం. ప్రజలే ఏసీబీకి కళ్లూ, చెవులూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఏసీబీ నిరంతరం ఉండటం సాధ్యం కాదు. అవినీతి ఎక్కడ జరుగుతుందో ముందుగా తెలిసేది అక్కడికి వెళ్లే పౌరుడికే. అందుకే ప్రజల సహకారం అత్యంత కీలకం. లంచం అడిగితే అధికారి పేరు, హోదా, కార్యాలయం, పని, అడిగిన మొత్తం వంటి వివరాలను గుర్తుంచుకుని ఏసీబీకి అధికారిక మార్గంలో ఫిర్యాదు చేయాలి. ఏసీబీ సూచన లేకుండా స్వయంగా ట్రాప్ ఏర్పాటు చేయడం, అధికారితో గొడవ పడటం లేదా ప్రమాదకరంగా ఆధారాలు సేకరించడం మాత్రం చేయకూడదు. ఏసీబీ దాడులు అవినీతిపై భయాన్ని పెంచగలవు. కానీ అవినీతికి శాశ్వత పరిష్కారం వ్యవస్థలో పారదర్శకత పెరగడమే. ప్రభుత్వ సేవల డిజిటలీకరణ, ఫైళ్ల ఆన్‌లైన్ ట్రాకింగ్, నిర్ణీత కాలపరిమితి, అధికారుల జవాబుదారీతనం పెరగాలి. ప్రజలు తమ దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకునే అవకాశం ఉంటే మధ్యవర్తుల పాత్ర తగ్గుతుంది. అవినీతిని ఒక్క ఏసీబీతో నిర్మూలించడం సాధ్యం కాదు. ప్రభుత్వం, అధికారులు, న్యాయవ్యవస్థ, మీడియా, ప్రజలు, అందరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి. ఒకరి ఫిర్యాదు ఒక కేసును వెలుగులోకి తెస్తుంది. ప్రజల సమిష్టి ధైర్యం ఒక వ్యవస్థను మార్చగలదు. లంచం అడిగితే భయపడకుండా, చట్టబద్ధమైన మార్గంలో ఫిర్యాదు చేయాలి. ప్రజల ధైర్యమే అవినీతికి నిజమైన భయం. •

# మన ప్రజాస్వామ్యం ఎటు పయనిస్తోంది!



మేకిరి దామోదర్

మన దేశం, రాష్ట్రంలో రాజకీయాలు ప్రజలను కలపాల్సింది పోయి, కులాలు, మతాల పేరుతో విడదీస్తే ప్రజాస్వామ్యం ఎటు పయనిస్తున్నట్లు? ప్రజాసేవ చేయాల్సిన నాయకులే పరస్పర విద్వేషాలకు వేదికలు సృష్టిస్తే.. రాజ్యాంగంపై చేసిన ప్రమాణానికి విలువ ఏమిటి? తెలంగాణలోని తాజా రాజకీయ పరిణామాలు ఈ ప్రశ్నలను ప్రతి పౌరుడి ముందూ నిలుపుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల వేళ ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీలకు సెక్యూరిటీ సిబ్బందికి, తోపులాటలఘర్షణలో స్పీకర్‌ను దూషించడతో సభలో కన్నీరు పెట్టుకో వడం, గొడవ చేసిన వారిని బహిష్కరించడం, ఆ తరువాత కేసులు. ఈ పరిణామాలతో ప్రజల సమస్యలు కనుమరుగై, కాలం, ధనం కరిగిపోయింది. ఒకరి కార్యక్రమాలు, ఆచారా లు, ప్రదేశాలను మరొకరు అపవిత్రంగా చిత్రీకరించడం, పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయడం వంటి చర్యలు రాజకీయ సంస్కృతిలోకి రావడం ఆందోళన కలిగించే పరిణామం. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టడం కాదు, ప్రజల విశ్వాసాన్ని గౌరవించడం. భిన్నాభిప్రాయాలను సహించడం, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటం. ప్రతి పౌరుడి హక్కులను పరిరక్షించడం కూడా ప్రజా స్వామ్య బాధ్యతలే. అధికార ప్రతిపక్షంలో ఎవరున్నా రాజ కీయ ప్రత్యర్థిని శత్రువుగా, భిన్న వర్గాన్ని పరాయిగా చూసే ధోరణి పెరిగితే ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించేది ఎవరు? ఎలా!. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికీ సమా నత్వం, స్వేచ్ఛ, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి విలువలను అందించింది. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు రాజ్యాంగం పై ప్రమాణం చేసి పదవులు స్వీకరిస్తారు. ఆ ప్రమాణం కేవలం అధికారిక కార్యక్రమంలో పలికే మాట కాదు. ప్రజల పట్ల, రాజ్యాంగం పట్ల స్వీకరించే పవిత్రమైన బాధ్యత. అందుకే కులం, మతం, ప్రాంతం, భాష వంటి అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించి ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. రాజ కీయ పార్టీలు వేర్వేరు సిద్ధాంతాలను కలిగి ఉండవచ్చు. నాయకుల మధ్య తీవ్రమైన రాజకీయ పోటీ ఉండవచ్చు. కానీ ఆ పోటీ ప్రజాస్వామ్య పరిమితులను దాటకూడదు. 'కలిసి ఉంటే కలదు సుఖం' అనేదే మన సామాజిక జీవనానికి చక్కని మార్గదర్శకం. భిన్నత్వమే భారతదేశ బలం. భిన్న మతాలు, భిన్న కులాలు, భిన్న భాషలు, భిన్న సంస్కృతులు కలిసి జీవించడం మన దేశ ప్రత్యేకత. అలాంటి సమాజంలో విభజన రాజకీయాలకు ప్రాధాన్యం పెరగడం



భవిష్యత్తుకు ప్రమాద సంకేతం. రాజకీయ నాయకులు ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన వారు. వారి మాటలు, చేతలు సమాజంపై ప్రభావం చూపుతాయి. ఒక నాయకుడు విద్వేష పూరిత వ్యాఖ్య చేస్తే దాని ప్రభావం వేలాది మంది అనుచరులపై పడవచ్చు. అందుకే అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రతి నాయకుడు సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. రాజకీయ పార్టీలు ఏర్పడింది ప్రజల సమస్యలను పరిష్కరించడానికి. ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరు, రహదారులు, భద్రత, సామాజిక న్యాయం అందించడానికి. కానీ ప్రజల అసలు సమస్యలను పక్కన పెట్టి కులం, మతం, వ్యక్తిగత విమర్శలు, పరస్పర ఆరోపణలే రాజకీయ చర్చకు కేంద్రంగా మారితే ప్రజలకు ప్రయోజనం ఏమిటి?, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కావాలి. రైతుకు పంటకు గిట్టుబాటు ధర కావాలి. విద్యార్థికి నాణ్యమైన విద్య కావాలి. సామాన్యుడికి అందుబాటులో వైద్యం కావాలి. పేద కుటుంబానికి భద్రమైన జీవనం కావాలి. ఇవే ప్రజల అసలు ప్రశ్నలు. వీటికి సమాధానాలు చెప్పాల్సిన రాజకీయ వ్యవస్థ ప్రజల దృష్టిని కుల, మత వివాదాల వైపు మళ్లిస్తే అది ప్రజాసేవకు న్యాయం చేసినట్ల అవుతుందా!. గాంధీ, నేతాజీ, భగత్‌సింగ్ వంటి స్వాతంత్ర్య సమర యోధులు దేశం కోసం త్యాగాలు చేశారు. వారి కలల భారతదేశం విభేదాలతో కాదు ఐక్యతతో నిర్మించాల్సిన దేశం. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం, గౌరవప్రదమైన జీవనానికి పునాది వేశారు. అలాంటి మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూనే వారి ఆశయాలకు విరుద్ధంగా రాజకీయాలు సాగితే అది ఆత్మపరిశీలన చేయాల్సిన సమయం కాదా?. రాజకీయ ప్రత్యర్థిని విమర్శించడం ప్రజాస్వామ్య హక్కు. కానీ వ్యక్తిగత అవమానాలు, కులమత ప్రేరేపిత వ్యాఖ్యలు, సామాజిక విభజనకు దారితీసే చర్యలు ప్రజాస్వామ్యానికి మంచివి కావు. 'విత్తిన విత్తును బట్టి పంట' అన్నట్లు రాజకీయాల్లో విద్వేషాలను విత్తితే సమాజంలో అసహనమే పండుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉండాలంటే కేవలం రాజ్యాంగం ఉంటేనే సరిపోదు. దానిని గౌరవించే రాజకీయ నాయకత్వం, అప్రమత్తమైన ప్రజలు, బాధ్యతాయుతమైన రాజకీయ పార్టీలు అవసరం. ప్రజలు కూడా కులం, మతం ఆధారంగా కాకుండా అభివృద్ధి, పాలన, నైతికత, ఆధారంగా నాయకులను ప్రశ్నించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలను మాత్రమే కాదు, ఎన్నికల తర్వాత నాయకుల ప్రవర్తనను కూడా ప్రజలు గమనించాలి. ప్రజా సమస్యలపై ఎవరు మాట్లాడుతున్నారు? రాజ్యాంగ విలువలను ఎవరు కాపాడుతున్నారు? సమాజాన్ని ఎవరు కలుపుతున్నారు? ఎవరు విడదీస్తున్నారు? అనేది పరిశీలిస్తూ అవసరమైన మేరకు, ప్రజా ప్రతినిధుల బాధ్యతాయుతమైన జవాబుదారుతనాన్ని గుర్తు చేయాలి. రాజకీయ పార్టీలు కూడా తమ కార్యకర్తలకు రాజకీయ సంస్కృతిని నేర్పాలి. ప్రత్యర్థి పార్టీపై రాజకీయ పోరాటం చేయవచ్చు.. కానీ ప్రజల మధ్య శాశ్వత విభేదాలు సృష్టించే స్థాయికి పోటీని తీసుకెళ్ల కూడదు. అధికార మార్పు సహజం. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. కానీ సమాజంలో ఏర్పడిన చీలికలు పూడ్చడానికి తరాలు పట్టవచ్చు. అందుకే కుల, మతాల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలనే ఆలోచ

# ప్రజావాక్కు



### పునఃనైపుణ్య శిక్షణ అవసరం

భారత ఉద్యోగ మార్కెట్‌లో సాంకేతికపరిజ్ఞానం వేగంగా మారుతున్న కొద్దీ నైపుణ్యాలవిలువ కూడా మారుతోంది. కృత్రిమ మేధస్సు ఆధారిత ఉద్యోగాల్లో వేతన వృద్ధి వేగంగా ఉండగా, కొన్ని సంప్రదాయ సాంకేతిక ఉద్యోగాల్లో వేతనాల పెరుగుదల మందగించడం ఈ మార్పుకు సంకేతం. ఇదికేవలం వేతనాల అంశంకాదు, విద్యార్థులు, ఉద్యోగులు భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌కు ఎంతవరకు సిద్ధంగా ఉన్నారనే ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది. ముఖ్యంగా అనుభవంతో పాటు ప్రత్యేక నైపుణ్యం, సమస్య పరిష్కార సామర్థ్యం, కొత్త సాంకేతికతలను నేర్చుకునే సన్నద్ధత వేతనాలను నిర్ణయించే ప్రధాన అంశాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కళాశాల విద్య కేవలం సిద్ధాంత పరిజ్ఞానానికే పరిమితం కాకూడదు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను నవీకరించడంతో పాటు, ఆచరణాత్మక కృత్రిమ మేధస్సు శిక్షణ, ప్రాజెక్టులు, పరిశ్రమలతో కలిసి ఇంటర్న్‌షిప్‌లు అందించాలి. సంస్థలు కూడా సంప్రదాయ సాంకేతిక విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పునఃనైపుణ్య శిక్షణ అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఇదేం ప్రచారం

యాక్టర్‌లకి సింగర్‌లకి స్పీచ్‌లు ఇచ్చేవారికి ఆడిటోరియంలో వేదికలు ఎలా ఉపయోగపడుతున్నాయో సోషల్ మీడియా మోడికి అలానే ఉపయోగపడుతోంది. సోషల్ మీడియా ద్వారా తన రాజకీయ ప్రత్యర్థులను తనను వ్యతిరేకించేవారిని దేశద్రోహులుగా, విచ్ఛిన్నకర శక్తులుగా ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలలో గెలుపొందడానికి ఈ సోషల్ మీడియా మోడీకి ప్రధాన అస్త్రం అవుతోంది. మోడీ ప్రధాన మంత్రి పదవి నుంచి తప్పుకుని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్స్‌గా మారాలి.

- మిథునం, హైదరాబాద్

### 'సర్' అనుమానం

ప్రత్యేక ఓట్ల సంవరింపు ముసుగులో అసలు భారతీయుల ఓట్లు గల్లంతు అవ్వడం విడ్డూరం. భారత రత్న అందుకున్న ప్రొఫెసర్‌రావ్ ఓటు కెఅనుమానితుడు అనే ముద్ర పడడం ఈ పద్ధతిలో ఉన్న డొల్లతనం బయటపడుతుంది. ఆధార్ తయారు చేసిన నందన్ నిలెకని కూడా అనుమానితుల జాబితాలో చేరడం ఇక్కడ గమనించదగిన విషయం. సార్ అనేది అనుమానితులను గుర్తించడానికి ప్రవేశ పెట్టిన విధానం. ఇది ఎంతవరకు సమంజసం?

- భారత అవినాష్, జనగామ

### ఉచిత కరెంటు రాజ్యాంగ విరుద్ధం

మననాయకులకు రాజ్యాంగం అంటే ఏమిటోతెలుసా. మనది సెక్యులర్‌దేశం. సెక్యులర్ దేశంలో ప్రభుత్వపరంగా, అధికారికంగా మతపరమైన వాటినిప్రోత్సహించరాదు. దేవుడు మతం వ్యక్తిగతం. మరి ఈనెల 14 తేదీ నుండి 22 తేదీ వరకు 9 రోజులు వినాయక పందిళ్ళకు ఉచిత కరెంటు ఇస్తున్నట్లు సిపిడీసీఎల్ సిఎండి పుల్లారెడ్డి గారు నిన్న ఒక ప్రకటన చేశాడు. మీ సొంత డబ్బు ఇవ్వండి. చందా ఇచ్చుకోండి. మా కరెంటు మీరు ఉచితంగా ఎలాఇస్తారు? రాజ్యాంగం తెలియదా! సెక్యులర్ విధానాన్ని అమలుపరచటంలో ప్రధాని నుండి అందరూ విఫలమైనారు. రాజ్యాంగం ప్రకారం పాలన చేస్తామని ప్రమాణ చేశారు గదా. మరి అందులో ఏముందో తెలుసుకోవలసిన బాధ్యత లేదా! మేము చెప్తున్నాం వినండి. భిన్న మతాలు, భిన్న ఆచారాలు, భిన్న సంస్కృతులు కలిగిన మనదేశంలో ప్రభుత్వ పరంగా మతపరమైన ఆచారాలూ పాటించకూడదు. పాటించాలనుకుంటేఅది మీ వ్యక్తిగతంగా ఉండాలి. ప్రభుత్వానికి సంబంధం లేదు. అందుకే సెక్యులర్ అని రాసుకున్నాం.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### కె.సి.ఆర్ పథకాలు రద్దు

గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేయలేదు. ఆర్థికపరిస్థితి ఆశాజనకంగా లేకపోయినా అదనంగా మరికొన్ని సంక్షేమ పథకాలను ప్రారంభించి అమలు చేస్తోంది. ఈపథకాలు లక్షలాది మందికి ఉపయోగపడుతున్నాయి. ఇప్పుడు పాలన చేస్తున్న కాంగ్రెస్ పార్టీయే కాదు భవిష్యత్తులో ఏపార్టీ ప్రభుత్వం ఏర్పాటయినా ప్రజాసంక్షేమం దృష్టిలో పెట్టుకుని పనిచేయాలి. ప్రజలకు ఉపయోగపడే పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయాలి. వెంటనే కాకపోయినా దశలవారీగా ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి. అలా చేయకుంటే ప్రజావ్యతిరేకత వస్తుంది.

- శాస్త్రి, హైదరాబాద్

### కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం

భారత్‌లో సైబర్ నేరాలు రోజురోజుకూ ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. సుప్రీంకోర్టు ఇటీవల సైబర్ నేరాల నియంత్రణ ప్రభుత్వాల రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని స్పష్టంగా పేర్కొనడం అత్యంత సమయోచితమైన పరిణామం. 2024లో దేశవ్యాప్తంగా 65.9లక్షల సైబర్ ఫిర్యాదులు, సుమారు రూ.55,493కోట్ల ఆర్థిక నష్టం నమోదవడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ఈ సైబర్‌నేరాలను అరికట్టాలంటేకేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలుసమన్వయంతో పనిచేయాలి.

-కె.రామారావు, నల్గొండజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

14-9Pg5:14-9Pg5.qxd 9/13/2026 10:51 PM Page 1



# ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు భారత్, చైనా సహాయం

## శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహించేందుకు మోడీ, జిన్‌పింగ్ సిద్ధం: రష్యా



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు శాంతి చర్చలను సులభతరం చేసేందుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ముందుకొచ్చారని రష్యా తెలిపింది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ఈ ప్రతిపాదన చేసినట్లు పేర్కొంది. మోడీ, జిన్‌పింగ్‌ల ప్రతిపాదనను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్వాగతించారని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం కుదిర్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటివరకు పెద్దగా ఫలించని నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోడీ, జిన్‌పింగ్, పుతిన్ మధ్య సాన్నిహిత్యం స్పష్టంగా కనిపించింది. సదస్సు తొలిరోజు ముగ్గురు నేతలు చిరునవ్వులతో చేతులు పట్టుకుని ఉన్న ఫొటో ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రపంచ వ్యవస్థలో విభేదాలు పెరుగుతున్న సమయంలో ముగ్గురు కీలక నేతలు ఐక్యతను ప్రదర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా, ఉక్రెయిన్ శాంతి చర్చలకు మోడీ సహకారాన్ని రష్యా స్వాగతించడం ఇదే తొలిసారి కాదు. ప్రస్తుతం అమెరికా కూడా నిలిచిపోయిన శాంతి చర్చలను తిరిగి ప్రారంభించేందుకు మార్గాలను అన్వేషిస్తున్న సమయంలో రష్యా నుంచి వచ్చిన ఈ ప్రకటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యాలో తొలిసారిగా సెప్టెంబర్ 18 నుంచి 20 వరకు పార్లమెంటరీ ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్షుడు పుతిన్ మద్దతు ఉన్న యునైటెడ్ రష్యా పార్టీ మరోసారి పార్లమెంటులో ఆధిపత్యం కొనసాగించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్‌లో యుద్ధానికి వీలైనంత త్వరగా ముగింపు పలకాలని ఆయన కోరారు. అమెరికా ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ మాస్కో, కీవ్‌లను సందర్శించి యుద్ధానికి ముగింపు పలికేందుకు మార్గాలను అన్వేషించారు. భారత్ కీలక వారధిగా రష్యా, ఉక్రెయిన్‌తో ఒకేసారి సంబంధాలు కొనసాగిస్తున్న కొద్ది దేశాల్లో భారత్ కూడా ఒకటి. దీంతో ఇరు దేశాల మధ్య భారత్ ఒక కీలక వారధిగా వ్యవహరించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. "మాస్కో, టెహ్రాన్, పశ్చిమ దేశాలతో ఒకేసారి మాట్లాడగల అరుదైన సామర్థ్యం భారత్‌కు ఉంది. ఆ ప్రాప్యత వాస్తవమే" అని ఇండిక్ రీసెర్చర్స్ ఫోరం థింక్‌ట్యాంక్ డైరెక్టర్ శ్రీనివాసన్ బాల కృష్ణన్ వ్యాఖ్యానించారు. 2022లో రష్యా ఉక్రెయిన్‌పై దాడి ప్రారంభించినప్పటి నుంచి భారత్ శాంతి చర్చలకు పిలుపునిస్తూ వస్తోంది. రష్యా నుంచి తక్కువ ధరకు చమురు దిగుమతి చేసుకుంటున్నప్పటికీ,యుద్ధానికి ముగింపు పలకాలని భారత్ పలు సందర్భాల్లో రష్యాను కోరింది. గత నెలలో బిష్కెక్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు సందర్భంగా పుతిన్‌తో ద్వైపాక్షిక సమావేశంలో మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. "అంతులేని యుద్ధం నుంచి యుద్ధం ముగిసే దిశగా వెళ్లాలి" అని పుతిన్‌కు సూచించారు. "యుద్ధంలో గడిచే ప్రతి రోజు మాన వాళిని వెనక్కి నెడుతుంది" అని మోడీ అన్నారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ముఖాముఖి సమావేశమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ ఏడాది డిసెంబర్‌లో మియామీలో జరిగే జీ20 సదస్సు సందర్భంగా ఈ భేటీ జరిగే అవకాశం ఉందని సమాచారం.

పుతిన్ కూడా సదస్సుకు హాజరవుతే తాను మియామీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని జెలెన్‌స్కీ ఇప్పటికే ప్రకటించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత పరిష్కారం కోసం అంతర్జాతీయ స్థాయిలో దౌత్య ప్రయత్నాలు కొనసాగుతున్న వేళ, భారత్ మధ్యవర్తిత్వ పాత్రపై రష్యా చేసిన తాజా ప్రకటనకు ప్రాధాన్యం ఏర్పడింది.



### 2029కి ఎన్‌డియే పాలిత రాష్ట్రాల్లో

# ఉమ్మడి పౌర స్మృతి

## కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడి

**ముంబై, సెప్టెంబరు 13:** మతంతో సంబంధం లేకుండా వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత వంటి అంశాలకు సంబంధించిన ఉమ్మడి వ్యక్తిగత చట్టాలను రూపొందించే లక్ష్యంతో ఉన్న ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి)ని, 2029 నాటికి బిజెపి నేతృత్వంలోని ఎన్‌డియే పాలనలో ఉన్న మొత్తం 21 రాష్ట్రాల్లో అమలు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో యుసిసిని ప్రవేశపెట్టామని తెలిపారు. ఆదివారం ముంబైలో విలేకరుల సమా వేశంలో అమిత్ షా ప్రభుత్వం భద్రతా విధా నాన్ని ప్రస్తావిస్తూ, సర్జికల్ స్ట్రైక్స్, వైమానిక దాడులు, 'ఆపరేషన్ సింధూర్' వంటి చర్యల ద్వారా ఉగ్రవాదం పట్ల 'సున్నా సహనం' విధానాన్ని నెలకొల్పామని, అన్ని రంగాల్లోనూ భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని షా తెలిపారు. 2014కు ముందు ఉన్న అవినీతి, కులతత్వం, వారసత్వ రాజకీయాల యుగం నుండి, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం హయాంలో భారతదేశం "పనితీరు ఆధారిత రాజకీయాల్ల దిశగా అడుగులు వేసిందని షా పేర్కొన్నారు. "ఇండియా ఫస్ట్" (భారతదేశానికే ప్రథమ ప్రాధాన్యత) అనే సూత్రం ప్రభుత్వ విధానానికి దిశానిర్దేశం చేస్తోందని, జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా దేశ విదేశాంగ, రక్షణ విధానాలు బలపడ్డాయని ఆయన చెప్పారు. భారతదేశ ఆర్థిక వృద్ధిని కూడా షా ప్రస్తావించారు. "ఫ్రాజైల్ ఫైవ్" (అతి బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థలు) జాబితా నుండి దేశం అగ్రశ్రేణి ఐదు ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఎదిగిందని ఆయన అన్నారు.

మొదటి త్రైమాసికంలో 7.8శాతం జిడిపి వృద్ధిని ఎత్తిచూపుతూ, ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నింటిలోనూ భారతదేశం ముందంజలో ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే, ఆర్టికల్ 370, నక్సలిజం, ఈశాన్య ప్రాంత పరిస్థితుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా ఆయన వివరించారు. భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశమని, నిరసన తెలిపే హక్కును గౌరవిస్తారని షా అన్నారు.



## జిన్‌పింగ్ అసౌకర్యంపై ఆరాతీసిన ప్రధాని మోడీ


**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** దేశరాజధానిలోని భారత్ మండపంలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపి, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆరోగ్యం గురించి వాకబు చేశారు. ఈ ఘటన సదస్సు ప్రారంభ సెషన్‌లో జరిగింది. మోడీ ప్రసంగిస్తుండగా, వేదికపై ఉన్న జిన్‌పింగ్ కాస్త అసౌకర్యంగా కనిపించడాన్ని గమనించారు. వెంటనే ప్రసంగానికి విరామం ఇచ్చి, జిన్‌పింగ్ వైపు తిరిగారు. ఆయన పక్కనే ఉన్న అనువాదకుడిని ఉద్దేశించి, "ఆయన బాగున్నారా? అని మోడీ ప్రశ్నించారు. కొద్ది క్షణాల తర్వాత మరోసారి అదే ప్రశ్న అడగగా, జిన్‌పింగ్ తలూపి ఫర్వాలేదని సూచించారు. అనంతరం మోడీ తన ప్రసంగాన్ని తిరిగి కొనసాగించారు. ఈ దృశ్యాలు దూరదర్శన్ ప్రసారం చేసిన ఫుటేజీలో రికార్డ్ అయ్యాయి. అయితే, జిన్‌పింగ్ అసౌకర్యానికి గురికావడానికి గల కారణాలు వెంటనే తెలియరాలేదు.

## ప్రపంచ శాంతికి ఐక్యంగా కృషి చేయాలి

### ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గ్యుటరెస్




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు తీవ్ర ఘర్షణలతో సతమతమవుతున్న వేళ, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ప్రపంచ శాంతికి పిలుపునిచ్చారు. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ఆయన మాట్లాడుతూ గాజా నుంచి మధ్యప్రాచ్యం, ఉక్రెయిన్, సూడాన్ వరకు ప్రపంచానికి శాంతి అత్యవసరమని నొక్కి చెప్పారు. సమ్మిళిత ప్రపంచ వృద్ధికి శాంతి పునాది అని, అది లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈ సదస్సులో ప్రత్యర్థి దేశాలైన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, సౌదీ విదేశాంగ మంత్రి ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ వంటి మధ్యప్రాచ్య నేతలు ఒకే వేదికపై ఉండటం గమనార్హం. వీరితో పాటు ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించి ఆహార, ఎరువుల సంక్షోభానికి కారణమైన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ నేతలందరినీ ఉద్దేశించి గుటెర్రస్ మాట్లాడుతూ ప్రతి దేశం ఐరాస చార్టర్, అంతర్జాతీయ చట్టాలకు లోబడి తమ బాధ్యతలను గౌరవించాలి. దేశాల సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, రాజకీయ స్వాతంత్ర్యం వంటి సూత్రాలను పాటించాలి. వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడంతో పాటు, అంతర్జాతీయ మానవతా, మానవ హక్కుల చట్టాలకు కట్టుబడి ఉండాలని హితవు పలికారు. గుటెర్రస్ శాంతి పిలుపునకు బ్రిక్స్ కూటమి సానుకూలంగా స్పందించింది. శనివారం ఆమోదించిన ఉమ్మడి ప్రకటనలో పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గాజాలో కాల్పుల విరమణ పాటించాలని, పాలస్తీనియన్ల హక్కులను కాపాడాలని కోరింది. అలాగే సూడాన్‌లో క్షీణిస్తున్న పరిస్థితి, మానవతా సంక్షోభంపై ఆందోళన వ్యక్తం చేస్తూ తక్షణమే శాశ్వత కాల్పుల విరమణకు పిలుపునిచ్చింది. ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా నేతలు ఈ ప్రకటనపై సంతకాలు చేయడం దౌత్యపరమైన ముందడుగుగా భావిస్తున్నారు. గాజా, సూడాన్‌పై స్పందించిన బ్రిక్స్ కూటమి ఉక్రెయిన్ యుద్ధంపై మాత్రం తమ ఉమ్మడి ప్రకటనలో ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం గమనార్హం. గత ఏడాది బ్రెజిల్‌లో జరిగిన సదస్సులో కనీసం దీనిపై ప్రస్తావించిన కూటమి, ఈసారి పూర్తిగా మౌనం పాటించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.



## మోడీ గాలా డిన్నర్‌లో మలేసియా ప్రధాని హిందీ గీతం ఆలాపన

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఒక ఆసక్తికర సాంస్కృతిక ఘట్టం చోటు చేసుకుంది. సదస్సుకు హాజరైన దేశాధినేతల కోసం ప్రధాని నరేంద్ర మోడీ ఏర్పాటు చేసిన గాలా డిన్నర్‌లో మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఒక పాత హిందీ పాట పాడి అందరినీ ఆశ్చర్యపరిచారు. తన గానంతో ఆ సాయంత్రాన్ని మరింత ప్రత్యేకంగా మార్చారు. తొలి రోజు రాత్రి ఢిల్లీలోని ప్రఖ్యాత భారత్ మండపంలో ఈ విందు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అన్వర్ ఇబ్రహీం, 1965 నాటి తీన్ దేవియా చిత్రంలోని కిషోర్ కుమార్ ఆలపించిన క్లాసిక్ గీతం "ఖ్వాబ్ హో తుమ్ యా కోయీ హాకీకత్"ను పియానిస్ట్ సహకారంతో మధురంగా ఆలపించారు. ఎస్.డి. బర్మన్ స్వరపరిచిన ఈ గీతానికి మజ్రూహ్ సుల్తాన్‌పురి సాహిత్యం అందించారు. ఈ ప్రదర్శనకు సంబంధించిన వీడియోను అన్వర్ తన ఎక్స్ సోషల్ మీడియా ఖాతాలో స్వయంగా పంచుకున్నారు. "కొద్దిసేపు పాడేందుకు అనుమతి కోరుతున్నా" అనే అర్థం వచ్చేలా ఒక క్యాప్షన్ కూడా జతచేశారు. ఈ వీడియో పోస్ట్ చేసిన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్ అయింది. భారతీయ సినిమా, సంగీతం పట్ల అన్వర్ ఇబ్రహీంకు ఉన్న అభిమానంపై నెటిజన్లు ప్రశంసలు కురిపించారు. ఆయన ఈ పాట పాడటం ఇదే మొదటిసారి కాదు. 2024లో భారత్‌కు వచ్చినప్పుడు కూడా ఇదే గీతాన్ని ఆలపించి తన అభిమానాన్ని చాటుకున్నారు.

## చైనా సముద్ర గర్భంలో బంగారం, వెండి నిక్షేపాలు



**బీజింగ్, సెప్టెంబరు 13:** చైనా శాస్త్రవేత్తలు సముద్ర గర్భంలో ఓ భారీ గని నిధిని కనుగొన్నారు. పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో చేపట్టిన పరిశోధనల్లో అత్యంత విలువైన బంగారం, వెండి నిక్షేపాలు పెద్ద మొత్తంలో ఉన్నట్లు గుర్తించారు. భూమిపై లభించే గనులతో పోలిస్తే ఇక్కడ బంగారం, వెండి నిల్వలు గణనీయంగా అధిక స్థాయిలో ఉండటం విశేషం. సింఘువా యూనివర్సిటీ, షాంఘై జియావో టాంగ్ యూనివర్సిటీ సహా పలు సంస్థల పరిశోధకులు 'జియాంగ్ యాంగ్ హాంగ్ 10' అనే నౌకలో ఈ యాత్రను చేపట్టారు. సేకరించిన నమూనాలను నౌకలోని ల్యాబ్‌లోనే విశ్లేషించగా ఆశ్చర్యపరిచే ఫలితాలు వచ్చాయి. ఇక్కడి ఖనిజాల్లో ప్రతి టన్నుకు 15.4 గ్రాముల వరకు బంగారం, 1,271 గ్రాముల వరకు వెండి ఉన్నట్లు తేలింది. ఈ నిక్షేపాలు చైనా ప్రత్యేక ఆర్థిక మండలి పరిధిలోని సముద్ర భాగంలో ఉన్నాయి. సముద్ర అంతర్భాగంలో 700 నుంచి 1,500 మీటర్ల లోతులో ఈ హైడ్రోథర్మల్ క్షేత్రం ఉంది. ఇక్కడ సముద్రపు నీటి ఉష్ణోగ్రత 315 డిగ్రీల సెల్సియస్‌కుపైగా ఉన్నట్లు గుర్తించారు. మూడు పెద్ద శంఖాకార నిర్మాణాలతో ఉన్న ఈ ఖనిజ క్షేత్రం భవిష్యత్తులో ప్రపంచస్థాయి సముద్రగర్భ నిక్షేపంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. బంగారం, వెండితోపాటు రాగి, ఇనుము, జింక్ వంటి ఇతర కీలక ఖనిజాలు కూడా ఇక్కడ పుష్కలంగా ఉన్నాయి. ఈ నిక్షేపాల పూర్తిస్థాయి పరిమాణం, ఆర్థిక ప్రయోజనాలను అంచనా వేయడానికి 2027లో మరింత కచ్చితత్వంతో కూడిన సర్వేలు చేపట్టాలని చైనా యోచిస్తోంది. అయితే ఇంత లోతులో ఉన్న హైడ్రో థర్మల్ క్షేత్రాల నుంచి ఖనిజాలను వెలికితీయడం సాంకేతికంగా చాలా సంక్లిష్టమైన ప్రక్రియ. ప్రస్తుతం ఇలాంటి మైనింగ్ కార్యకలాపాలు ప్రపంచంలో ఎక్కడా జరగడం లేదు.

## 19వ బ్రిక్స్ సదస్సులు వచ్చే యేడాది చైనాలో: జిన్‌పింగ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** భారత్ వేదికగా 18వ బ్రిక్స్ సమ్మిట్ కొనసాగుతోంది. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఈ సదస్సుకు భారత్ అధ్యక్షత వహిస్తోంది. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ సమావేశంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ వాణిజ్యం, కృత్రిమ మేధస్సు, సరిహద్దు చెల్లింపులు,యుద్ధాలు, ఉగ్రవాదం వంటి కీలక అంశాలపై సభ్య దేశాల నేతలు చర్చిస్తున్నారు. ఇదే సమయంలో 19వ బ్రిక్స్ సమ్మిట్‌కు సంబంధించిన కీలక ప్రకటన వెలువడింది.

2027లో 19వ బ్రిక్స్ సమ్మిట్‌ను చైనా అధ్యక్షతన నిర్వహించనున్నట్లు చైనా అధ్య క్షుడు షీ జిన్‌పింగ్ ప్రకటించారు. చైనా ఆతిథ్యా నికి బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాలు అంగీకారం తెలిపాయి.

### భారత్‌కు రష్యా బంపర్ ఆఫర్..

# హైస్పీడ్ 'ఇవోల్గా' రైలు ప్రతిపాదన



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** భారత్ తన పాతకాలపు రైల్వే వ్యవస్థను ఆధునీకరించే పనిలో ఉంది. ఈ నేపథ్యంలోనే వందేభారత్, వందే భారత్ స్లీపర్, నమో భారత్, బుల్లెట్ ట్రైన్ వంటి ప్రాజెక్టుల్ని తీసుకువచ్చింది. ఇదిలా ఉంటే, రష్యా తన హైస్పీడ్ ట్రైన్ టెక్నాలజీని భారత్‌కు ఇచ్చేందుకు ప్రతిపాదించింది. ఇన్నోప్రోమ్.ఇండియా కార్యక్రమంలో ఈ ప్రతిపాదనను సమర్పించినట్లు తెలుస్తోంది. రష్యాకు చెందిన ట్రాన్స్‌మాష్ హోల్డింగ్ సంస్థ తన 'ఇవోల్గా హైస్పీడ్ రైలు'ను భారత్‌కు ఇవ్వాలనుకుంటోంది.

**గంటకు 360 కి.మీ. వేగం..**

రష్యా ప్రతిపాదించిన ఇవోల్గా హైస్పీడ్ రైలు గంటలకు 360 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. 8 బోగీలు ఉండే ఈ రైలు 642 మంది ప్రయాణికుల్ని తీసుకెళ్తుంది. దీని జీవిత కాలం 30 యేళ్లు. ఈ రైలు సుమారు 80 శాతం స్థానిక పరికరాలు ఉపయోగించి నిర్మించవచ్చని రష్యా ప్రతిపాదించింది. టెక్నాలజీ బదలీ, స్థానిక తయారీకి అవకాశం కల్పిస్తే ఇది భారత్ చేపడుతున్న 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర భారత్' లక్ష్యాలను నెరవేర్చినట్లు అవుతుంది.

**వందే భారత్‌లో భారత్‌లోకి ఎంట్రీ..**

ట్రాన్స్‌మాష్ హోల్డింగ్ ఇప్పటికే భారత రైల్వే రంగంలో భాగస్వామిగా ఉంది. వందే భారత్ స్లీపరన రైళ్ల తయారీలో భారత్‌తో కలిసి జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా 120 వందే భారత్ స్లీపర్ రైళ్ల తయారీ ఒప్పందం కుదిరింది. ఈ అనుభవం ఆధారంగా రష్యా ఇప్పుడు భారత్‌కు హై స్పీడ్ రైలును ఆఫర్ చేస్తోంది.

**మౌలిక సదుపాయాలు ముఖ్యమే..**

హైస్పీడ్ రైలు పరుగులు తీయాలంటే దానికి అనుగుణంగా రైల్వే ట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థ, విద్యుదీకరణం, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ ఇలా అన్నింటిని చూసుకోవాల్సి ఉంటుంది. హైస్పీడ్ రైళ్లకు తగ్గట్టుగా ట్రాక్ మార్పులు చేయాల్సి ఉంటుంది. దీంతో రష్యా ప్రతిపాదనను అంగీకరించే ముందు రైలు వేగంతోపాటు మొత్తం ప్రాజెక్టు వ్యయం, భద్రత, నిర్వహణ, స్థానిక తయారీ, టెక్నాలజీ బదలీ వంటి అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఒకవేళ ఇవోల్గా ప్లాన్ కార్యరూపం దాలిస్తే భారత్-రష్యా సహకారం ఇప్పుడు రైల్వేకు విస్తరించినట్లు అవుతుంది. రైళ్లను నేరుగా దిగుమతి చేసుకోకుండా స్థానికంగా ఉత్పత్తి చేయడం వల్ల భారతీయ పరిశ్రమలకు సాంకేతికంగా కలిసి వస్తుంది. ఇక్కడ ఉద్యోగాలు, ఉపాధి దొరికే అవకాశం ఉంటుంది.

## మోడీ గాలా డిన్నర్ మిస్ అయిన జిన్‌పింగ్, క్రౌన్ ప్రిన్స్‌లు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** న్యూఢిల్లీ వేదికగా జరిగిన 18వ బ్రిక్స్ సదస్సులో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోడీశనివారం ఏర్పాటు చేసిన గాలా డిన్నర్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరుకాలేదు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో పాటు ఇతర దేశాధినేతలు ఈ విందులో పాల్గొన్నారు. జిన్‌పింగ్ గైర్హాజరుపై చర్చ మొదలైనప్పటికీ, ఆయన విశ్రాంతి తీసుకునేందుకే హోటల్‌కు వెళ్లారని తెలిసింది. సదస్సులో పాల్గొని, ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం జిన్‌పింగ్ అలసట కారణంగా విశ్రాంతి తీసుకున్నట్లు సమాచారం. ఆయనతో పాటు అబు ధాబి క్రౌన్ ప్రిన్స్ కూడా సదస్సు ముగిశాక స్వదేశానికి తిరిగి వెళ్లడంతో విందుకు గైర్హాజ రయ్యారు. ఈనెల 12, 13 తేదీల్లో జరిగిన ఈ సదస్సులో 11 సభ్య దేశాలు, 10 భాగస్వామ్య దేశాలు పాలుపంచుకున్నాయి. ఇదిలా ఉండగా, ఈ సదస్సులో "న్యూఢిల్లీ డిక్లరే షన్ 2026"ను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రధాని మోడీ ప్రకటించారు. "ఈ డిక్లరేషన్‌పై ఏ సభ్య దేశం అభ్యంతరం చెప్పలేదు. ఇది చర్చల సారాంశాన్ని ప్రతిబింబిస్తూ, ఉమ్మడి లక్ష్యాలకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుంది" అని ప్రధాని వివరించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నియంత్రణ, ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ) సంస్కరణలు, ఉగ్రవాదాన్ని ఖండించడం వంటి కీలక అంశాలు ఈ డిక్లరేషన్‌లో ఉన్నాయి. వచ్చే ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను చైనా చేపడుతుందని జిన్‌పింగ్ ఇదే సదస్సులో ప్రకటించారు.

# 5.05 కి.మీ పొడవైన టేబుల్ గిన్నిస్ రికార్డు

## పిల్లల మానసిక వైద్యశాల నిర్మాణానికి నిధుల సేకరణ



**బుఖారెస్ట్, సెప్టెంబరు 13:** రొమేనియా రాజధాని బుకారెస్ట్‌లో వేలాది మంది ప్రజలు ఒకే చోట చేరి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. పిల్లల కోసం దేశంలోనే తొలి ప్రత్యేక మానసిక వైద్యశాల నిర్మాణానికి నిధులు సమీకరించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 20 వేల మంది పాల్గొన్నారు.యూనిరీ బులేవార్డ్ నుంచి రాజ్యాంగ కూడలి వరకు సుమారు 5,055 మీటర్ల పొడవున ఏర్పాటు చేసిన భారీ టేబుల్‌పై ప్రజలు కూర్చున్నారు. కమ్యూనిస్టు కాలానికి చెందిన భారీ పార్లమెంట్ భవనం ముందు ఈ కార్యక్రమం జరిగింది.రొమేనియాకు చెందిన బ్లూమ్ ది వరల్డ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ నుంచి ధ్రువీకరణ లభించింది. రీసైకిల్ చేసిన పదార్థాలతో తయారు చేసిన ప్రపంచంలోనే అత్యంత పొడవైన టేబుల్‌గా ఈ రికార్డు నమోదైంది.ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన అనేక టేబుళ్లను పూలు, తినుబండారాలతో అలంకరించారు. సుమారు 20 వేల మంది ఒకే టేబుల్ చుట్టూ చేరి సామాజిక సేవా కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు.గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సీనియర్ అడ్జుడికేటర్, అధికారిక జడ్జి జోవాన్ బ్రెంట్ మాట్లాడుతూ రికార్డు సాధించడమే కాకుండా దానిని ఒక మంచి సామాజిక ప్రయోజనం కోసం ఉపయోగించడం అభినందనీయమని అన్నారు. 20 వేల మంది ఒకే టేబుల్ చుట్టూ, ఒకే లక్ష్యం కోసం చేరుకున్నారు. రికార్డులు సాధించడంతో పాటు వాటిని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు మళ్లించడం చాలా సంతోషకరమని ఆమె పేర్కొన్నారు.బుకారెస్ట్‌లోని ఒబ్రెజియా ఆసుపత్రి ప్రాంగణంలో 3,900 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించనున్న పిల్లల మానసిక వైద్య కేంద్రానికి ఈనిధులు వినియోగించనున్నారు.ఈ ప్రాజెక్టును మెట్రోపోలిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ విరాళాలు, స్పాన్సర్‌షిప్‌లతో చేపడుతున్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణానికి సుమారు 16.5 మిలియన్ యూరోలు ఖర్చవుతుందని అంచనా. ప్రస్తుతం ఒబ్రెజియా ఆసుపత్రిలోని పిల్లల మానసిక వైద్య విభాగం పాతది, రద్దీగా ఉందని ఫౌండేషన్ తెలిపింది.

పిల్లల వైద్య, మానసిక అవసరాలను ప్రస్తుత సదుపాయాలు పూర్తిగా తీర్చలేకపోతున్నాయని పేర్కొంది.కొత్త ఆసుపత్రి ద్వారా ప్రతి సంవత్సరం తీవ్రమైన మానసిక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న 5,700 మందికి పైగా పిల్లలకు సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టును చేపడుతున్నారు.

# సంక్షిప్త వార్తలు

## ట్రంప్ నివాసానికి 1.93 మిలియన్ డాలర్లు



**న్యూయార్క్, సెప్టెంబరు 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిన్ననాటి నివాసానికి భారీ ధర పలికింది. న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో ఉన్న ట్యూడర్ శైలిలోని ఈ ఇల్లు తాజాగా 1.93 మిలియన్ డాలర్లకు విక్రయమైంది. అయితే కొన్నేళ్ల క్రితం వరకు నిర్లక్ష్యానికి గురై, బూజు పట్టి, పిల్లులతో నిండిపోయిన ఈ ఇంటిని ప్రస్తుతం పూర్తిగా ఆధునీకరిం చారు.ట్రంప్ తన నాలుగేళ్ల వయసు వరకు ఈ ఇంట్లోనే నివసించారు. ఆయన తండ్రి, ప్రముఖ డెవలపర్ ఫ్రెడ్ ట్రంప్, 1940లో క్వీన్స్‌లోని ఖరీదైన జమైకా ఎస్టేట్స్ ప్రాంతంలో ఈ ఇంటిని నిర్మించారు.

## జైపూర్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయిన విమానం



**జైపూర్,సెప్టెంబరు 13:**భోపాల్ నుంచి ఢిల్లీ వెళ్తున్న ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో జైపూర్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ఈ ఘటన ఆదివారం ఉదయం జరిగింది. విమానంలోని ప్రయాణికులు అందరూ సురక్షితంగా ఉన్నారు.ఎయిరిండియా సంస్థకు చెందిన ఏఐ1886 అనే విమానం మధ్యప్రదేశ్, భోపాల్ నుంచి ఆదివారం ఉదయం ఢిల్లీకి బయల్దేరింది. ఉదయం 8.25 గంటలకు భోపాల్ నుంచి బయల్దేరాల్సి ఉంది. కాస్త ఆలస్యంగా 8.47 గంటలకు బయల్దేరింది. షెడ్యూల్ ప్రకారం ఈ విమానం ఉదయం 9.55 గంటలకు ఢిల్లీలో ల్యాండ్ అవ్వాలి. కానీ, విమానంలో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా రాజస్థాన్‌లోని జైపూర్‌కు మళ్లించాల్సి వచ్చింది. చివరకు 9.40 గంటల సమయంలో జైపూర్‌లో సేఫ్‌గా ల్యాండ్ అయింది.

## గోవాలో 'గోవా ఫస్ట్' పేరుతో ఆప్-జీఎఫ్‌పీ కూటమి



**పనాజీ,సెప్టెంబరు 13:** గోవా అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆమ్ ఆద్మీ పార్టీ, విజయ్ సర్దేశాయ్ నేతృత్వంలోని గోవా ఫార్వర్డ్ పార్టీ మధ్య ముందస్తు ఎన్నికల పొత్తు అధికారికంగా ఖరారైంది. ఈ కొత్త రాజకీయ కూటమికి గోవా ఫస్ట్ అనే పేరు పెట్టినట్లు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం ప్రకటించారు.ఈ కూటమి బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ఏర్పడిందని కేజ్రీవాల్ తెలిపారు. ఎన్నికల సమయంలో బీజేపీ, కాంగ్రెస్‌లు పరస్పరం పోటీ పడుతున్నట్లు కనిపించినప్పటికీ, తెరవెనుక రెండు పార్టీలు కలిసి రాజకీయ ఒప్పందాలు చేసుకుంటున్నాయని ఆయన ఆరోపించారు.

## కృత్రిమమేథ సాంకేతికతను కట్టడిచేయాల్సిందే

**న్యూయార్కు, సెప్టెంబరు 13:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఏఐ సాంకేతికత అభివృద్ధి వేగాన్ని తగ్గించాలని, భద్రతాపరమైన ప్రమాదాలు తీవ్రమవుతున్నాయని ప్రముఖ ఏఐ కంపెనీ ఆంత్రోపిక్ సీఈఓ డేరియో అమోడెయ్ కీలక పిలుపునిచ్చారు. అనూహ్యంగా ఆయన వాదనకు ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్, ఎక్స్‌ఏఐ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ వంటి టెక్ దిగ్గజాలు బహిరంగంగా మద్దతు తెలపడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## జుట్టు మేకప్‌ల కోసమే రూ.4.7లక్షల డాలర్ల వ్యయం



**టెల్‌అవీవ్, సెప్టెంబరు 13:** ఇజ్రాయెల్ ప్రధానమంత్రులు తమ జుట్టు, మేకప్ కోసం గత ఏడేళ్లలో ప్రజాధనం నుంచి భారీగా ఖర్చు చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. 2019 నుంచి 2026 ఆగస్టు మధ్య కాలంలో సుమారు 4.7లక్షల డాలర్లు (దాదాపు రూ. 4.49 కోట్లు) ఈ అవసరాల కోసం వెచ్చించగా,ఇందులో ఏకంగా 90శాతం ప్రస్తుత ప్రధాని బెంజమిన్ నెతన్యాహు,ఆయన భార్య సారా నెతన్యాహు హయాంలోనే జరగడం గమనార్హం. న్యాయవాది యారావింక్లర్‌షాలిట్ దాఖలు చేసిన అభ్యర్థనతో ఈ వివరాలు బయటకు వచ్చాయి.

## ఇండోనేసియా తీరంలో పడవ గల్లంతు

**జకార్తా, సెప్టెంబరు 13:**ఇండోనేసియా తీరంలో 240 మంది ప్రయాణికులతో వెళ్తున్న పడవ గల్లంతైంది. ఈ ఘటనపై సమాచారం అం దుకున్న రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఇండోనేసియాలోని ఈస్ట్‌జావా ప్రావిన్స్ నుంచి బోర్నియా దీవుల్లోని దక్షిణి కాలిమంటాన్ వెళ్తుండగా శనివారం ఈ ఘటన జరిగింది.

## అదనపు పొగాకు అనుమతులు ఇప్పించేందుకు కృషి చేస్తా.:ఎంపీ పుట్టా

**ఏలూరు, సెప్టెంబరు13, (ప్రభాతవార్త) :** పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన పొగాకు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు ఆదివారం ఏలూరులో ఎంపీని కలిసి తమ సమస్యలను వివరించారు.ఎన్ఎల్ఎస్ వర్జీనియా పొగాకు మార్కెట్ గత నాలుగు నెలలుగా ఒడిదుడుకులు ఎదుర్కొందని, ప్రస్తుతం ధరలు మెరుగుపడి కిలో రూ.345 వరకు చేరాయని రైతులు తెలిపారు. ధరల పెరుగుదలకు ఎంపీ చేసిన కృషిని అభినందించారు. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఇందుకోసం పొగాకు బోర్డు, కంపెనీల ప్రతినిధులతో చర్చిస్తున్నానని ఎంపీ తెలిపారు. బోర్డు అనుమతి లేకుండా పొగాకు సాగు చేయవద్దని రైతులకు సూచించారు.అదనపు పంట కొనుగోళ్లకు అనుమతి: పొగాకు బోర్డు నిర్దేశించిన కోటాకు మించి పండిన పంటను వేలం కేంద్రాల్లో విక్రయించేందుకు అనుమతి కల్పించాలని రైతులు కోరారు. దీనిపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖతోపాటు పొగాకు బోర్డు అధికారులతో మాట్లాడి అనుమతులు ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక కోటా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో మాట్లా డతానని ఎంపీ తెలిపారు. రైతు సంఘాల ప్రతినిధులు వెంట్రప్రగడ శ్రీనివాస్, పాల్గొన్నారు.

# వైసిపిలో గ్రూపు తగాదాలు

- రాప్తాడు మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షులపై దాడికి యత్నం?
- మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిని సమన్వయకర్త నుంచి తప్పించాలని గోపాల్ రెడ్డి డిమాండ్



**అనంతపురం, సెప్టెంబర్ 13, (ప్రభాత వార్త బ్యూరో):** శ్రీ సత్యసాయి జిల్లా రాప్తాడు శాసనసభ నియోజకవర్గంలో వైసిపి నాయకుల మధ్య అభిప్రాయ భేదాలు బయట పడ్డాయి. రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, రాప్తాడు మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి వర్గాల మధ్య ఉన్న మనస్పర్ధలు, అభిప్రాయాలు భేదాలు బయటపడడంతో పార్టీ కార్యకర్తలు, అభిమానుల్లో గందరగోళం నెలకొంది. అనంతపురం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తోపుదుర్తి కవిత భర్త అయిన సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్ రెడ్డి ప్రథమ వర్ధంతి వేడుకలు ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామ వ్యవసాయ తోటలో శనివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, తాడపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్, వైసీపీ నేతలు మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు హాజరై నివాళులర్పించి వెళ్లారు. తోపుదుర్తి భాస్కర్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు హాజరై హాజరయ్యారు.. ఈ సందర్భంగా అక్కడే గతం నుంచి ఉన్న రెండు వర్గాల మధ్య ఉన్న మనస్పర్ధలు వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులకు దారిదేసింది. మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి సోదరుడు రాజశేఖర్ రెడ్డి, రాప్తాడు మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షులు బెందలూరు గోపాల్ రెడ్డి వర్గాలు ఒకరునొకరు తీసుకొన్నట్లు, ఒకానొక సమయంలో గోపాల్ రెడ్డి పై దాడికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి.. ఈ కార్యక్రమానికి నిన్ను ఎవరు రమ్మన్నారంటూ తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేకంగా గోపాల్ రెడ్డిని ఆవేశంగా నిలదీసినట్లు ,, నిర్వాహకులు పిలిస్తేనే వచ్చానని గోపాల్ రెడ్డి సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో నేను పిలిచానని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తోపుదుర్తి కవిత చెప్పడం తో వివాదం సద్దుమణిగింది.. రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని ప్రసన్నయపల్లి మహానంది రెడ్డి, పూలకుంట శివారెడ్డిలను పార్టీ వ్యతి రేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని శాసనసభ ఎన్నికల తర్వాత సస్పెండ్ అయ్యారు.. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ఫిర్యాదు మేరకు పార్టీ గతంలో చర్యలు తీసుకుంది.. ప్రసన్నాయి పల్లె మహానంద రెడ్డి, పూలకుంట శివారెడ్డి కూడా తన వర్గీయులతో వర్ధంతి వేడుకల్లో ఆలస్యంగా పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి,, మహానంది రెడ్డి వర్గాల మధ్య కూడా అభిప్రాయ బేధాలు బలంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యల పైన, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పై తనదైన శైలిలో ప్రకాష్ రెడ్డి ఆరోపణ సంధిస్తుంటాడు. అయితే సొంత పార్టీలోనే సమస్యలు ఎక్కువ అవుతుండడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.. గతంలో రాప్తాడు మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షులు బెందలూరు గోపాల్ రెడ్డి, పూలకుంట శివారెడ్డితో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డికి మంచి సంబంధాలు ఉండేటివి. చిన్న,చిన్న ఈగోలు, పట్టింపుల వల్లే రాప్తాడు నియోజకవర్గంలో నేతల మధ్య, వర్గీయుల మధ్య అభిప్రాయ బేధాలు ఎక్కు వవుతున్నాయి. ఇది ఇలా ఉండగా రాప్తాడు మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షులు బెందల వారు గోపాల్ రెడ్డి, ఆయన సోదరులు, ఇతర ఆయన వర్గీయులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి, ఆయన సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి పైన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ జెండాను పక్కన పెట్టి మీరు మేము తేల్చుకుంటామని సవాల్ చేశారు.

## భవిష్యత్తులో ఎస్వీబిసి వేదికగా మరిన్ని భక్తి కార్యక్రమాలు

- సంగీత దర్శకుడు ఆర్‌పి పట్నాయక్



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** భవిష్యత్తులో టిటిడి ఎస్వీబిసివేదికగా మరిన్ని భక్తి కార్యక్రమాలను నిర్వహించాలనే తన ఆకాం క్షను సంగీత దర్శకుడు ఆర్.పి. పట్నాయక్ వ్యక్తం చేశారు. ఎస్వీబిసి చైర్మన్ బి.శ్రీధర్‌వర్మను ఆదివారం ఆర్‌పి పట్నాయక్ మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఇద్దరూ భక్తి సంగీత సిరీస్‌లు , ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్ర మాల ను ఎస్వీబిసి ద్వారా ప్రసారం చేయడానికి అవకాశాలను పరిశీలించారు. టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న భారతదేశపు మొట్టమొదటి ప్రభుత్వ రంగ భక్తి ఛానల్ ఎస్వీబిసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల కోసం ప్రత్యక్ష ఆలయ కార్యక్రమాలు, పారాయణాలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో తన కంటెంట్‌ను విస్తరిస్తోంది. తిరుపతిలోని ఎస్వీబిసి కార్యాలయంలో శ్రీధర్ వర్మను కలిసి సంగీత ప్రాజెక్టుల గురించి వివరించారు. ఇందులో"దేవ కరుణామృతం" ఆల్బమ్ (లక్ష్మీ ...మ్మ నారాయణస్తోత్రం, దత్త పాదుకాస్తోత్రం మరియు దత్త చిన్మయా స్తోత్రంతో కూడినది), ఆధ్యాత్మిక"అప్ప అప్ప అయ్యప్ప" సింగిల్, మరియు శ్రీరాము డికి అంకితమైన"పిబరే రామ రసం" పాట ఉన్నాయి. అలాగే 18 అధ్యా యాలతో కూడిన తన"సంపూర్ణ భగవద్గీత తాత్పర్యం" ప్రాజెక్ట్ వివ రాల్ని ను కూడా ఆయన పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్వీబిసి చైర్మన్ బి. శ్రీ ధర్ వర్మ ఆర్.పి.పట్నాయక్ చేపట్టిన భక్తికార్యక్రమాలను

## కొయ్యలగూడెం అభివృద్ధికి నేవీ డిపో కీలకం రైతులు అనుకూలంగా ఉన్నారు.. ఎంపీ పుట్టా

**ఏలూరు, సెప్టెంబరు13, (ప్రభాతవార్త) :** కొయ్యలగూడెం ప్రాంత అభివృద్ధి కోసమే తన ప్రయత్నమని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఏలూరు క్యాంపు కార్యాలయంలో కొయ్యలగూడెం గ్రామ రైతులు, కూటమి నాయకులు ఎంపీని కలిసి నేవీ డిపోను కొయ్యలగూడెంలోనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నేవీ డిపో ఏర్పాటుకు 90 శాతం మంది రైతులు అనుకూలంగా ఉన్నారని రైతు నేతలు ఎంపీకి వివరించారు. కొద్దిమంది చేస్తున్న ఆందోళనలతో ప్రాంత అభివృద్ధికి ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నేవీ డిపో ఏర్పాటు జరిగితే వేలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రైతుల విజ్ఞప్తిపై స్పందించిన ఎంపీ పుట్టా మహేష్‌కుమార్. గత ఎన్నికల్లో కొయ్యలగూడెం ప్రజలు తనకు పూర్తి మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. నేవీ ఆయుధ డిపోను ఏర్పాటు చేయడానికి తాను ఇప్పటికే కృషి చేశానని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడి



ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొయ్యలగూడెంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుపై హోంమంత్రితో మాట్లాడతానన్నారు. ఎంపీ స్పందనపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ, ఆయన నాయకత్వంలో కొయ్యలగూడెం ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు కూటమి నాయకులు బొల్లిన నిర్మల కిశోర్, కారం భీమరాజు, చిటికన బాల గంగాధర్ తిలక్, కొల్లూరి రవి, బొమ్మ దుర్గబాబు, గొల్లిశెట్టి శ్రీను, మద్దు మోహన్, జ్యేష్ట రామకృష్ణ, మల్లిశెట్టి రాంబాబు, చిరువూరి శ్రీను, గద్దె రాము, చెప్పుల అశోక్‌కుమార్, చెరుకూరి గోపాలరావు, దుగ్గిరాల బోస్ తదితరులు పాల్గొన్నారు.

## మచిలీపట్నం తీరాన్ని ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతాం

- బందరుకి ఆధ్యాత్మిక, పర్యాటక శోభ తీసుకొచ్చేలా గణపతి ఉత్సవాలు: మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభా తవార్తప్రతినిధి:** మచిలీపట్నం సముద్ర తీరాన్ని దేశంలోనే ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక, కళా క్షేత్రంగా మార్చి తీరుతామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మీడియాతో మాట్లాడుతూ.. మంగినపూడి సాగరతీరం గణపతి నవరాత్రులతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోబోతోంది. లోక కల్యాణార్థం 63 అడుగుల మహా గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నాం. మహాగణపతి ఆలయంతో పాటుగా తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ ఇంద్రకీలాద్రి ఆలయం, సింహాచలం వరాహనరసింహస్వామి వారి దేవాలయం, భద్రాద్రి రాముల వారి నమూనా ఆలయాలు, ప్రచార రథాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం. సాగరతీరంలో హోమాలు ఏర్పాటు చేసుకుని మంత్రోచ్చారణలతో అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. కుల మత ప్రాంతాలకు అతీతంగా భక్తులంతా హాజరవుతుండడం ఆనందం. పర్యాటక రంగం, దేవాదాయ శాఖ నుండి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడం అభినందనీయం. కార్యక్రమానికి భారీ ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. ప్రత్యేకంగా ట్రాఫిక్ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రాంతం మొత్తాన్ని వన్ వే చేశాం. తద్వారా వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకమూ ఎదురవకుండా చర్యలు తీసుకున్నాం. ఏపీలోనే మొట్టమొదటి సారిగా ఈ ప్రాంతం మొత్తంలో భారీ ఎత్తున లైటింగ్ ఏర్పాటు చేశాం. సముద్రతీరంలో లైట్లు, వాచ్ టవర్స్ ఏర్పాటు చేశాం. ప్రజలకు తాగునీరు, ఆహారం, మందులు అందుబాటులో ఉంచాం. కార్యక్రమానికి ముఖ్యమంత్రిగారు, గవర్నర్ గారు సహా ఎంతో మంది ప్రముఖులు హాజరవుతారు. ప్రతి ఇంటి నుండి మట్టి సేకరించాలనే పిలుపు మేరకు విగ్రహ నిర్మాణంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఖైరతాబాద్ విగ్రహం నిర్మాణం చేపట్టే నిపుణులతోనే నిర్మించడం జరిగింది. సముద్రతీరంలో హోమ గుండాలు ఏర్పాటు చేశాం. కర్నాటక నుండి వచ్చే కొంత మంది పీఠాధిపతులతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నాం. బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ వేగంగా పూర్తవడంతో పాటుగా, ఈ ప్రాంతానికి ఆధ్యాత్మిక పర్యాటక పారిశ్రామిక శోభ కలిగేలా కార్యక్రమాలు చేపట్టాం. ఈ ప్రాంతాన్ని పర్యాటక అభివృద్ధికి అన్ని రకాలైన చర్యలు తీసుకుంటున్నాం. స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా ఈ ప్రాంతంలో రూ.100 కోట్లతో పెట్టుబడులు రాబోతున్నాయి.



## బ్రహ్మోత్సవాల్లో అప్రమత్తంగా ఉండండి

- రాష్ట్ర విపత్తు స్పందన అగ్ని మాపక డిజి వెంకటరమణ



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో సహజంగానే అగ్నిమాపకశాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తుందని, రానున్న శ్రీవారి బ్రహ్మోత్స వాల సమయంలో మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని రాష్ట్ర విపత్తు స్పందన అగ్ని మాపక డిజి వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఉదయం ఆయన తిరుమలకు విచ్చేశారు. తిరుమలలోని అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. అగ్ని మాపక కేంద్రంలో నూతన వాహనం,తిరుమల విజిలెన్స్ ఫైర్ వింగ్ వాహనాలను పరిశీలించారు. తిరుమల అగ్ని మాపక సిబ్బందితో ముఖాముఖి గా వారి సమస్యలను తెలుసుకొన్నారు. తిరుపతి అగ్ని మాపక అధికారి జె. రమణయ్య,టిటిడి సహాయ అగ్ని మాపక అధికారి అనిల్ కుమార్ ,అగ్ని మాపక అధికారి సుబ్బారావు,తిరుమల అగ్ని మాపక అధికారి సుబ్రమణ్యం రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## శాస్త్రోక్తంగా వరాహస్వామి జయంతి

**త్రిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఆదివ రాహక్షేత్రమైన తిరుమలలో భూ వరాహస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం వరాహ జయంతి శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భా గంగా ఉదయం కలశస్థాపన, కలశ పూజ, పు ణ్యాహవచనం చేపట్టారు. అనంతరం వేద మంత్రాల నడుమ మూలవర్లకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అద నపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆల య డిప్యూటీ ఇఒ భాస్కర్, పారుపత్తేదార్ హి మత్‌గిరి, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని ప్రముఖులు ఆకాంక్షించారు. బ్రహ్మోత్స వాల ఏర్పాట్లు చక్కగా ఉన్నాయని, భక్తులకు సౌకర్యాలు బావున్నాయని అభినందించారు. ఆదివారం ఉదయం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దినేష్ కుమార్,రాష్ట్ర అగ్నిమాపక డిజి పివి వెంకటరమణ, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎమ్మెల్యే బండారు శ్రావణి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

# శ్రీవారి ఆలయంలో మండపాల సంరక్షణ

- వేంకటేశ్వర చారిటబుల్ రిలీజియస్ ట్రస్ట్ సహకారం



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** హిందువుల పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల శ్రీవారి ఆలయంలోపల, పరిసర ప్రాంతాల్లోని పురాతన మండపాల సంరక్షణ పునరుద్ధరణ పనులకు టిటిడి చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆలయంలోపల ఉన్న పలు పురాతన మండపాల పరిరక్షణ పై కీలక నిర్ణయం తీసుకున్నారు. పూణేకు చెందిన లార్డ్ వెంకటేశ్వర చారిటబుల్ రిలీజియస్ ట్రస్ట్ పూర్తిగా పూర్తిగా విరాళం పద్ధతిలో ఈ పనులు చేపట్టేందుకు ఆ ట్రస్టు సిద్ధమవడంతో టిటిడి బోర్డు కూడా ఇటీవల ఆమోదం తెలిపింది. పురాతన మండపాల్లోని రాతి స్తంభాలు, రాతి పైకప్పులను శుభ్రపరచడం, పగుళ్లను శాస్త్రీయ పద్ధతిలో సరిచేయడం వంటి పనులను చేపట్టనున్నారు.చారిత్రక కట్టడాల అసలు రూపురేఖలు, ప్రాచీన వైభవం దెబ్బతినకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం (ఆటోక్యాడ్,హెచ్‌డి ఫోటోలు, డ్రోన్ షాట్లు) ఉపయోగించి ప్రతి రాయిని నంబరింగ్ చేసి భద్రపరచనున్నారు. దెబ్బతిన్న రాళ్లను శాస్త్రీయంగా మరమ్మతులు చేసి యథాస్థితిలో పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఆలయంలోపల రంగనాయక మండపం, కల్యాణోత్స వ మండపం, పాత పరకామణి మండపాల్లో పురాతన రాతి స్తంభాలు, రాతి ఉపరితలం, ఇతర రాతి నిర్మాణాలను కొన్ని రకాల రసాయనాలతో శుభ్రపరచడంతో బాటు పగుళ్లను అరికట్టి సంరక్షించే ఆ ట్రస్ట్ ప్రతినిధులు సిద్ధమయ్యారు. ఈ ట్రస్టు ప్రస్తుతం అలిపిరి పాదాల మండపాన్ని శాస్త్రీయ పద్ధతిలో పునర్నిర్మాణ పనులు చేస్తున్నారు. తిరుమల ఆలయంలో రంగనాయక మండపంలోని నాలుగు స్తంభాలను ఇప్పటికే ప్రయోగాత్మకంగా పైలెట్ బేసిస్ శుద్ధి చేయగా వాటి రూపం అద్భుతంగా మారిందని చెబుతున్నారు. ఈ ఫలితాలు చూసిన తరువాత ఈ ప్రాజెక్టకు ఆమోదం తెలిపింది. ప్రత్యేక రసాయనాలతో స్తంభాల పై ఉన్న జిడ్డు, మసిని తొలి గిస్తారు. ఆధునిక సిమెంట్ వాడకాన్ని పక్కన పెట్టి, సంప్రదాయ పద్ధతిలో సున్నపు గారతో పగుళ్ల పూడ్చనున్నారు. వకుళమాత పోటులో వేడి ప్రభావం తగ్గించేందుకు హీట్ షీల్డ్స్, మెరుగైన ఎగ్జాస్ట్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.కాగా మండపాలు తిరుమల ఆలయ వైభవాన్ని వర్ణిస్తాయి.ఆలయంలో పూర్వం రాజులు ,భక్తులు నిర్మించిన పురాతన రాతి కట్టడాలైన మండపాలు ఆలయ వైభవాన్ని చాటిచెబుతుంది.ఈ మండపాలు, వర్షాలు మొదలైన ప్రతికూల సమయాల్లో భక్తులకు ఆశ్రయాలుగా ఉన్నాయి. ఆలయంలోనల ప్రతిమా మండపం శ్రీవారి ఆలయ మహాద్వారానికి ఆనుకుని, విజయనగర చక్రవర్తి కృష్ణదేవరాయలు 16 స్తంభాలతో ఈ మండపాన్ని నిర్మించారు. ఈ మండపంలో శ్రీకృష్ణదేవరాయలు ఆయన ఇద్దరు భార్యలైన తిరుమల దేవి, చిన్న దేవిల జీవ పరిమాణ రాగి విగ్రహాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఈ మండపంలో ఒక తులాభారం విభాగం ఉంది.

**మహామణి మండపం**

ఆనంద నిలయంలోని బంగారు వాకిలి గరుడ మందిరం మధ్య ఉన్న ఈ మండపాన్ని 1417లో నిర్మించారు. ఇది 16 స్తంభాలపై నిలబడి ఉంది .ఈ స్తంభాలపై నరసింహస్వామి, వరాహస్వామి, మహావిష్ణువు, వేంకటేశ్వర స్వామి చిత్రాలు పొందుపరచబడి ఉన్నాయి.

**అద్దాల (గాజు) మండపం**

శ్రీవారి ఆలయం లోపల, రంగురంగుల అద్దాల పనితో ఒక ఎత్తైన వేదికపై నిర్మించబడిన ఈ మండపాన్ని 1831లో ఒక నాయకుడు విరాళంగా ఇచ్చారు. రంగనాయకుల మండపం ఎత్తైన పైకప్పు గల ఈ మండపం ప్రస్తుతం స్నపన తిరుమంజనం వంటి ప్రత్యేక కార్యక్రమాలకు వేదికగా ఉంది. ఇక్కడ విఐపిలు, వివిఐపిలు వేద పండితులచే ఆశీర్వచనం స్వీకరిస్తారు. ఈ వేదికను ఒకప్పుడు కళ్యాణ ప్రదర్శనల కోసం ఉపయోగించేవారు.కళ్యాణ మండపం సంపంగి ప్రాకారానికి దక్షి ణంగా ఉంది. ఇక్కడ జ్యేష్ఠాభిషేకం



## ప్రైవేటు వాహనాలపై ఎలాంటి ఆంక్షలు లేవు

**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి బ్రహ్మోత్స వాల వేళ తిరుమలకు వచ్చే ప్రైవేటు వాహనాలపై ఆంక్షలు విధిస్తున్నట్లు, రోజుకు 15వేల వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని టిటిడి తెలిపింది.నిర్ణయించిన వాహనాల సంఖ్య తరువాత వచ్చే వాహనాలను చెక్‌పాయింట్ల వద్ద నిలిపివేస్తారంటూ సామాజిక మాధ్యమంలో జరుగుతున్న ప్రచారం టిటిడి దృష్టికి వచ్చిందని, ఇది పూర్తిగా అవాస్తవమని చెప్పారు. తిరుమలకు వచ్చే ప్రైవేటు వాహనాల సంఖ్యపై ఈ తరహా ఎలాంటి నిర్ణయాన్ని టిటిడి తీసుకోలేదు. టిటిడికి సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు, సమాచారం అధికారిక టిటిడి ప్రకటనల ద్వారా మాత్రమే తెలియజేయబడతాయి. వాస్తవా లను నిర్ధారించుకోకుండా ఇలాంటి అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేయడం ద్వారా భక్తు లను అయోమయానికి గురిచేయడం సరికాదని పేర్కొంది..

## తిరుమల ఆలయానికి తొమ్మిది గొడుగులు సమర్పణ



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారికి తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా తిరునింద్రవూరుకు చెందిన భాష్యకార కైంకర్య ట్రస్ట్ ఆదివారం తొమ్మిది గొడుగులను సమర్పించారు. ట్రస్ట్ అధ్యక్షుడు వెంపటి మాధవ నాయుడు, ఫౌండర్ ట్రస్టీ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో తెచ్చిన గొడుగులను ఆలయ డిప్యూటీ ఇఒ భాస్కర్,ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరికి వైభవ మండపం వద్ద అందజేశారు. గత తొమ్మిదేళ్లుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా తొమ్మిది గొడుగులను శ్రీవారికి సమర్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## పద్మావతీఅమ్మకి రూ.3.78 లక్షల విలువైన వజ్రాభరణాల విరాళం

**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి తిరుమల ఆలయం తరువాత అంతటి ప్రాశస్త్యం ఉన్న తిరుచానూరు పద్మావతీ అమ్మవారికి దాత విరాళం అందించారు. ఆదివారం ఉదయం బెంగళూరుకు చెందిన సి. పద్మజ, కె. రాఘవేంద్రరావు దంపతులు 3.78 లక్షల విలువైన అరుదైన వజ్రాభరణాలను ఆలయ అధికారులకు విరాళంగా అందజేశారు. అన్‌కట్ వజ్రాలు, కెంపులు, పచ్చలతో అలంకరించిన ఒక జత స్టడ్స్‌ను అమ్మవారి సేవకు సమర్పించారు. అమ్మవారి అనుగ్రహం పొందాలనే భక్తిభావంతో ఈ ఆభరణాలను సమర్పించినట్లు దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోపద్మావతి అమ్మవారి ఆలయ అర్చకుడు బాబు స్వామి, ఆలయ ఎఇఒ దేవరాజులు, ఎవిఎస్ఒ శ్రీహరి రావు, సూపరింటెండెంట్ సురేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ చలపతి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు రిలయన్స్‌విద్యుత్ బస్సులు వచ్చేశాయ్

- రేపు సిఎం చంద్రబాబు ప్రారంభం



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య రెట్టింపవుతున్న వేళ కొండపై ప్రయాణానికి సులభంగా అవసరమైన విద్యుత్ బస్సులను రిలయన్స్‌సంస్థ అందించింది. రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ విరాళంగా ప్రకటించిన 25 విద్యుత్ ధర్మరథం బస్సుల్లో 15 బస్సులు ఆదివారం ఉదయం తిరుమలకు వచ్చాయి. ఈ బస్సులను శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సామాన్య భక్తుల సౌకర్యార్థం రేపు సిఎం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. రిలయన్స్ సంస్థ అందజేసే బస్సులతో బాటు భారత్ బయోటెక్ సంస్థ అందజేసే ఏడు బస్సులు త్వరలోనే తిరుమలకు రానున్నాయి. రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ 25 ఇవి బస్సులను విరాళంగా ప్రకటించారు. ఇందులో 15 బస్సులు ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకున్నాయి. వాటికి అవసరమైన 50 మంది డ్రైవర్లు, ఛార్జింగ్ స్టేషన్‌ను రిలయన్స్ సంస్థ విరాళంగా అందించింది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు ప్రతి రోజు లక్ష మంది భక్తులు వస్తున్నారు. దేవుని దర్శనం చేసుకోవడం ఎంత ముఖ్యమో ఇక్కడికి చేరుకున్న తర్వాత సామాన్య భక్తులకు రవాణా విషయంలో ఎదురయ్యే ఇబ్బందులు చాలాకాలంగా ఒక సవాల్‌గానే ఉన్నాయి. 15బస్సులేగాక మిగిలిన బస్సులు కూడా అందుబాటులోకి వస్తే తిరుమలలో సామాన్య భక్తుల రవాణా వ్యవస్థకు కష్టాలు తీరిపోతాయి. భక్తుల రోజువారీ అవసరాలకు ఉపయోగపడే ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసేలా సహకరించడం శుభపరిణామంగా టిటిడి భావిస్తోంది. భారీ రద్దీ ఉన్న సమయంలో ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సిన అవసరం భక్తులకు తగ్గుతుంది. పెరుగుతున్న వాహన రాకపోకలను సాధ్యమైనంత వరకు పర్యావరణహితంగా మార్చడంలో విద్యుత్‌తో నడిచేబస్సులు రావడం ప్రత్యేకత. ఈ బస్సులు తిరుమలలో టిటిడి గ్యారేజీలో ఉంచారు. సోమవారం సాయంత్రం ఈ బస్సులకు ప్రత్యేక పూజలు చేయనున్నారు.

14-9Pg7exHMNWJQE:14-9Pg7exHMNWJQE.qxd 9/13/2026 11:42 PM Page 1



# ఆధ్యాత్మిక శోభతో నెల్లూరులో గణేష్ ఉత్సవాలు

● సెప్టెంబర్ 14 నుంచి 18 వరకు ప్రముఖ కళాకారులతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ● రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త - వైద్యం:** నెల్లూరు నగరంలోని ఇరుగాలమ్మ ఆలయం సమీపంలోని గణేష్ ఘాట్ వద్ద వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొని ఉత్సవాల నిర్వహణ, భక్తుల సౌకర్యాలు, నిమజ్జన ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. వినాయక చవితి ఉత్సవాలను ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నెల్లూరు నగరంలో అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. వేలాది మంది భక్తులు గణేష్ ఘాట్‌కు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**నిమజ్జన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి..**

గణేష్ నిమజ్జనం రోజున భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. నిమజ్జనం కోసం వినియోగించే భారీ ట్రాలీలు, క్రేన్లను ఆర్టీఓ, పోలీస్ అధికారులు తప్పనిసరిగా తనిఖీ చేసి ధృవీకరించాలని ఆదేశించారు. నిమజ్జనానికి వెళ్లే వాహనాలు మార్గమధ్యంలో ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నిమజ్జన ప్రక్రియ ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

**భక్తులకు విస్తృత సౌకర్యాలు..**

గణేశోత్సవాలకు వచ్చే భక్తుల కోసం గణేష్ ఘాట్ వద్ద మంచినీరు, పాలు, మజ్జిగ, బిస్కెట్లు తదితర సౌకర్యాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భక్తులకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతిరోజూ నెల్లూరు నగరంలోని ప్రముఖ ఆలయాల నుంచి భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టాలని, గణేష్ ఘాట్ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధం, విద్యుత్, తాగునీరు, వైద్య, పోలీస్ తదితర అన్ని ఏర్పాట్లను సమగ్రంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

**ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత..**

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేక వేదికపై నాదస్వర కచేరీలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, ఇతర ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి సుప్రసిద్ధ కళాకారులను ఆహ్వానించి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీన గణేష్ నిమజ్జనం రోజున వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు, నదీ హారతి, ప్రత్యేక నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నెల్లూరు నగరం మొత్తం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడేలా ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

**వచ్చే ఏడాది నాటికి శాశ్వత గణేష్ ఘాట్..**

ఈ ఏడాది గణేష్ ఘాట్ వద్ద తాత్కాలిక ఏర్పాట్లు చేపట్టినప్పటికీ, వచ్చే ఏడాది నాటికి ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్ వద్ద రాష్ట్రంలో ప్రత్యేకంగా నిలిచేలా శాశ్వత గణేష్ ఘాట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గణేశోత్సవాలు ప్రతి సంవత్సరం మరింత వైభవంగా నిర్వహించేలా అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు.

**మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కృతజ్ఞతలు**

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ఈ ఏడాది గణేశోత్సవాల నిర్వహణకు ప్రభుత్వం, అధికారులు అన్ని విధాలా సహకరిస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి గణేశోత్సవాలను మరింత అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినందుకు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్‌లోని గణేష్ ఘాట్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గణేష్ ఘాట్ వద్ద భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్ల కోసం మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా రూ.45 లక్షలు, నుడా ద్వారా రూ.15 లక్షలు మొత్తం రూ.60 లక్షలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఈ ఏడాది తాత్కాలిక ఏర్పాట్లు చేసినప్పటికీ వచ్చే ఏడాది నాటికి పూర్తిస్థాయిలో శాశ్వత గణేష్ ఘాట్ నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. గణేశోత్సవాల సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కళాకారులతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భక్తులందరూ కుటుంబ సమేతంగా ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నందన్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## గ్రావెల్ మాఫియా పై గుత్తావారిపాలెం గ్రామస్తులు తిరుగుబాటు

● మండలంలో మరో సారి రెచ్చిపోయిన గ్రావెల్ మాఫియా



**చిల్లకూరు (నెల్లూరు), సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** అక్రమంగా గ్రావెల్ లోడుతున్న రెండు ఇటాచిలు, గ్రావెల్ తరలిస్తున్న 13 టిప్పర్‌లును గ్రామస్థులు అడ్డుకుని పోలీసు, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. సర్వ్ నెంబర్ 743/2 నుండి 800 వరకు భూముల్లో నిబంధనలుకు విరుద్ధంగా సుమారు మూడు మీటర్లు వరకు లోడేసిన గ్రావెల్ మాఫియా గుట్టు చప్పుడు కాకుండా గత 5 రోజుల్లో కోట్ల రూపాయల గ్రావెల్ తరలించిన గ్రావెల్ మాఫియా చిల్లకూరు మండలం కడివెడు రెవెన్యూ పరిధిలో గుత్తవారి పాలెం గ్రామ సమీపంలో సర్వే నెంబర్ 743/2 నుండి 800 వరకు ఉన్న ప్రభుత్వ భూముల్లో నిబంధనలుకు విరుద్ధంగా సుమారు మూడు మీటర్లు లోతు వరకు లోడేసి గత 5 రోజులుగా గ్రావెల్ మాఫియా పెద్ద ఎత్తున గ్రావెల్‌ను తరలించేసింది, గ్రావెల్ మాఫియా విషయం తెలుసుకున్న గుత్తావారి పాలెం గ్రామస్థులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకుని గ్రావెల్ మాఫియాను అడ్డుకున్నారు. ఘటనా స్థలంలో అక్రమంగా గ్రావెల్ లోడుతున్న రెండు 200 ఇటాచిలు, గ్రావెల్ తరలిస్తున్న 13 టిప్పర్‌లును అడ్డుకుని పోలీసు, రెవెన్యూ అధికారులుకు అప్పగించే పనిలో ఉన్నారు. గ్రామ మాజీ సర్పంచ్ చిట్టేటి నారాయణ పార్టీ సీనియర్ నాయకులు పెనుబోలు జానకిరామరెడ్డి పచ్చా వెంకటేశ్వర్లు నాయుడు, గ్రామస్తులు ఉన్నారు.

## ఏరాసు ప్రతాప్‌రెడ్డికి ఘన స్వాగతం



**అనంతపురం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా పర్యటన కు విచ్చేసిన స్థానిక సంస్థల ఎన్నికల తెలుగు దేశం పార్టీ అనంతపురం జిల్లా పరిశీలకులు, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డిని మాజీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు.

## లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు



**దగదర్తి (నెల్లూరు), సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** సున్నంబట్టి జాతీయ రహదారి వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి చెన్నైకి వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ముందు ఉన్న లారీని క్రాస్ చేయబోయి లారీని ఢీకొంది. వెంటనే విషయం తెలుసుకున్న దగదర్తి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూశారు. బస్సులో ప్రయాణిస్తున్న 30 మంది ప్రయాణికులు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు బస్సులో ఉన్న ప్రయాణికులకు డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదని, బస్సు అద్దాలు పగిలి బస్సు డ్యామేజ్ అయిందని చెప్తున్నారు. ఎస్సై మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు.

## మహీంద్రా థార్ ఢీకొని మహిళ మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు



**కొడవలూరు (నెల్లూరు), సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** మండలంలోని నాయుడుపాలెం క్రాస్రోడ్డు వద్ద జాతీయ రహదారి-16పై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బోగోలు మండలం తాటిచెట్లపాలెంకు చెందిన సుబ్రమణ్యం తన భార్య మల్లీశ్వరి, కుమారుడు నాగశివతో కలిసి బైక్పై గొలగమూడి హాస్టల్కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నాయుడుపాలెం క్రాస్రోడ్డు వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన మహీంద్రా థార్ వాహనం ముందు వెళ్తున్న లారీని దాటి బైక్ను ఢీకొట్టింది. థార్ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో మల్లీశ్వరి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. బైక్ నడుపుతున్న సుబ్రమణ్యంతో పాటు బాలుడు నాగశివకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను వెంటనే నెల్లూరులోని ఆసుపత్రికి తరలించారు. ఎస్సై కోటిరెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొడవలూరు సర్కిల్ సీఐ ఓ. దుర్గా ప్రసాద్రావు తెలిపారు. ప్రమాదానికి కారణమైన మహీంద్రా థార్ వాహనాన్ని, డ్రైవర్ను పోలీసులు అదుపు లోకి తీసుకుని విచారిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం

● లారీ ఆటోని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి

● ప్రమాద స్థలానికి చేరుకున్న డి.ఎస్.పి గోవిందరావు







**విజయనగరం (దత్తిరాజేరు) సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం పరిధిలోని శికార్ గంజి జాతీయ రహదారిపై, ఆదివారం తెల్లవారి జామున రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు, మృతి చెందిన వారు బాడంగి మండలం గజరాయునివలస గ్రామానికి చెందిన ఇద్దరు, దత్తిరాజేరు మండలం పెదమానాపురం గ్రామానికి చెంది న ఒకరిగా పోలీసులు గుర్తించారు. గజరాయిల వలస గ్రామానికి చెందిన తెర్లి ఆదినారాయణ (45), గునుపూరి తిరపతి (40), పెదమానాపురం గ్రామానికి చెందిన గుడ్ల రాము (48), ముగ్గురు మృతి చెందారు. విజయనగరం నుండి రాంభద్రపురం వైపు వస్తున్న ఆటో, ఒరిస్సా నుండి విజయనగరం వెళ్తున్న లారీ శికార్ గంజి జంక్షన్ వద్ద గట్టిగా ఢీ కొట్టడంతో, ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులు అక్కడకక్కడే మృతి చెందారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం సాయంత్రం గజరాయుని వలస గ్రామము నుండి ఆటోలో జొన్నలు తీసుకుని విజయనగరం మార్కెట్ కి వెళ్లి అమ్ముకొని తిరిగి ఆదివారం తెల్లవారి వస్తుండగా పెదమానాపురం బస్టాప్ వద్ద చేపలు పట్టుకొని గుడ్ల రాము అనే వ్యక్తి ఆటో ఎక్కి ప్రయాణించగా శికార్గంజి జంక్షన్ దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఆటోను గట్టిగా ఢీకొనడంతో ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారని ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు. తెర్లి ఆదినారాయణకు భార్య లక్ష్మి, కుమారుడు కిషోర్ ప్రైవేట్ జాబు చేసుకుంటున్నాడు, కుమార్తె రాజేశ్వరి వివాహం అయ్యింది, గునుపూరి తిరపతికీ భార్య లక్ష్మి, ఇద్దరుపిల్లలు హేమంత్ ఐదో తరగతి దివ్య ఏడో తరగతి చదువుతున్నారు. గుడ్ల రాముకి, భార్య ఎల్లమ్మ ఇద్దరు ఆడపిల్లలు భవాని డిగ్రీ చదువుతుంది. దేవి పదో తరగతి చదువుతున్నారు. ఇద్దరు ఆడపిల్లలను చదివించి పెళ్లిళ్లు ఎలా చేస్తానని భార్య ఎల్లమ్మ పిల్లలు తండ్రిని చూసి కన్నీరు మున్నీరై బోరున విలపిస్తున్నారు. రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదం జరిగిన స్థలానికి బొబ్బిలి డిఎస్పి గోవిందరావు, సి.ఐ సన్యాసి నాయుడు చేరి వివరాలు సేకరించారు. ఎస్ బూర్జు వలస ఎస్సై ప్రయోగ మూర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే రం గారావు సంఘటన స్థలం చేరుకొని మృతు ని కుటుం బాలకు ఓదార్చి ప్రభుత్వం నుంచి ఏ విధమైన నష్టపరిహా రం రావలసిఉన్న అందజేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. పోలీసులకు డాక్టర్లకు శవపంచనామా చేసి తక్షణమే మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేయాలని ఆయన కోరారు.

## టెట్ జూన్2026 ఫలితాలు విడుదల

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** టెట్ జూన్2026 ఫలితాలను మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. "టెట్ ఫలితాలను వెబ్‌లో చూసుకోవచ్చు. వాట్సాప్ ద్వారా టెట్ ఫలితాల తెలుసుకునే అవకాశం. 9552300009 వాట్సాప్ నంబర్‌లో ఫలితాలు తెలుసుకోవచ్చు. ఇన్‌సర్వీస్ టీచర్లలో 51 శాతం ఉత్తీర్ణత. రెగ్యులర్ అభ్యర్థుల్లో 47 శాతం ఉత్తీర్ణత. విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు. ఇన్‌సర్వీస్ టీచర్లకు అభినందన లు. అర్హత సాధించలేకపోయినవారు నిరుత్సాహపడొద్దు" అని లోకేశ్ అన్నా రు.

## మెగా జాబ్‌మేళాలో 490 మందికి ఉద్యోగావకాశాలు





**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని శుభమస్తు కళ్యాణ మండపంలో ఆదివారం జయప్రద ఫౌండేషన్ చైర్మన్, జాతీయ టిడిపి ఉపాధ్యక్షులు తొండెపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళ నిరుద్యోగ యువతకు ఊపిరులూదింది. మొత్తం 1,200ల మంది హాజరుకాగా వీరిలో 490 మంది ఐటి రంగంలో ఉపాధులకు ఎంపికయ్యారు. నాన్ ఐటి రంగంలో ఎంపికైన వారికి ఆఫర్ లేఖలు అందజేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో నిరుద్యోగ యువత తరలిరావటంతో వచ్చిన వారిలో అర్హులైన వారందరికి న్యాయం చేసేందుకు కృషిచేస్తున్నట్లు సభలో నిర్వాహకులు టిడి జనార్ధన్ ప్రకటించారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కెడిసిసి బ్యాంక్ చైర్మన్-మాజీమంత్రి నెట్టెం రఘురామ్ కూడా పాల్గొని జనార్ధన్ కృషిని అభినందించారు. కొన్ని వేలమందికి జయప్రద ఫౌండేషన్ ద్వారా ఉచిత మెగా మెడికల్ క్యాంప్స్ ఏర్పాటుచేస్తూ వేల సంఖ్యలో ఇప్పటికి కంటి శుక్లాల శస్త్రచికిత్సలు నిర్వహించటం ద్వారా సామాజిక సేవలో కొత్త రికార్డు సృష్టించారని ప్రశంశించారు. సభలో విద్యాభారతి చైర్మన్ వెలగపూడి రామకృష్ణ, బోడేపూడి అమర్, కావూరి శ్రీధర్, సిద్ధార్థ అకాడమి ప్లేస్మెంట్ అధికారి చెరుకూరి చాముండేశ్వరి, తొండెపు వర్ధన్, గౌతమి సరోజ, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ కట్టా వెంకటనరసింహారావు, నేతలు చింతల సీతారామయ్య, వడ్లమూడి రాంబాబు, మండవ, అమ్మాణీ, వాగ్దేవి లైఫ్‌స్కిల్, జెఆర్‌సి, విశ్వభారతి కాలేజీల విద్యార్థులు, వాలంటీర్లు, ప్రిన్సిపాళ్ళు పాల్గొన్నారు.

## దక్షిణాఫ్రికాలో గాంధీకి ఎపి స్పీకర్ నివాళి

● చారిత్రక పీటర్‌మారిట్జ్‌బర్గ్ రైల్వే స్టేషన్‌లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



**విజయవాడ,సెప్టెంబరు13,ప్రభాతవార్తప్రతినిధి:** దక్షిణాఫ్రికాలోని క్వాజులునాటల్ ప్రావిన్స్‌లో ఉన్న చారిత్రక పీటర్‌మారిట్జ్‌బర్గ్ రైల్వే స్టేషన్‌ను ఆదివారం సందర్శించి, జాతిపిత మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులర్పించారు. శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవరతో కలిసి స్పీకర్ గాంధీ స్మారక కేంద్రాన్ని సందర్శించారు. జూన్ 7, 1893న జాతి వివక్ష కారణంగా గాంధీజీని ఫస్ట్ క్లాస్ బోగీ నుంచి బలవంతంగా గెంటేసిన ప్లాట్‌ఫాంను వారు పరిశీలించారు. వివక్షకు గురైన తర్వాత గాంధీజీ గడ్డకట్టే చలిలో రాత్రంతా గడిపిన వెయిటింగ్ రూమ్‌ను అయ్యన్నపాత్రుడు సందర్శించి, ఆనాటి పరిస్థితులను స్మరించుకున్నారు. ఆ సంఘటనే సత్యాగ్రహం అనే అహింసా పోరాటానికి, పౌర హక్కుల సాధనకు నాంది పలికిందని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. "ప్రపంచ చరిత్రలో పీటర్‌మారిట్జ్‌బర్గ్ ఒక పవిత్ర స్థలం. తన ఆత్మగౌరవాన్ని వదులుకునేందుకు ఒక వ్యక్తి చేసిన తిరస్కారమే, జాతి వివక్ష మరియు వలస పాలనకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్త చైతన్యానికి దారితీసింది. గాంధీజీ నైతిక ధైర్యం తన వ్యక్తిగత కష్టాన్ని సత్యం, సమానత్వం, మానవ హక్కుల కోసం ఒక శాశ్వత ఉద్యమంగా మార్చింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య రక్షకులుగా, మన చట్టసభల్లో న్యాయం, రాజ్యాంగ విలువలు మరియు ప్రతి పౌరుడి గొంతుకకు అత్యున్నత ప్రాధాన్యం దక్కేలా ఆయన ఆశయాల నుంచి మనం నిరంతరం స్ఫూర్తి పొందుతున్నాము" అని అన్నారు. దక్షిణాఫ్రికాలో గాంధీజీ 21 ఏళ్ల ప్రయాణం, నాటల్ ఇండియన్ కాంగ్రెస్ స్థాపనకు సంబంధించిన చారిత్రక ఫోటో గ్యాలరీని స్పీకర్ వీక్షించారు. అనంతరం, స్మారక ప్రదేశంలో వారసత్వ సంపద పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను స్థానిక ట్రస్ట్ ప్రతినిధులు, కమ్యూనిటీ నాయకులు స్పీకర్‌కు వివరించారు.

# నెల్లూరు అభివృద్ధి ఆగదు

● బురదచల్లుడు రాజకీయాలు సాగవు

● స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే బురదచల్లే ప్రయత్నాలు



**నెల్లూరు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త - వైద్యం :** వైఎస్ఆర్‌సీపీ నేతలు చేస్తున్న అర్థంపర్థం లేని ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బురదచల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా నెల్లూరులో అభివృద్ధిని అడ్డుకోలేరని తేల్చిచెప్పారు. నెల్లూరులో ఆదివారం పర్యటించిన మంత్రి నారాయణ వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై స్పందించారు. చంద్రశేఖర్ రెడ్డి చేసిన ఆధారాలు లేని ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అల్లీపురం డంపింగ్‌యార్డు సుమారు 60 ఏళ్లుగా ఉందని మంత్రి తెలిపారు. డంపింగ్ యార్డు కారణంగా పరిసర ప్రాంతాల అభివృద్ధి కూడా నిలిచిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెత్తను పెద్దఎత్తున తొలగించామని, లెగసీ వేస్ట్‌ను శాస్త్రీయంగా తొలగించేందుకు టెండర్లు పిలిచామని చెప్పారు. టెండర్ల ప్రక్రియ మొత్తం నిబంధనల ప్రకారం, పారదర్శకంగా జరిగిందని తెలిపారు. ఈ అంశంపై అవగాహన లేకుండా అవినీతి ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

**చంద్రబాబు విజన్‌తో వ్యర్థాల నుంచి విద్యుత్..**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి ఉన్న నాయకుడని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని లెగసీ వేస్ట్‌ను తొలగించడంతో పాటు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు దాని నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే దిశగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

**అవినీతికి పాల్పడాల్సిన అవసరం నాకు లేదు..**

తనపై అవినీతి ఆరోపణలు చేయడంపై మంత్రి ఘాటుగా స్పందించారు. అవినీతికి పాల్పడాల్సిన అవసరం తనకు లేదన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం సొంత నిధులను కూడా ఖర్చు చేస్తున్నానని చెప్పారు. నెల్లూరు కార్పొరేషన్‌లోని ప్రభుత్వ పాఠశాలలను వీఆర్ హైస్కూల్ తరహాలో ఆధునీకరిస్తామని తెలిపారు. నగరంలో చెట్లు నాటే కార్యక్రమానికి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వ నిధులు వినియోగించలేదని, తన స్నేహితులు, సన్నిహితుల సహకారంతో సీఎస్ఆర్ నిధులు సమకూర్చి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు.

**అజీజ్‌కు సాయం చేస్తే తప్పా..**

ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న టీడీపీ నేత అబ్దుల్ అజీజ్‌కు సహాయం చేయడాన్ని కూడా రాజకీయ రంగు పులమడం సరికాదని మంత్రి అన్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వ్యక్తికి సహాయం చేయడం కూడా తప్పేనా అని ప్రశ్నించారు. అవాస్తవ ఆరోపణలు, అభాండాలు కొనసాగిస్తే చివరకు నష్టపోయేది వైఎస్ఆర్‌సీపీయేనని హెచ్చరించారు. వైఎస్ఆర్‌సీపీ రాజకీయ వైఖరిపైనా మంత్రి విమర్శలు గుప్పించారు. వై నాట్ 175 అని చెప్పి 11 స్థానాలకే పరిమితమయ్యారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే అదే ఫలితం మళ్లీ పునరావృతమవుతుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని చూసి తీర్పు ఇస్తారని, నెల్లూరు కార్పొరేషన్‌లో అన్ని స్థానాల్లో టీడీపీ అభ్యర్థులే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

**నెల్లూరును బెస్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం..**

నెల్లూరును రాష్ట్రంలోనే అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి నారాయణ అన్నారు. కార్పొరేషన్ అభివృద్ధికి రూ.234 కోట్ల నిధులు మంజూరయ్యాయని, యూజీడీ పనులకు కూడా 250 కోట్ల అదనపు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా, ఎన్ని కుట్రలు పన్నినా నెల్లూరు అభివృద్ధి ఆగదన్నారు. ప్రజల కోసం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా కొనసాగిస్తామని తెలిపారు. నెల్లూరును బెస్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి చెప్పారు.

## ఈనామ్ భూముల బాధితుల వంటావార్పు

**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** ఈనామ్ భూబాధితుల సమస్యలను ప్రభుత్వం చెవిన పెట్టకపోతుండటంతో ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్య పేటలో భూబాధితులు వెరైటీగా ఆదివారం వం టవార్పు చేపట్టి పాదచారులకు రహదారిపైనే భోజనాలు పంపిణీ చేశారు. ఒకపక్క నిరాహార దీక్ష, మరోపక్క వంటావార్పుతో సేవ చేశారు. రైత్వారి పట్టాలిచ్చి సర్వీస్ ఈనామ్ దారులకు సర్వహక్కులు కల్పించిన ప్రభుత్వం వాటిని ఈనా మ్ భూములను అమ్ముకుంటే చెల్లదని నిర్దేశించటాన్ని నిరసిస్తూ సర్వీస్ ఈనామ్ భూబాధితుల సంఘ ప్రతినిధులు గత వారం రోజులుగా పాత మున్సిపల్ కార్యాలయ కూడలి వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తు న్నారు. ఈనామ్ భూములను 22(ఏ)(1 )(సి)లో చేర్చటం న్యాయం కాదని, దశాబ్దకా లంగా రాష్ట్రవ్యాప్తంగా నెలకున్న ఈ సమస్య ను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించి బాధిత కుటుంబలను ఆదుకోవాలని నిరసన వ్యక్తంచేశారు. వంటవార్పు కార్యక్రమంతోపాటు రిలే దీక్షల్లో భూబాధిత కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు గద్దె సుధీర్, కళ్యాణం మురళి, అచ్యుతరామయ్య, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి, మాజీ యార్డు చైర్మన్ మానేపల్లి నాగ బ్రహ్మం, ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర నేత, మాజీ యార్డు చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్రరావు, న్యాయవాది రాయపూడి శ్రీనివాస్, నూకల బాలకృష్ణ, దేవరశెట్టి నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. దేవరశెట్టి నాగేశ్వరరావు, చమన్ శ్రీనివాసరావు, గెల్లా నాగేశ్వరరావు, మాశెట్టి శ్రీనివాసబ్రహ్మం, ఏడోరోజు దీక్షల్లో పాల్గొన్నారు.

14-09pg10exH:14-09pg10exH.qxd 9/13/2026 10:57 PM Page 1



# ఖతార్ క్లాసిక్ నుంచి
# అనాహత్ నిష్క్రమణ



**దోహా:** బెల్జియంకు చెందిన ప్రపంచ నంబర్ 9 టిన్నె గిలిస్‌తో ఐదు గేమ్‌ల పోరాటం తర్వాత భారత స్క్వాష్ స్టార్, టీనేజ్ షట్లర్ అనహాత్ సింగ్ ఖాతర్ క్లాసిక్ నుండి నిష్క్రమించింది. దోహాలో ఆదివారం నాడు పిఎస్ఎ ప్లాటినం ఈవెంట్ మహిళల రెండో రౌండ్‌లో అనాహత్, టిన్నే గిలిస్‌తో జరిగిన ఉత్సాహభరితమైన ఐదుగేమ్‌ల పోరాటం తర్వాత ఓటమి చెందింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో 20వ స్థానంలో ఉన్న అనాహాత్ తనకంటే ఉన్నత ర్యాంకులో ఉన్న ప్రత్యర్థిపై మరో అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. కానీ 2-1 ఆధిక్యం సాధించిన తర్వాత తన పునరాగమనాన్ని పూర్తి చేయలేకపోయింది. ఎనిమిదో సీడ్ గిలిస్ తొలి గేమ్‌ను 11-4 తేడాతో గెలిచి, బలమైన ఆరంభాన్ని ఇచ్చింది. అనాహత్ మరింత తీవ్రతతో స్పందించి, తర్వాతి రెండు గేమ్‌లను 11-8, 11-9 తేడాతో గెలుచుకుని, క్వార్టర్ ఫైనల్స్‌కు చేరడానికి ఒక గేమ్ దూరంలో నిలిచింది. అయితే నాలుగో గేమ్‌ను 11-4తో గెలిచి పోటీని సమం చేసిన బెల్జియన్ క్రీడాకారిణి, నిర్ణయాత్మక గేమ్‌లో 11-3తో ఆధిపత్యం చెలాయించి తదుపరి రౌండ్‌లో తన స్థానాన్ని సురక్షితం చేసుకుంది. అలాగే పురుషుల తొలి రౌండ్‌లో 24వ ర్యాంకు ఆటగాడైన అభయ్, స్విట్జర్లాండ్‌కు చెందిన 22వ ప్రపంచ ర్యాంకర్ డిమిత్రి స్టెయిన్‌మాన్ చేతిలో 7-11, 9-11, 1214 తేడాతో ఓడిపోగా, 38వ ప్రపంచ ర్యాంకర్ చోత్రాని, రెండో ర్యాంకు ఆటగాడైన న్యూజిలాండ్ ఆటగాడు పాల్ కాల్ చేతిలో 11-2, 11-3, 11-1 తేడాతో పరాజయం పాలయ్యాడు.

# యుఎస్ ఓపెన్ రాణిగా రైబాకినా
## సబలెంకా సంచలన ఓటమి

**న్యూయార్క్:** ఎలెనా రైబాకినా, రెండుసార్లు డిఫెండింగ్ ఛాంపియన్ అయిన అరీనా సబలెంకాను 6-4, 5-7, 6-2 తేడాతో ఓడించి యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ కిరీటాన్ని కైవసం చేసుకుంది. న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రైబాకినా 2 గంటల 21 నిమిషాల్లో విజయాన్ని పూర్తి చేసింది. రైబాకినా న్యూయార్క్ టైటిల్‌ను గెలుచుకోవడంతో, ప్రపంచ నంబర్ 1గా సబలెంకా 99 వారాల పాలనకు కూడా తెరపడింది. యూఎస్ ఓపెన్ విజయం 2026లో రైబాకినాకు మూడవ టైటిల్ కాగా, ఆమె కెరీర్‌లో ఇది 14వది. ఆమె విజయంతో డబ్ల్యూటిఎ టూర్‌లో సబలెంకాపై ఆమె హెడ్‌టుహెడ్ రికార్డు 810కి మెరుగుపడింది. 2016లో ఈ ఘనత సాధించిన ఏంజెలిక్ కెర్బర్, 2024లో సబలెంకాల తర్వాత, 2000 సంవత్సరం నుండి ఒకే సీజన్‌లో ఆస్ట్రేలియన్ ఓపెన్ మరియు యూఎస్ ఓపెన్ రెండింటినీ గెలిచిన మూడవ క్రీడాకారిణిగా ఆమె నిలిచింది. సబలెంకాను ఓడించడం ద్వారా, 2002లో సెరెనా విలియమ్స్ తర్వాత యూఎస్ ఓపెన్ ఫైనల్‌లో డిఫెండింగ్ మహిళల సింగిల్స్ ఛాంపియన్‌ను ఓడించిన మొదటి క్రీడాకారిణిగా రైబాకినా నిలిచింది. 2012లో విలియమ్స్ విక్టోరియా అజరెంకాను ఓడించిన తర్వాత, యూఎస్ ఓపెన్ ఫైనల్‌లో ప్రస్తుత ప్రపంచ నంబర్ 1 క్రీడాకారిణిని ఓడించిన మొదటి క్రీడాకారిణి కూడా ఈమెనే. ఈ ఓటమితో, 2023 నుండి ప్రతి సంవత్సరం కనీసం ఒక గ్రాండ్ స్లామ్ టైటిల్ గెలుస్తూ వస్తున్న తన అద్భుతమైన పరంపరను కొనసాగించాలన్న సబలెంకా ఆశలు ముగిశాయి. ఆమె 2023 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫైనల్‌లో రైబాకినాను ఓడించి తన మొదటి మేజర్‌ను కైవసం చేసుకుంది.





## మహిళల హాకీ ఆసియా కప్..
# భారత్‌కు టైటిల్

**మోకీ (చైనా):** హోరాహోరీ ఫైనల్ పోరులో చైనాను 1-0 తేడాతో ఓడించి, ఏహెచ్ఎఫ్ జూనియర్ ఆసియా కప్ టైటిల్‌ను వరుసగా మూడోసారి గెలుచుకోవడం ద్వారా భారత మహిళల జట్టు జూనియర్ హాకీ ప్రపంచ కప్‌కు అర్హత సాధించింది. మోకీలో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో సానికా చంద్రకాంత్ మానే ఆరంభంలోనే చేసిన గోల్ నిర్ణయాత్మకంగా నిలిచింది. 17వ నిమిషంలో సానికా గోల్ చేయడంతో, డిఫెండింగ్ ఛాంపియన్లు తమ ఖండాంతర కిరీటాన్ని నిలబెట్టుకున్నారు. టైటిల్ పోరు ఇరు జట్లలోనూ ఆందోళనకర వాతావరణంతో ప్రారంభమైంది, తొలి దశలో ఏ జట్టూ పట్టు సాధించలేకపోయింది. రెండో క్వార్టర్ ప్రారంభమైన రెండు నిమిషాలకే, సానికా చైనీస్ సర్కిల్‌లోకి బంతిని చాకచక్యంగా మళ్లించగా, అది భారత్‌ను ఆధిక్యంలోకి తీసుకువచ్చింది. భారత్ తమ 1-0 స్వల్ప ఆధిక్యంలో ఉండగా, రెండో అర్ధభాగం ఉత్కంఠభరితంగా మారింది. చైనా నూతనోత్సాహంతో ఆటను పునఃప్రారంభించి, మూడవ క్వార్టర్ ప్రారంభమైన ఏడు నిమిషాలకే స్కోరును సమం చేసేందుకు చేరువైంది. అయితే, భారత జట్టు ఆ పాస్ లక్ష్యాన్ని చేరకముందే అడ్డుకుంది. ఆఖరి క్వార్టర్ చైనా సమం చేసే గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించింది, కానీ భారత్ తమ స్వల్ప ఆధిక్యాన్ని కాపాడుకుని 1-0తో చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసి ట్రోఫీని కైవసం చేసుకుంది.

# టీమిండియాకు నాన్ స్టాప్

6 నెలల్లో 41 మ్యాచ్‌లు

ప్లేయర్లకు రొటేషన్ పాలసీ



**న్యూఢిల్లీ:** శ్రీలంకతో టెస్ట్ సిరీస్ తర్వాత దొరికిన చిన్నపాటి విరామం ముగియడంతో టీమిండియా మళ్ళీ అంతర్జాతీయ మ్యాచ్‌లతో బిజీ కానుంది. రాబోయే ఐపీఎల్ 2027 సీజన్ ప్రారంభమయ్యే వరకు టీమిండియా ఏకంగా 41 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ బిజీ షెడ్యూల్‌లో ఏడు టెస్టులు, 14 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లు ఉన్నాయి. ఈ భారీ షెడ్యూల్ ఆటగాళ్లపై తీవ్ర ప్రభావం చూపకుండా, వారి ఫిట్‌నెస్‌ను కాపాడటానికి భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నెల 13 ఆదివారం నుంచి సొంతగడ్డపై ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్‌తో భారత క్రికెట్ సందడి మళ్ళీ ప్రారంభమవుతుంది. ఈ సిరీస్ సెప్టెంబర్ 17 వరకు జరుగుతుంది. ఆఫ్ఘనిస్తాన్ సిరీస్ ముగియగానే, భారత్ సొంతగడ్డపై వెస్టిండీస్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్‌లో తలపడుతుంది. ఈ సిరీస్ ఈ నెల 27న ప్రారంభమై అక్టోబర్ 16 వరకు కొనసాగుతుంది. సరిగ్గా అదే సమయంలో, శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని మరొక ఇండియన్ టీం జపాన్‌లో జరిగే ఆసియా గేమ్స్‌లో పాల్గొననుంది. అలాగే, ఈ నెల 22న జపాన్‌తో ఏకైక చారిత్రాత్మక టీ20 మ్యాచ్ కూడా ఆడనుంది. ఇక అక్టోబర్ చివర్లో టీమిండియా న్యూజిలాండ్ పర్యటనకు వెళ్తుంది. అక్కడ రెండు టెస్టులు, ఐదు వన్డేలు, ఐదు టీ20ల సుదీర్ఘ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ అక్టోబర్ 22 నుంచి నవంబర్ 27 వరకు జరుగుతుంది. డిసెంబర్ 13 నుంచి 27 మధ్య శ్రీలంకతో మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్ జరగనుంది. కొత్త సంవత్సరం జనవరి 3 నుంచి 7 మధ్య జింబాబ్వేతో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ బిజీ షెడ్యూల్ కారణంగా కీలకమైన ఆటగాళ్లు గాయాల పాలయ్యే ప్రమాదం ఉండటంతో, బీసీసీఐ ఉన్నత అధికారులు రివ్యూ మీటింగ్‌లో కీలక నిర్ణయం తీసుకున్నారు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా స్టార్ ప్లేయర్లకు తగిన విశ్రాంతిని ఇస్తూ, రొటేషన్ పాలసీని అమలు చేయాలని నిర్ణయించారు. సీనియర్లకు కాలానుగుణంగా రెస్ట్ ఇస్తూ, యంగ్ ప్లేయర్లను రిజర్వ్ బెంచ్ ద్వారా రంగంలోకి దించడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ పాలసీ ద్వారా కీలక ఆటగాళ్లకు శారీరక, మానసిక విశ్రాంతి లభించి, పెద్ద టోర్నమెంట్‌ల ముందు వారు పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండేలా చూస్తారు. ఇక ఫైనల్ టచ్ గా ఆస్ట్రేలియాతో ఢీ కొట్టనుంది. భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య ఐదు టెస్టుల ప్రతిష్టాత్మక బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ జనవరి 21 నుంచి ఫిబ్రవరి 27 మధ్య జరగనుంది. ఈ సిరీస్‌తో టీమిండియా అంతర్జాతీయ షెడ్యూల్ ముగుస్తుంది. ఆ తర్వాత మార్చి మొదటి వారంలో ఐపీఎల్ 2027 హంగామా షురూ కానుంది.



## ఆసియా ఛాంపియన్‌షిప్‌లో
# తన్వి పత్రికి టైటిల్

**చైనా:** బ్యాడ్మింటన్ ఆసియా అండర్17 ఛాంపియన్‌షిప్‌లో భారత్ టీనేజర్ తన్వి పత్రి మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. చైనాలోని చెంగ్డూలో ఆదివారం జరిగిన ఆసియా అండర్17 ఛాంపియన్‌షిప్స్ 2026ను గెలుచుకోవడం ద్వారా 15 ఏళ్ల తన్వి పత్రి అంతర్జాతీయ వేదికపై తన అద్భుతమైన టాలెంట్‌ను కొనసాగించింది. భారత మహిళల సింగిల్స్ ఫైనల్‌లో తన్వి ఒక గేమ్ వెనుకబడినప్పటికీ, హోరాహోరీగా సాగిన మూడు గేమ్‌ల మ్యాచ్‌లో తన తోటి భారత క్రీడాకారిణి షైనా మణిముత్తును 11-15, 15-10, 15-12 తేడాతో ఓడించింది. ఇండోనేషియాలోని పొంటియానాక్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో తన తొలి సీనియర్ అంతర్జాతీయ టైటిల్‌ను గెలుచుకున్న కొద్ది వారాలకే, తన్వి ఇప్పుడు జూనియర్ సర్క్యూట్‌లో ఖండాంతర టైటిల్‌ను కైవసం చేసుకుంది. రెండో సీడ్ క్రీడాకారిణి టైటిల్ గెలుచుకునే క్రమంలో పలు అద్భుతమైన విజయాలు నమోదు చేసింది. ఈ క్రమంలో ఆమె బలమైన చైనా జట్టుకు చెందిన ముగ్గురు షట్లర్లను, ఒక జపాన్ షట్లర్‌ను ఓడించింది. గతేడాది దీక్షా సుధాకర్ స్వర్ణం సాధించి, ఈ ఈవెంట్‌లో దేశానికి మొట్టమొదటి విజయాన్ని అందించిన తర్వాత, ఈ విజయంతో భారతదేశం వరుసగా రెండోసారి మహిళల సింగిల్స్ అండర్17 ఆసియా టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదిత్య నేగి, తన్మయ్ వర్మల అండర్15 పురుషుల డబుల్స్ జోడీ సెమీఫైనల్స్‌లో ఓడిపోయి కాంస్య పతకంతో సరిపెట్టుకోవడంతో భారతదేశానికి ఇదే ఏకైక ఫైనల్.

# ఈ వారం ఐపిఒల సందడి..




## ఎన్ఎస్ఇ మెగా ఐపిఒ సహా 11 ఇష్యూలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** గత వారం ఆరు ఐపిఒలకు పైగా మార్కెట్‌లోకి రావడంతో ప్రైమరీ మార్కెట్లలో నెలకొన్న సందడి ఈ వారం కూడా కొనసాగనుంది. ఈ వారంలో మొత్తం 11 ఐపిఒలు ఇన్వెస్టర్ల ముందుకు రానున్నాయి. వీటిలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ మెగా ఐపిఒ కూడా ఉంది. ఈ ఇష్యూ ద్వారా ఏకంగా రూ.22,561.57 కోట్ల సమీకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ 11 ఇష్యూలలో ఐదు మెయిన్‌బోర్డ్ ఐపిఒలు ఉన్నాయి. ఎన్ఎస్ఇతో పాటు హీరో మోటార్స్, ఎస్ఎస్‌రిటైల్, సోనాసెలెక్షన్ ఇండియా, జిందాల్ సుప్రీమ్ ఐపిఒలు ఉన్నాయి. ఈ ఐదు ఇష్యూల ద్వారా కలిపి రూ.24,328.02 కోట్ల నిధులను సమీకరించనున్నారు. మరోవైపు, ఎస్ఎంఇ ఐపిఒ విభాగంలోనూ ఈ వారం భారీ సందడి కనిపించనుంది. ఆక్సియమ్ గ్యాస్ ఇంజినీరింగ్ ఐపిఒ 18 నుంచి 22 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉంటుంది. స్పెక్ట్రా ఏ టెక్నాలజీ సొల్యూషన్స్, ఖేరియా ఆటోకాంప్ ఇష్యూలు 17 నుంచి 21 వరకు తెరుచుకోనున్నాయి. వామా వోవెన్‌ఫ్యాబ్, శక్తి పాలీటార్ప్, క్వాంటో అగ్రోవరల్డ్ ఐపిఒలు 15 నుంచి 17 వరకు అందుబాటులో ఉంటాయి. ఎన్నో రోజుల ఆలస్యం, సుదీర్ఘ నిరీక్షణ తర్వాత నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తన మెగా ఐపిఒను తీసుకురానుంది. ఎన్ఎస్ఇ ఐపిఒ మొత్తం ఇష్యూ పరిమాణం రూ.22,561.57 కోట్లు. ఇందులో పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 12.64 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఈ ఐపిఒ 17, 2026న ప్రారంభమై 21న ముగుస్తుంది. ఒక్కో షేరుకు రూ.1,700-రూ.1,785 ధరల శ్రేణిని నిర్ణయించారు. ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ సంస్థ హీరో మోటార్స్ రూ.1,000 కోట్ల ఐపిఒతో మార్కెట్‌లోకి రానుంది. ఇది ఇప్పటికే లిస్టయిన ఆటో దిగ్గజం హీరో మోటోకార్ప్‌కు భిన్నమైన సంస్థ. ఈ ఐపిఒ 16 నుంచి 18 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉంటుంది. ఇందులో రూ.600 కోట్ల ఫ్రెష్ ఇష్యూ, రూ.400 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ ఉన్నాయి. షేర్ల కేటాయింపు సెప్టెంబరు 21న జరిగే అవకాశం ఉంది. ఎన్ఎస్ఇ, ఐపిఒ ధరల శ్రేణిని రూ.79-రూ.84గా నిర్ణయించారు. అలాగే ఎస్ఎస్ రిటైల్ రూ.500 కోట్లు సమీకరిస్తుంది. సోనాసెలక్షన్ ఇండియా కూడా 141.57 కోట్లతో ఐపిఒకు వస్తోంది. జిందాల్ సుప్రీం ఐపిఒ రూ.124.88 కోట్ల సమీకరించే లక్ష్యంతో ఐపిఒకు వస్తోంది. ఒఎఫ్ఎస్ మొత్తం రూ.24.99 కోట్లవరకూ ఉంది.

# యుపిఐ చెల్లింపులో ట్యాప్ అండ్ పే ఫీచర్



**ముంబయి, సెప్టెంబరు 13:** డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త మార్పులు, కొత్త ఫీచర్లు అందుబాటులోకి వస్తున్నాయి. డిజిటల్ చెల్లింపుల రంగాన్ని మరింత వేగవంతం, సౌకర్యవంతం చేసేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో రెండు నూతన యుపిఐ ఫీచర్లను ఆవిష్కరించారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ అజయ్ కుమార్ చౌదరి, ప్రముఖ బ్యాంకింగ్, ఫిన్‌టెక్ దిగ్గజాల సమక్షంలో ఈ కొత్త ఫీచర్లను లాంచ్ చేశారు. డెబిట్, క్రెడిట్ కార్డుల మాదిరిగా ట్యాప్ అండ్ పేను యుపిఐలోనూ తీసుకువచ్చారు.

ఇక నుంచి మీ స్మార్ట్ ఫోన్ చూపిస్తే చాలు యుపిఐ పేమెంట్లు పూర్తికానున్నాయి. డిజిటల్ చెల్లింపులలో భద్రతను పెంచడంతో పాటు, కస్టమర్ అనుభవాన్ని, సమస్యల పరిష్కారాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ కొత్త ఫీచర్లను తీసుకొచ్చారు. యుపిఐ ట్యాప్ అండ్ పే, ఎఐ ఆధారిత ప్లాట్‌ఫామ్ పై యుపిఐ అనే రెండు ఫీచర్లను తీసుకొచ్చారు. వీటితో డిజిటల్ చెల్లింపులకు మరింత వేగం, సౌలభ్యం, ఇంటెలిజెన్స్ తీసుకువచ్చేలా కొత్త యుపిఐ సామర్థ్యాలను జిఎఫ్ఎఫ్ 2026లో ఆవిష్కరించారు. ఇకపై ప్రతిసారీ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సిన అవసరం లేదు. యుపిఐ పిన్ లేదా బయోమెట్రిక్ ప్రమాణీకరణ లేకుండా జరిగే పరిమితులను మీ బ్యాంక్ యాప్‌లో కంట్రోల్ చేసుకోవాలి. యూపీఐ ట్యాప్ అండ్ పేకు అనుగుణంగా అన్ని సెట్టింగ్స్, అనుమతులు ఇస్తే మీరు ఆపైన క్యూఆర్ కోడ్ స్కాన్ చేయకుండానే మీరు నిర్దేశించుకున్న పరిమితి వరకు ట్యాప్ అండ్ పే ద్వారా పేమెంట్లు చాలా వేగంగా పూర్తి చేయవచ్చు.

వాణిజ్యం

# టాటా సన్స్ పబ్లిక్ లిస్టింగ్ తప్పనిసరి?




**ముంబై, సెప్టెంబరు 13:** టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ విషయంలో రిజర్వ్ బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. టాటా సన్స్ తన షేర్లను పబ్లిక్‌గా లిస్ట్ చేయకుండా ఉండేందుకు చేసిన ప్రయత్నాలకు ఆర్‌బిఐ నుంచి అనుమతి లభించలేదు. దీంతో నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ- అప్పర్ లేయర్ సంస్థలకు వర్తించే నిబంధనలను టాటా సన్స్ పాటించాల్సి ఉంటుంది. ఇందులో పబ్లిక్ లిస్టింగ్ నిబంధన కూడా ఉంది. టాటా సన్స్ స్వచ్ఛందంగా రద్దు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకుంది. 2024 మార్చి 28న సమర్పించిన దరఖాస్తుతో పాటు తదుపరి ఉత్తరప్రత్యుత్తరాలను పరిశీలించిన అనంతరం, సిఐఆర్‌ను స్వచ్ఛందంగా సరెండర్ చేసుకునేందుకు చేసిన అభ్యర్థనను ఆమోదించలేమని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. అంతేకాకుండా, ఎన్‌బిఎఫ్‌సి అప్పర్‌లేయర్ సంస్థలకు వర్తించే అన్ని మార్గదర్శకాలు, నిబంధనలను పూర్తిగా పాటించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని టాటా సన్స్‌ను ఆర్‌బిఐ ఆదేశించింది.

ఈ నిర్ణయంతో టాటా సన్స్ ఎన్‌బిఎఫ్‌సి సంస్థలకు వర్తించే నియంత్రణ వ్యవస్థ పరిధిలోనే కొనసాగనుంది. పబ్లిక్ లిస్టింగ్ నుంచి తప్పించుకునేందుకు టాటా సన్స్ అనుసరిస్తున్న ఒక కీలక మార్గాన్ని ఆర్‌బిఐ నిర్ణయం మూసివేసినట్లైంది. టాటా సన్స్ తన రిజిస్ట్రేషన్‌ను 2024 మార్చిలో సరెండర్ చేసుకునేందుకు దరఖాస్తు చేసింది. ఆర్‌బిఐ తాజాగా ఆ అభ్యర్థనను తిరస్కరించింది. అప్పర్ లేయర్‌లో ఉన్న 16 నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల జాబితాలో టాటా సన్స్‌ను కూడా ఆర్‌బిఐ చేర్చింది.

దీంతో సంస్థపై మరింత కఠినమైన నియంత్రణ, పర్యవేక్షణ ఉంటుంది. అలాగే నిబంధనల ప్రకారం లిస్టింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. టాటా సన్స్ భవిష్యత్తులో పబ్లిక్ ఆఫరింగ్‌కు వస్తే, రిటైల్ ఇన్వెస్టర్లు ఆ సంస్థలో నేరుగా పెట్టుబడి పెట్టే అవకాశం లభిస్తుంది. అదే సమయంలో స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ కావడం వల్ల టాటా సన్స్‌కు మార్కెట్ ఆధారిత విలువ ఏర్పడుతుంది. టాటా గ్రూప్‌లోని వివిధ కంపెనీల్లో టాటా సన్స్‌కు ఉన్న వాటాల విలువ, పెట్టుబడులు, ఆర్థిక పనితీరుపై ఇన్వెస్టర్లకు మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది. టాటా సన్స్ లిస్టింగ్ జరిగితే హోల్డింగ్ కంపెనీ స్థాయిలో మరింత ఆర్థిక సమాచారం, పాలనకు సంబంధించిన వివరాలు బహిర్గతం కావచ్చు. దీంతో ఇన్వెస్టర్లతో పాటు సాధారణ ప్రజలకు కూడా గ్రూప్ ఆర్థిక నిర్మాణం, పనితీరును అర్థం చేసుకోవడం సులభమయ్యే అవకాశం ఉంది. అయితే వినియోగదారులపై తక్షణ ప్రభావం మాత్రం పరిమితంగానే ఉండే అవకాశం ఉంది.

ఉత్పత్తుల ధరలు, సేవలు లేదా ఇతర వినియోగదారుల అంశాల్లో వెంటనే పెద్ద మార్పులు రావాల్సిన అవసరం లేదు. పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు సంస్థ ఇంకా అవసరమైన నియంత్రణ, చట్టపరమైన మరియు లిస్టింగ్ ప్రక్రియలను పూర్తి చేయాల్సి ఉంటుంది. అందువల్ల టాటా సన్స్ లిస్టింగ్ అనేది ఒక కీలక పరిణామమే అయినప్పటికీ, ఐపిఒఎప్పుడు వస్తుందనే విషయంలో ఇప్పటికిప్పుడు స్పష్టత లేదు.


# గ్లోబల్ స్థాయిలో 1.28 లక్షల టెక్ ఉద్యోగాలు ఔట్




## 299 కంపెనీల్లో 1,28,536 మంది తొలగింపు
## ఒరాకిల్‌లో అత్యధికంగా 21 వేల ఉద్యోగాల కోత

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** ప్రపంచ టెక్నాలజీ రంగంలో లేఆఫ్‌ల కుదపు తీవ్రం అయింది. టెక్ కంపెనీలు పునర్వ్యవస్థీకరణ ప్రణాళికల్లో ఖర్చులను తగ్గించడం, కృత్రిమ మేధస్సువైపు వనరులను మళ్లించడం వంటి చర్యల్లో భాగంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను తొలగిస్తున్నాయి. ఉద్యోగాల కోతలను ట్రాక్ చేసే లేఆఫ్స్ డాట్‌ఎఫ్‌వైఐగణాంకాల ప్రకారం ఈనెల 10 నాటికి ప్రపంచవ్యాప్తంగా 299 టెక్నాలజీ కంపెనీల్లో 1,28,536 మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఈ యేడాది టెక్ రంగంలో పునర్వ్యవస్థీకరణ ఎంత తీవ్రంగా కొనసాగుతోందో ఈ సంఖ్య స్పష్టం చేస్తోంది. సెప్టెంబరు మొదటి 10 రోజుల్లోనే 5,000కు పైగా టెక్ ఉద్యోగాల కోతలను కంపెనీలు ప్రకటించాయి. తాజా తొలగింపుల్లో ఉబర్, పేపాల్, యాపిల్, జొమాటో, ఒరాకిల్ వంటి కంపెనీలు ఉన్నాయి. గత యేడాది మొత్తం 278 కంపెనీల్లో 1,22,606 టెక్ ఉద్యోగాలు తొలగించగా.. 2026లో ఆ సంఖ్య ఇప్పటికే దాటిపోయింది. 2026లో ఇప్పటివరకు అత్యధిక ఉద్యోగాల కోతలు చేపట్టిన టెక్ కంపెనీగా ఒరాకిల్ నిలిచింది. ఆ సంస్థలో 21,000 ఉద్యోగాలు తగ్గించినట్లు సమాచారం. ఎఐ మౌలిక వసతులు, డేటా సెంటర్లపై భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ఒరాకిల్ ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అమెజాన్, డెల్, మెటాలోనూ భారీ కోతలు ఉద్యోగాల కోతల్లో అమెజాన్ రెండో స్థానంలో ఉంది. 2026లో ఇప్పటివరకు ఆ సంస్థలో 17,267 ఉద్యోగాలు తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈకామర్స్, క్లౌడ్ దిగ్గజమైన అమెజాన్ ఏప్రిల్‌లో ఫ్లోరిడాలోని హోమ్‌స్టెడ్‌లో ఉన్న ఓ గోదామును తాత్కాలికంగా మూసివేయనున్నట్లు ప్రకటించింది. దీంతో 600కు పైగా ఉద్యోగాలు ప్రభావితమయ్యాయి. మేలో అమెజాన్ తన విక్రయభాగస్వాముల విభాగంలోనూ ఉద్యోగాల కోతలను ప్రకటించింది. డెల్ 11,000 ఉద్యోగాల కోతతో తదుపరి స్థానంలో ఉంది. మార్చిలో సంస్థ ఉద్యోగుల సంఖ్యను తగ్గించనున్నట్లు ప్రకటించింది. మెటా కూడా ఈ యేడాది పలు దశల్లో పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. మార్చిలో వందలాది ఉద్యోగాలను తొలగించిన సంస్థ మేలో మరోసారి సుమారు 8,000 ఉద్యోగాలను తగ్గించింది. ఈనెల తొలి 10 రోజుల్లో టెక్ కంపెనీల్లో అత్యధిక ఉద్యోగాల కోతలను ప్రకటించిన సంస్థగా ఉబర్ నిలిచింది. రైడ్‌హెయిలింగ్ దిగ్గజం సుమారు 3,300 ఉద్యోగాలను తొలగించనుంది. పేపాల్ 2026లో ఇప్పటివరకు 4,760 ఉద్యోగాల కోతలను ప్రకటించింది. యాపిల్ సిరి, విజన్ ప్రో, సాఫ్ట్‌వేర్ విభాగాల్లో 200కు పైగా ఉద్యోగాలను తగ్గించింది. విజన్ ప్రో టీమ్‌లో సుమారు 100 పోస్టులు, సిరి మరియు ఎఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ టీమ్‌లలో మరో 100కు పైగా ఉద్యోగాలు ప్రభావితమయ్యాయి. మైక్రోసాఫ్ట్ కూడా జూలైలో సుమారు 4,800 ఉద్యోగాలను, అంటే తన మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 2.1 శాతాన్ని తగ్గించింది. టిక్‌టాక్ ఆగస్టులో 250 ఉద్యోగాలను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. శాంసంగ్ జూలైలో 179 ఉద్యోగాలను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. టెక్సాస్‌కు తరలింపు వల్ల సుమారు 1,000 మంది ఉద్యోగులపై ప్రభావం పడే అవకాశం ఉంది.

## ఫెడ్ నిర్ణయం, ముడి చమురు ధరలే
# ఈవారం మార్కెట్లకు దిక్సూచి



**ముంబై, సెప్టెంబరు 13:** అమెరికా ఫెడరల్ రిజర్వ్‌వడ్డీ రేట్ల నిర్ణయం, ముడి చమురు ధరల కదలికలు, ప్రపంచ కేంద్ర బ్యాంకుల ద్రవ్య విధాన సంకేతాలు రానున్న సెలవులతో కూడిన వారంలో భారత స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా నిలవనున్నాయి. వరుసగా ఐదో వారం నష్టాలతో ముగిసిన నిఫ్టీ కీలకమైన మద్దతు స్థాయికి సమీపంలో ఉండటంతో మార్కెట్లపై ఒత్తిడి కొనసాగుతోంది. గణేశ్ చతుర్థి సందర్భంగా సోమవారం భారత మార్కెట్లకు సెలవు కావడంతో మంగళవారం నుంచే దేశీయ ఇన్వెస్టర్లు అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు, ముడి చమురు ధరలు, బాండ్ ఈల్డ్స్‌పై స్పందించనున్నారు. బుధవారం వెలువడనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయం, తాజా ఆర్థిక అంచనాలపై మార్కెట్ల దృష్టి కేంద్రీకృతం కానుంది. దీంతో దేశీయ ఈక్విటీల్లో బలహీనత విస్తృతంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. రంగాల వారీగా మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ రియల్టీ అత్యధికంగా నష్టపోయిన రంగంగా నిలవగా, హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్ షేర్లు మెరుగైన పనితీరు కనబరిచాయి. ఫెడ్ నిర్ణయంపైనే ప్రధాన దృష్టిఈ వారంలో ప్రపంచ మార్కెట్లకు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయం, ఫెడ్‌రిజర్వ్ ఆర్థిక అంచనాలు ప్రధాన ట్రిగ్గర్లుగా ఉండనున్నాయి. ద్రవ్యోల్బణ గణాంకాల నేపథ్యంలో 25 బేసిస్ పాయింట్ల వడ్డీరేటు పెంపునకు అధిక అవకాశాలు ఉన్నాయని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి. కేవలం వడ్డీ రేటు నిర్ణయంపైనే కాకుండా ఫెడ్ వ్యాఖ్యలు, భవిష్యత్ ద్రవ్యవిధానంపై ఇచ్చే సంకేతాలపైనా ఆధార పడి ఉంటుంది. వడ్డీ రేటులో మార్పు లేకపోవడం లేదా 25 బేసిస్ పాయింట్ల పెంపుతో పాటు సమతుల్యమైన మార్గదర్శకత్వం ఇవ్వడం జరిగితే ప్రస్తుతం మార్కెట్లు భయపడుతున్నంత కఠిన వైఖరి ఉండదని ఇన్వెస్టర్లు భావించే అవకాశం ఉంది. దీంతో మార్కెట్లలో స్వల్పకాలిక ర్యాలీకి అవకాశం ఉండొచ్చు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

14 -9 Pg9th cheli:14 -9 Pg9th cheli.qxd 9/13/2026 10:53 PM Page 1



## అల్పాహారమే!

పిల్లలు పొద్దున్నే కడుపునిండా తిని బడికెళ్లాలని అందరం కోరుకుంటాం. కానీ ఆలస్యంగా నిద్రలేవడమో, సమయానికి వంట పూర్తికాకపోవడమో.. ఇలా పలు కారణాల వల్ల అది అన్ని రోజులూ సాధ్యం కాకపోవచ్చు. పిల్లలు తినలేదని



యువదంపతులు బాధపడుతుంటే కొందరు పెద్దవాళ్లు మా చిన్నప్పుడు టిఫిన్ తినే అలవాట్లు లేవు. సూర్యుడు నడినెత్తికొచ్చాకే ఓ ముద్ద తినేవాళ్లం అంటారు. ఇంకొందరేమో అసలు చాలా దేశాల్లో టిఫిన్ తినే అలవాటే లేదు. తెలుసా! అనేస్తారు. ఇలాంటి అపోహలపైనే సరికొత్త పరిశోధన చేశారు ఇంగ్లండు ఆంగ్లియా రస్కిన్ యూనివర్సిటీ, మెక్సికో యూనివర్సిదాద్ ది లాస్ అమెరికాస్ సంస్థల శాస్త్రవేత్తలు, ఇందుకోసం 42 దేశాల్లోని, లక్షన్నర మంది 10-17 ఏళ్ల మధ్య ఉన్న విద్యా ర్థుల ఆహారపుటలవాట్లనీ వాళ్ల మానసిక స్థితుల్నీ పరిశీలించారు. అందర్నీ చూశాక బ్రేక్‌ఫాస్ట్ తినకున్నా అన్ని పనులూ చురుగ్గా చేసే పిల్లలున్నారు. కానీ వాళ్లలో మానసికానందం లేదు. సదా చిరునవ్వు చిందించే తత్వం కనిపించదు. అదే అల్పాహారం తినేవాళ్లలో ఆ ఆనందంపాలు ఎక్కువ. సహనం కూడా మెండుగా ఉంటోంది. బ్రేక్‌ఫాస్ట్ తిననివాళ్లతో పోలిస్తే వీళ్ల మానవ సంబంధాల్లోనూ రాణిస్తున్నారు అని తేల్చారు శాస్త్రవేత్తలు.

కాబట్టి, పక్కవాళ్ల మాటలు పట్టించుకోకుండా పిల్లలు అల్పాహారం తినడం తప్పనిసరి చేయమంటున్నారు.


## మండపం అలంకరణ..






చిన్నా, పెద్దా మెచ్చే వినాయకచవితి పండగలో గణేశుడి ఆసనం.. అలంకరణది ప్రత్యేక స్థానం. ఇతరుల కంటే వైవిధ్యంగా మండపాన్ని తీర్చిదిద్దడానికి పోటీలు పడుతుంటారు. అయితే ఈ సారి మీకంత శ్రమ అక్కర్లేకుండా రెడీమేడ్‌గా దొరుకుతున్నాయివి. కోరుకున్నట్లు కస్టమైజ్ చేసే ఈ డెకార్ స్టాండులనీ, అలంకరణ సామగ్రిని అందిస్తున్నారు వెండార్లు. వీటితో క్షణాల్లో విఘ్నేశ్వరుడి కోసం వేదికను తీర్చిదిద్దొచ్చు. అంతేకాదు, తర్వాత వాటిని జాగ్రత్తగా వాడుకోవచ్చు. వాటినోసారి మీరూ చూసేయండి.







శ్రావణ భాద్రపద మాసాలు కురిపించిన వర్షంతో పుడమి తల్లి పలకరించి పురుడు పోసుకుంటుంది. అనేక వృక్ష జాతులు, పచ్చని ఆకులు పచ్చని చీర కట్టి ప్రకృతికి ప్రత్యేక సౌందర్యాన్ని సమకూర్చి అనేక లక్షల జీవరాశికి ఆహారం చేకూర్చే ఆహ్లాద కాలం భాద్రపదం. ఔషధాలు అందించే చక్కని సమయం. వేదకాలం మొదలుకొని, ఆధునిక సమకాలీన సాహితీవేత్త వరకు భూగోళం మొదలు, ఖగోళం వరకు విస్తరించిన నిత్య స్ఫూర్తి మూర్తి వినాయకుడు. చంద్రమాన భాద్రపదం నిజానికి సృష్టికి భాద్రపదం.

మన దేశంలో ఎక్కువగా కొలువబడే దైవం వినాయకుడు. గణపతిని విఘ్ననాయకునిగా తలుస్తారు. ఏ శుభకార్యమైన సరే ఎటువంటి విఘ్నములు కలగకుండా నిరాటకంగా జరిగిపోవాలంటే ముందుగా విఘ్నేశ్వరుడికి పూజ చేయడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. వినాయకుని పూజ భద్రపద శుద్ధ చతుర్ధశి నాడు వస్తుంది. ఆరోజు ప్రజలు మూర్తిని ప్రతిష్టించి అత్యంత వైభవంగా పూజలు చేసుకుంటారు. ఇంత గొప్ప పూజలందు కుంటున్న వినాయకుడు స్థూల కాయుడు. ఏనుగు తల, విరిగిన దంతం, పెద్ద బొజ్జ, ఎలుక వాహనం! ఆయన పుట్టుక గురించి రకరకాల గాధలున్నాయి. అందులో బాగా వాడుకలో ఉన్నది పార్వతీదేవి సృష్టి. ఒకరోజు పార్వతీదేవి స్నానానికి పోతూ స్నానాల గదికి కాపలాగా శరీరానికి రాసుకునే పసుపుతో బొమ్మను చేసి ప్రాణం పోసిందని చెబుతారు. ఎవరినీ లోనికి రానీయకుండా పార్వతీదేవి చేసిన కట్టడి అది. జీవం పొందిన ఆ పసుపు ముద్దకు శివుడని తెలియక శివుడ్ని అడ్డగించి, యుద్ధం చేసి చివరికి శివుని చేత చంపబడతాడు. ఈ సంఘట న పార్వతీదేవికి తెలిసి బాధపడుతుండగా ఆమెను ఓదార్చటానికి ఒక ఏనుగు చంపి, దాని తలను చని పోయిన బాలుడికి అతికించారని కథనం. పరమేశ్వరుడిని దర్శించటానికి వచ్చిన పరశురామునితో యుద్ధం చేసినప్పుడు దంతం విరిగిందని చుబుతారు. ఇలా గణపతికి సంబంధించిన అనేక కథలున్నాయి. ఒకసారి గణపతి ఎలుకను ఎక్కి ఏడు లోకాలు తిరగడానికి బయలు దేరుతాడు. ఆ సమయంలో వినాయకుని రూపాన్ని చూసి నవ్వుతాడు చంద్రుడు. గణపతి కోపంతో చందమామను ఎవరు చూసినా అపనిందల పాలవుతారని శాపం ఇస్తాడు. శాపంతో భయపడిన చంద్రుడు సముద్ర గర్భాన దాక్కుంటాడు. లోకమంతా చీకటిమయం అయి పోతుంది. దేవతల కోరిక మీదట గణపతి శాంతించి ఒక్క చవితినాడు చంద్రుడుని చూస్తే నీలాపనిందలు కలుగుతాయని సవరణ చేస్తాడు. ఏది ఏమైనా భాద్రపద శుద్ధ చవితినాడు వినాయకుని జన్మదినంగా ప్రజలు జరుపుకుంటారు. ఆరోజు మట్టితో మూర్తిని చేసి అలంకరించిన పీఠం మీద బియ్యం పోసి మూర్తిని ఆవాహన చేసి, ఇరవై ఒక్క ఆకులతో పూజ చేస్తారు. ఆయనకు అత్యంత ప్రీతికరమైన ఉండ్రాళ్ళను నైవేద్యంగా సమర్పిస్తారు. 'విగతోనాయకః వినాయక', అంటే నాయకుడు లేని సర్వ స్వతంత్రుడు, ప్రథమ ఘనాలకే కాదు మానవ శరీరంలో ములాధార స్థానానికి అధిపతి గణపతే. 21 సంఖ్య గణపతికి ఇష్టమైన సంఖ్య.



## తొలిపూజలివిగో..



"ఏకవింశతి" పాత్రములతో అనగా 21 పత్రములన్ని ఆయుర్వేద ఔషద గుణాలు కలిగి ఉండటం విశేషం. ఆ 21 పత్రాలు తులసీ పత్రం ,విష్ణు క్రాంత పత్రం, దేవ దారు పత్రం,బిల్వ పత్రం, దుర్వా రాయుగ్మమ్, శమి పత్రం ,అశ్వత్త పత్రం, అర్జున(మద్ది) పత్రం,అర్కా పత్రం, సింధువార పత్రం,మరువక పత్రం,బృహతి పత్రం, అపామార్గ పత్రం,కర వీర పత్రం,చుర పత్రం,బదరి పత్రం, దాడిమి పత్రం, జాజి పత్రం, గండంకి పత్రం, మాచి పత్రం,దుత్తురా (ఉమ్మెత్త) పత్రం. ఈ విధంగా పృద్వి నుండి వచ్చిన అనేక ఔషధాలతో ఆరాధించి సకల రోగాలను నయం చెలు కోవడానికే. ఈ విధంగా సంపూర్ణమైన జాగ్రతకు సంకేతం పాత్రులు. మేధా సంపత్తికి చిహ్నాం గజాణనుడు. నిశిత పరిశీలకుడు గణపతి. ఇలా అనేక రకాలుగా చెప్పుకో వచ్చు. వినాయక చతుర్ధి రోజున చేరువు నుండి తెచ్చిన మట్టితో వినాయకుని ప్రతిమను చేసి తిరిగి అక్కడే నిమజ్జనం చేయడం విశేషం. వీలైనంత వరకు మట్టితో చేసిన చిన్న విగ్ర హాన్ని పూజించాలి. దేవుడిని మనసారా కొలవాలి, అంతేగాని ఆడంబరంగా కాదు.మట్టి విగ్రహాన్ని ఇంట్లోనే ఓ బకెట్ నీళ్లలో నిమజ్జనం చేసి కరిగాక చెట్టుకి పోయాలి కళా హృదయం ఉన్న వాళ్ళైతే చేతులతోనే చేసేస్తుంటారు. మనస్సుంటూ ఉండాలేగాని, ఇలా ఎన్నో మార్గాలు ఉంటాయి. పద్దతి ఏదైనా పండగను పర్యావరణానికి హాని లేకుండా జరుపు కోవడమే ముఖ్యం.ఎన్నో ఆధునిక సంప్రదాయ విశేషాలు కల్గిన ఈ భాద్రపద శుద్ధ చతుర్ధి రోజున ఆ మహా గణపతిని ప్రతీ వారు తమకు నచ్చిన విధంగా బుద్ధి కుశలతతో, శ్రద్ధ, భక్తులను, విద్యా, వివేకాలను ప్రసాదిం చాల్సిందిగా వినాయకుని వేడుకుంటే అన్ని శుభాలే ప్రసాదిస్తాడు ఆ భక్త సులభుడు. ఈ వినాయక చవితి రోజున ఆ భక్త సులబుని స్మరించు కుంటు...ఆ లంబోధరుని ఆశీస్సులు పొందుదాం.

**- కాయల నాగేంద్ర**

## నవ్వుని నటించొద్దు !



నవ్వు ఆరోగ్యానికి మంచిదేనని వినడమే కాదు, లాఫింగ్ యోగాలంటూ దానికోసం సమయాన్ని కేటాయించుకుని మరీ సాధన చేస్తున్నాం. ఒక్కోసారి కొంతమంది మాట్లాడే మాటలు మనకి తెప్పిస్తున్నా నవ్వుతూనే సమాధానం చెబుతుంటాం. మనసు బాగోకపోతే ఆ బాధ బయటకు కనిపించకుండా చిరునవ్వుని చిందిస్తూ మోహంలో ఆ లోటు కనపడకుండా దాచేస్తాం. ఒక్కోసారి కొంతమంది వేసే జోక్సి మనకి నవ్వు రాదు కానీ మొహ మాటం కొద్దీ నవ్వాల్సిన పరిస్థితి, అంతేకాదు, చేసే పనిలో ఒత్తిడికి గురైతే ఆ భయం కనిపించకుండా ఉల్లాసంగా కనిపించేందుకు నకిలీ చిరునవ్వుల్ని ప్రదర్శిస్తాం. ఈ నవ్వునే 'ప్లాస్టిక్ స్మైల్' అంటున్నారు. ఇలాంటి నవ్వు ఆరోగ్యానికి మేలు చేయకపోగా అనారోగ్య సమస్యలు తెచ్చిపెడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆక్యుపేషన్ హెల్త్ సైకాలజీ నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఇలా నకిలీ నవ్వుని ప్రదర్శించే వారు వ్యక్తిగత భావోద్వేగాలను మనసులోనే దాచుకుంటున్నారు. దీనివల్ల ఒత్తిడి పెరిగి మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది.

## మసాలా చాయ్ ..

అన్నం తినడంలో ఆలస్యాలూ ఉండొచ్చు కానీ. చాయ్ విషయంలో అలాంటివే ఉండవు. పొద్దున్నే వేడివేడిగా కాస్త టీ తాగితే నిద్రమత్తు వదిలిపోయి చురుగ్గా ఉంటుంది. ఇక అక్కణ్ణించి రాత్రి లోగా ఎన్నిసార్లు తాగితే అంత హుషారు. మనకు ఇంతగా ఇష్టమైన చాయ్ మరింత ప్రత్యేకంగా ఉంటే ఇంకెంత బాగుంటుందోకదూ ! అందుకోసం 'చాయ్ మసాలా పొడి' ఉంటే



చాలు. ఎలా చేయాలంటారా.. కడాయిలో 50 గ్రాముల యాలకులు, 30 గ్రాముల మిరియాలు, 25 గ్రాముల లవంగాలు, రెండు అంగుళాల దాల్చినచెక్క, ఒక టేబుల్‌స్పూన్ సోంపులను తక్కువ సెగ మీద.. మంచి వాసన వచ్చేదాకా వేయించి, పళ్లెంలోకి తీయాలి. తర్వాత 40 గ్రాముల శొంఠిని కూడా అలాగే ఘుమాయించేదాకా వేగనిచ్చి, పళ్లెంలో వేయాలి. ఈసారి తులసి విత్తనాలు కంకులు 8, సంగం జాజికాయను వేయించాలి. అన్నీ చల్లారాక.. మెత్తగా గ్రైండ్ చేసి సీసాలో భద్రం చేసుకోవాలి. టీ కాచేటప్పుడు.. ఈపొడి కాస్త జోడించారంటే ఇకఆ అద్భుతమైన రుచీ, పరిమళాల గురించి చెప్పడానికి మాటలు సరిపోవు.. ఆస్వాదించి ఆనందించాల్సిందే.

## 'మహేంద్రగిరి వారాహి'కి అద్భుతమైన రెస్పాన్స్



హీరో సుమంత్ డివైన్ బ్లాక్ బస్టర్ థ్రిల్లర్. 'మహేంద్రగిరి వారాహి'. స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ ప్రత్యేక పాత్రలో నటించారు. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహించారు. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా నిర్మించారు. ప్రెస్‌మీట్‌లో హీరో సుమంత్ మాట్లాడుతూ..'చాలా కాలంగా కొంతమంది ఇండస్ట్రీ పీపుల్, అలాగే నా ఫ్యాన్స్ నుంచి విషెస్ అందుకోలేదు. నిన్నటి నుంచి ఆ అభినందనలు మొదలయ్యాయి. మహేంద్రగిరి వారాహిని గురించి ప్రేక్షకులు, అభిమానులు చాలా గొప్పగా మాట్లాడుతున్నారు. గ్రౌండ్ లెవెల్‌లో టాక్ చాలా పాజిటివ్‌గా ఉంది. చాలాకాలం తర్వాత నా స్నేహితులు, శ్రేయోభిలాషుల నుంచి కంగ్రాజులేషన్స్ అందుకున్నాను. చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమాకి చాలా మంచి ఫ్యూచర్ ఉంటుంది. మాకు సపోర్ట్ చేసిన మీడియాకి, ప్రేక్షకులకు థాంక్యూ. తప్పకుండా ఈ వీకెండ్ సినిమా చూడండి. మేము చాలా మంచి సినిమా చేశాం. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది" అన్నారు. డైరెక్టర్ సంతోష్ జాగర్లపూడి మాట్లాడుతూ.. 'సినిమా చూసిన ప్రతి ఒక్కరి దగ్గర నుంచి చాలా పాజిటివ్ రెస్పాన్స్ వస్తుంది. క్లైమాక్స్ ట్విస్ట్ ప్రేక్షకులకు ఎలా కనెక్ట్ అవుతుందో అనే ఒక చిన్న భయం ఉండేది. ఆడియన్స్ వాటిని చాలా ఎంజాయ్ చేశారు. రిలీజ్ అయిన అన్ని సినిమాల్లో మాది నంబర్ వన్‌లో ఉందని ఆడియన్స్ చెప్తున్నారు. చాలా హ్యాపీగా ఉంది' అన్నారు. వంశీ చాగంటి మాట్లాడుతూ..'సినిమా చూసిన అందరూ కూడా చాలా హ్యాపీగా ఫీల్ అయ్యారు. ఒక మంచి సినిమా చూసామని ఫీలింగ్‌తో వెళ్తున్నారు. సినిమా ట్రెండింగ్‌లో ఉంది. మీరందరూ తప్పకుండా ఈ పండగ సెలవుల్లో సినిమా చూడండి' అన్నారు. మీనాక్షి మాట్లాడుతూ.. 'మీ అందరికీ సినిమా నచ్చినందుకు చాలా హ్యాపీగా ఉంది. తప్పకుండా సినిమా అందరూ థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను' అన్నారు. నిర్మాత మధు మాట్లాడుతూ.. 'గ్రౌండ్‌లో ఈ సినిమాకి మంచి రెస్పాన్స్ వుంది. అలాగే హిందీలో కూడా మెల్లగా పికప్ అవుతుంది. చాలా మంచి సినిమా చేశాం. తప్పకుండా ఆడియన్స్ అందరూ థియేటర్స్‌కి వెళ్లి చూడండి"అన్నారు.

## 'హ్యాపీ జర్నీ' ట్రైలర్ లాంచ్



ఒక్కో వ్యక్తికి ఒక్కో రకంగా అనిపించే ప్రయాణం.. 'హ్యాపీ జర్నీ'లో అదే ఆలోచనను ఏడుగురు మహిళల జీవితాలు, అనుభవాల ద్వారా ఆసక్తికరంగా చూపించారు. ఏడు మంది మహిళల జీవితాల చుట్టూ తిరిగే ఈ కథలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధా కృష్ణ, జినీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పృథ్వీ దండమూడి, వంశీ, రవి శివ తేజ పైకీలక సహాయ పాత్రలను పోషించారు. గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ల పై బాలాజీ గుత్తా, కౌశిక్ రెడ్డి నిర్మిస్తున్న ఖిహ్యాపీ జర్నీఖి చిత్రంతో అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయం అవుతుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ అభిరామ్ నాయుడు మాట్లాడుతూ.. 'మన పేరెంట్స్ మీద మనకి చాలా ప్రేమ ఉంటుంది. కాకపోతే దాన్ని చూపించుకునే విధానం చాలా తక్కువ. ఇలాంటి ఎమోషన్స్ అన్నీ ఈ సినిమాలో చూపిస్తాం' అన్నారు. పాయల్ రాధాకృష్ణ మాట్లాడుతూ 'నాకు ప్రతి సినిమాకి తెలుగు ప్రేక్షకులు ఎంతో అభిమానం, ప్రేమ ఇచ్చారు. ఈ సినిమాతో నాకు ఎంతో మంది మంచి ఫ్రెండ్స్ దొరికారు. ఈ సినిమా బ్యూటిఫుల్ జర్నీ. మా నిర్మాతలు మమ్మల్ని ఎంతో కేర్‌తో చూసుకున్నారు' అన్నారు. వంశీ మాట్లాడుతూ.. 'ఇలాంటి లైట్ మూమెంట్స్, ఎమోషన్, ఫన్ సినిమాలు చేయడం చాలా కష్టం. కానీ మా డైరెక్టర్ చాలా అద్భుతంగా చేశారు' అన్నారు. పృథ్వీ మాట్లాడుతూ.. 'ఇందులో చాలా మంచి క్యారెక్టర్ చేశాను. ఈ సినిమా మీఅందరికీ చాలా మంచి ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది' అన్నారు. రవి శివతేజ మాట్లాడుతూ 'సెప్టెంబర్ 18న ఈ సినిమా వస్తుంది. కచ్చితంగా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది. మా డైరెక్టర్ ఒక మంచి సినిమా ఇవ్వాలని నిరంతరం కష్టపడ్డారు' అన్నారు. సునయన మాట్లాడుతూ.. 'సపోర్ట్ చేసిన అందరికీ థాంక్యూ. నిర్మాతలు అద్భుతమైన సినిమా చేశారు. ఇందులో ప్రతిదీ ఒరిజినల్‌గా ఉంటుంది. సినిమా అద్భుతంగా వచ్చింది' అన్నారు. జినీషా మాట్లాడుతూ.. 'ఇందులో చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్ చేశాను. అన్ని జనరేషన్స్‌కు నచ్చే ఇలాంటి ఒక సినిమాలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది' అన్నారు.



## 'తెల్ల కాగితం' సాంగ్ రిలీజ్

కె. శ్రీదేవి సమర్పణలో అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మాలపాటి నిర్మిస్తున్న చిత్రం 'తెల్ల కాగితం'. హార్ష్ రోషన్, నక్షత్ర జంటగా నటిస్తున్న ఈ సినిమాకి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు నందు సవిరిగాన అందిస్తున్నారు. ఈ మూవీకి రమేష్ బంద్రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో రిలీజ్ చేసిన పోస్టర్లు, పాటలు, టీజర్ అన్నీ కూడా ఆడియెన్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి. తాజాగా ఈ మూవీ నుంచి 'తెలుసా తెలుసా' అంటూ సాగే ఓ మెలోడీ గీతాన్ని సెన్సేషనల్ హీరో విజయ్ దేవరకొండ విడుదల చేశారు. ఈ పాటకు సురేష్ బనిశెట్టి సాహిత్యం.. అనుదీప్ దేవ్, లిప్సిక గాత్రం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇక విజయ్ బుల్గానిన్ ఇచ్చిన మెలోడీ ట్యూన్‌ను మనసుని హత్తుకునేలా ఉంది. లిరికల్ వీడియో ఎంతో అందంగా కనిపిస్తోంది. హీరో, హీరోయిన్ల జంట.. వారిద్దరి మధ్య ప్రేమ సన్నివేశాలు ఈ పాటకు అదనపు ఆకర్షణ కానున్నాయి. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రఫర్ కె.వి గుహన్ కెమెరామెన్‌గా, కార్తీక శ్రీనివాస్ ఆర్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. అక్టోబర్ 2న గ్రాండ్‌గా ఈ ఈ మూవీని విడుదల చేయబోతోన్నారు.

## 'శ్రీరస్తు' త్వరలో రిలీజ్



ప్రణమ్ దేవరాజ్ హీరోగా, సంజనా ఆనంద్ హీరోయిన్ నటిస్తున్న యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'శ్రీరస్తు'. హరి క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి శంకర్ రెడ్డి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. పెండ్లిమడుగు హరి కృష్ణ గౌడ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏకకాలంలో తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కిస్తున్నారు. కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతను ఆకట్టుకునే కామెడీతో ఈ చిత్రం యూత్ ఫుల్ కామెడీ ఎంటర్టైనర్ అంశాలతో తెరకెక్కుతోంది. హీరో హీరోయిన్ పాత్రల మధ్య ప్రేమకథ సినిమాకు ముఖ్యమైన అంశంగా ఉండనుంది. ఈ చిత్రంలో ప్రజ్వల్ దేవరాజ్ ఒక ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు. సుమన్, దేవి ప్రసాద్, ఆమని, చైత్ర రాయ్, ప్రసాద్ బెహ్రా, రవి ప్రకాష్, రవి శివ తేజ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

## 'పిఠాపురంలో... అలా మొదలైంది' ప్రి రిలీజ్ ఈవెంట్



డా. రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన పాత్రల్లో ప్రముఖ దర్శకులు మహేష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పిఠాపురంలో.. అలా మొదలైంది'. ఈ సినిమాని మహేష్ చంద్ర సినిమా టీమ్, ఎవర్ గ్రీన్ ఎపిక్ సినిమా సంయుక్త నిర్మాణంలో దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదారి కిట్టయ్య) నిర్మిం చారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనుంది. ఈ క్రమంలో శనివారం రాత్రి హైదరాబాద్ లో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు సుమన్ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా.. సుమన్ మాట్లాడుతూ 'చంద్ర మహేష్‌తో నాకు 25 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. ఆయన క్లారిటీతో ఉండే అద్భుతమైన దర్శకుడు. 'పిఠాపురంలో.. అలా మొదలైంది' మంచి విజయం సాధించాలి. కొత్త కంటెంట్‌తో, ఫ్రెష్ సబ్జెక్ట్‌తో ఆయన తీసిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని భావిస్తున్నాను' అన్నారు. ప్రముఖ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ 'చంద్ర మహేష్ యోగ్యుడైన దర్శకుడు. ఈ చిత్రంతో చంద్ర మహేష్‌కి మంచి విజయం దక్కాలి. చైతన్య రెడ్డి ఈ మూవీని రిలీజ్ చేస్తుండటం ఆనందంగా ఉంది. ఈ మూవీ మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ 'చంద్ర మహేష్ చాలా మంచి వ్యక్తి. ఆయన ఎంతో కష్టపడి ఈ సినిమాని తెరకెక్కించారు. ఈ మూవీని నిర్మించిన దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి నిర్మాతలకు మంచి లాభాలు దక్కాలి. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తీసిన ఈ చిత్రం మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. డా. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, 'చంద్ర మహేష్ ఎలాంటి దర్శకుడో నాకు ముందు నుంచీ తెలుసు. ఈ కథ చెప్పినప్పుడే నా పాత్ర తాలూకు డెప్త్ ఏమిటో అర్థమైంది. ఎన్నో కష్టనష్టాలు భరించి ఈ సినిమా తీశాడు తను. ప్రపంచంలో వున్న తెలుగువారందరూ కనెక్ట్ అయ్యే కంటెంట్ ఇది. ఈ సినిమా చూసిన ప్రతి ప్రేక్షకుడూ పది మందికి గొప్పగా చెబుతాడు. మై హార్ట్ ఫెల్ట్ థాంక్స్ టు చంద్రమహేష్. ఒక సీనియర్ నటుడుగా మీ అందరికీ దణ్ణంపెట్టి చెబుతున్నా. దయచేసి ఒక మంచి సినిమాని థియేటర్‌కి వెళ్లి చూడండి' అన్నారు. తెలంగాణ ఛాంబర్ సెక్రటరీ అనంత గిరి మాట్లాడుతూ .. 'పిఠాపురంలో.. అలా మొదలైంది' అని టైటిల్ చూసినప్పుడే సినిమా హిట్ అవుతుందని అనుకున్నాను. ఈ మూవీ మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. దర్శకుడు మహేష్ చంద్ర మాట్లాడుతూ .. 'పిఠాపురంలో.. అలా మొదలైంది' సినిమాకి మనసుతో పాటు ప్రాణం పెట్టి పని చేశాను. మూవీ అద్భుతంగా వచ్చింది. ఈ జర్నీలో సపోర్ట్ చేసిన నా ఆర్టిస్టులందరికీ థాంక్స్. ప్రతీ ఒక్కరూ తమ తమ పాత్రల్లో జీవించేశారు. ఈ సినిమాని కుటుంబ సమేతంగా చూడండి. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. దర్శకుడు రాం ప్రసాద్ మాట్లాడుతూ 'పిఠాపురంలో.. అలా మొదలైంది' చిత్రం ఫ్యామిలీ సెంటిమెంట్‌తో రాబోతోంది. ఇలాంటి సినిమాలు థియేటర్లోనే చూడాలి. ఈమూవీ మంచి విజయం సాధించాలని కోరుకుం టున్నాను' అని అన్నారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ 'పిఠాపురంలో.. అలా మొదలైంద్ది సినిమా సెప్టెంబర్ 18న విడుదలవుతోంది. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను ' అని అన్నారు. దర్శకుడు వీర శంకర్ మాట్లాడుతూ 'చంద్ర మహేష్ నాకు మంచి మిత్రుడు. ప్రస్తుతం ఉన్న తరానికి నచ్చేలా సినిమాని తెరకెక్కించాడు. 'పిఠాపురంలో.. అలా మొదలైంది' మూవీ ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది. ఇలాంటి ఫీల్ గుడ్ మూవీని మీడియా సపోర్ట్ చేయాలి' అని అన్నారు. దర్శక రచయిత బీవీఎస్ రవి మాట్లాడుతూ ..'ప్రేమలు, పెళ్లిళ్లు అనే కాన్సెప్ట్ ఉన్నంత వరకు 'పిఠాపురంలో.. అలా మొదలైంది' ఉంటుంది. తండ్రీకి, కూతురికి జరిగే అద్భుతమైన సంఘర్షణ ఇందులో ఉంటుంది. ఈ సినిమాని అందరూ తప్పకుండా చూడండ్ఠి అని అన్నారు.

## 'ముగ్గురు కోతులు' నుంచి సాంగ్ విడుదల



జీఎస్ఆర్ క్రియేషన్స్ సమర్పణలో, స్కై ఫ్లేర్ నెట్‌వర్క్స్ సహ సమర్పణలో శోభారాణి గరిమెల్ల నిర్మాణంలో కార్తీక్ గరిమెల్ల తెరకెక్కిస్తున్న చిత్రం 'ముగ్గురు కోతులు'. ఈ మూవీలో తేజ కొండపల్లి, గణేష్ బొడ్డ, దేవాన్ష్ ముఖ్య పాత్రల్లో నటిస్తుండగా.. వర్షిక పాశం హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్, 'ముగ్గురు కోతులు' టైటిల్ సాంగ్ ఇలా వరుసగా విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ ఆడియెన్స్‌లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటి వరకు విడుదల చేసిన పాటలకు మంచి స్పందన లభించింది. తాజాగా ఈ చిత్రంలోని 'చిల్లర సాంగ్'ను యాటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన 'ముగ్గురు కోతులు' చిత్ర బృందానికి తన బెస్ట్ విషెస్ తెలియజేశారు. 'చిల్లర సాంగ్ద అంటూ సాగే ఈ పాటకు ఎస్. సుహాస్ అందించిన సాహిత్యం, గాత్రం, బాణీ ఎంతో క్యాచీగా ఉన్నాయి. గణేష్ బొడ్డ, సుహాస్ ఎస్ సంయుక్తంగా రాసిన ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. ఇక ఈ లిరికల్ వీడియోలో ముగ్గురు హీరోలు సరదాగా చిల్ అవుతున్న సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.




## ఒకేవేదికపై మళ్లీ విజయ్ త్రిష, అజిత్

**లండన్, సెప్టెంబరు 13:** తమిళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటులు విజయ్, అజిత్ కుమార్ ఒకే వేదికపై కనిపించడంతో అభిమానుల్లో సందడి నెలకొంది. ఇంగ్లాండ్‌లోని సిల్వర్‌స్టోన్ రేసింగ్ సర్క్యూట్‌లో జరిగిన మిచెలిన్ లే మాన్స్ కప్ రేస్ సందర్భంగా విజయ్, అజిత్ కుమార్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయ్ అజిత్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోవైపు నటి త్రిషా కృష్ణన్ కూడా రేసింగ్ సర్క్యూట్‌కు రావడంతో అభిమానుల దృష్టి మొత్తం ఈ కార్యక్రమంపైనే పడింది. సిల్వర్‌స్టోన్ రేసింగ్ సర్క్యూట్‌లో అజిత్ కుమార్‌ను కలిసేందుకు విజయ్ వేగంగా వెళ్లినట్లు వైరల్ వీడియోలో కనిపించింది. అనంతరం ఇద్దరూ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. అజిత్ కూడా విజయ్‌ను వ్యక్తిగతంగా స్వాగతించారు. మిచెలిన్ లే మాన్స్ కప్‌లో సిల్వర్‌స్టోన్ రౌండ్‌కు ముందు చోటుచేసుకున్న ఈ కలయిక అభిమానులను ఆకట్టుకుంది. తమిళ సినీ పరిశ్రమలో ఇద్దరు ప్రముఖ నటులుగా గుర్తింపు పొందిన విజయ్, అజిత్ ఒకే కార్యక్రమంలో కనిపించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

## నంబర్ వన్ ఆర్థికవ్యవస్థగా భారత్



**న్యూయార్కు, సెప్టెంబరు 13:** ప్రపంచ సంక్షోభాల మధ్య భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని అంతర్జాతీయ సంస్థలు ఇప్పటికే చెప్పాయి. ఇప్పుడు అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన ఆర్థికవేత్త జెఫ్రీ సాక్సా భారత్ నెంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా మారతుందని సంచలన అంచనా వేశారు. సమీపం భవిష్యత్తులో భారత్ అమెరికా, చైనాలను దాటి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని చెప్పారు. రాబోయే 25యేళ్లలో అమెరికాను భారత్ అధిగమించి రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని, చివరకు ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థికశక్తిగా అవతరించవచ్చని జెఫ్రీ సాక్స్ చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కేంద్రం నిర్ణయాత్మకంగా ఆసియా వైపు మారుతోందని సాక్స్ పేర్కొన్నారు. భారత్- చైనాలు ఒకరికి ఒకరు అవసరమని అన్నారు. ఈ రెండు ఆసియా దిగ్గజాలు ప్రపంచ ఆర్థిక శక్తులుగా మారుతాయని, అదే సమయంలో అమెరికా మూడో స్థానానికి పడిపోతుందని జోస్యం చెప్పారు. చైనాతో భారత్‌కు లోతైన ఆర్థిక, సాంకేతిక సంబంధాలు భారత్ ఎదిగే వేగాన్ని మరింత పెంచొచ్చని వెల్లడించారు. చైనా, ఆసియాన్, ఆఫ్రికా, గల్ఫ్ దేశాలతో భారతదేశ వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలు మరింత ముఖ్యమైనవిగా మారతాయని ఆయన అన్నారు.

## ముక్కలు కాబోతున్న గ్రేట్‌బ్రిటన్..!




**లండన్, సెప్టెంబరు 13:** యునైటెడ్ కింగ్‌డమ్ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ నేతలు తమ ప్రాంతాలకు స్వయం నిర్ణయం హక్కు, స్వాతంత్ర్యం దిశగా కీలక అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కార్డిఫ్‌లో జరిగే సమావేశంలో యుకె నుంచి స్వాతంత్రం సాధించేందుకు డిక్లరేషన్‌పై సంతకం చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న వెస్ట్ మినిస్టర్ ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్ జాన్ స్విన్నీ, వేల్స్ ఫస్ట్ మినిస్టర్ రున్ అప్స్ ఐయోర్వెత్, ఉత్తర ఐర్లాండ్ నాయకత్వంతో పాటు సిన్ ఫెయిన్ అధ్యక్షురాలు మేరీ లూ మెక్‌డొనాల్డ్ ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ నేతలంతా స్వయం నిర్ణయ హక్కును సమర్థిస్తూ జాయింట్ డిక్లరేషన్‌పై సంతకం చేసే అవకాశం ఉంది. ఇటీవల ఎన్నికల ఫలితాలు స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్‌లో రాజ్యాంగ మార్పులకు అనుకూలంగా ఉన్న పార్టీలు సత్తా చాటాయి. స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్ జాన్ స్విన్నీఈ బ్రేక్ అప్ పరిణామాన్ని యూకే రాజ్యాంగ వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిడికి సంకేతంగా అభివర్ణించారు. స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్‌కు తొలిసారిగా స్వాతంత్ర్య అనుకూల ఫస్ట్ మినిస్టర్లు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత రాజ్యాంగ స్థితి శాశ్వతం కాదని, వెస్ట్‌మినిస్టర్ ప్రభుత్వం యుకె తర్వాతి భవిష్యత్తుపై సిద్ధం కావాల్సిన సమయం వచ్చిందని ఆయన అన్నారు.

## బ్రిక్స్ సదస్సు.. తపాలా బిళ్లలు విడుదల




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** ప్రపంచ వేదికపై కీలక పాత్ర పోషిస్తున్న బ్రిక్స్ కూటమి ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా భారత్ ప్రత్యేక స్మారక తపాలా బిళ్లలను విడుదల చేసింది. 2026 సెప్టెంబర్ 12న న్యూఢిల్లీలో జరిగిన 18వ బ్రిక్స్‌శిఖరాగ్ర సమావేశం సందర్భంగా భారత తపాలా శాఖ ఈ రెండు ప్రత్యేక తపాలా బిళ్లలను ఆవిష్కరించింది. గత రెండు దశాబ్దాల్లో బ్రిక్స్ సాధించిన ప్రగతి, సభ్య దేశాల మధ్య సహకారం, ఐక్యతతో పాటు ఈ కూటమిలో భారత్ పోషించిన కీలక పాత్రను గుర్తు చేసుకునేలా ఈ ప్రత్యేక తపాలా బిళ్లలను రూపొందించారు. 12న న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత తపాలా శాఖ రెండు స్మారక తపాలా బిళ్లలను విడుదల చేసింది. ఈ రెండు బిళ్లలపై రెండు దశాబ్దాల పరస్పర సహకారం 2006-26 అనే సందేశాన్ని హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ముద్రించారు. అభివృద్ధి, సహకారం వంటి అంశాల్లో సాధారణ ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని ఇది అందిస్తుంది.

## చెత్తపేరుతో రూ.1200 కోట్ల కుంభకోణం

### - వైకాపా నెల్లూరు నగర నియోజకవర్గ ఇంచార్జ్ చంద్రశేఖరరెడ్డి

**నెల్లూరు(విద్య), సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** చెత్త పేరుతో కూటమి ప్రభుత్వ హయాంలో రూ.1200 కోట్ల కుంభకోణం జరిగిందని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, వైకాపా నెల్లూరు నగర నియోజకవర్గ ఇంచార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం నగరంలోని స్థానిక పొదలకూరు రోడ్డులోని వైయస్‌ఆర్సీపీ జిల్లా ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కుంభకోణంలో మంత్రి నారాయణ హస్తం ఉందన్నారు. మున్సిపాలిటీలో చెత్త యార్డులు ఎప్పటినుంచో ఉన్నాయని, లెగసి వేస్ట్ తొలగింపు పేరుతో రూ.1200 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. 2019కి ముందు పట్టణాల్లో కుప్పదొడ్లు రోడ్లపై దర్శనం ఇచ్చేవని తమ హయాంలో వాటిని పరిశుభ్రంగా నిర్వహించమన్నారు. గతంలో, ప్రస్తుతం చెత్తకుప్పల నిర్వహణపై తాము బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు.

# నా భూమి బిజెపి బిల్డర్లే కబ్జాచేసారు!

### ప్రధాని మోడీని కలిసి మాజీ క్లాస్‌మేట్ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** ప్రధాని మోడీని ఆయన మాజీ క్లాస్‌మేట్ కలుసుకున్నారు. బిల్డర్ సంస్థలు తన భూమిని ఆక్రమించినట్లు ఆయన ఆరోపించారు. చాలా కాలంగా వివాదం కొనసాగుతున్న ఈ అంశంపై సిబిఐతో విచారణ జరిపించాలని కోరారు. ఈ మేరకు ఒక లేఖను మోడీకి అందజేశారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలోని మీరాభయందర్‌కు చెందిన 81 యేళ్ల అస్గరలీ వోహ్రా గతంలో గుజరాత్‌లోని వడ్నగర్‌లో ఉన్న బిఎన్ స్కూల్‌లో మోడీతో కలిసి చదువుకున్నారు. ఈనెల 8న తన భార్యతో కలిసి మాజీ క్లాస్‌మేట్ అయిన ప్రధాని మోడీని ఆయన కలిశారు. మీరాభయందర్‌లో దశాబ్దాలుగా ఉన్న భూమి వివాదంపై సిబిఐ విచారణ కోరారు. 1989లో భయందర్ ఈస్ట్‌లోని నవ్‌గఢ్ రోడ్డులో ఉన్న 2,810 చదరపు మీటర్ల భూమిని తాను రిజిస్టర్డ్ ఒప్పందం ద్వారా చట్టబద్ధంగా కొనుగోలు చేసినట్లు వోహ్రా తెలిపారు. ఆ భూమిని తాను ఎప్పుడూ అమ్మలేదు లేదా బదిలీ చేయలేదని చెప్పారు. అయితే బిజెపి ఎమ్మెల్యే నరేంద్ర మెహతాకు అనుబంధంగా ఉన్న బిల్డర్లు నకిలీ పత్రాలతో తన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని ఆయన ఆరోపించారు. 2011లో స్వయం బిల్డర్స్‌తో కుమ్మక్కై నకిలీ పత్రాలు తయారు చేశారని, ఆ తర్వాత తన ప్రమేయం లేకుండా ఆస్తిని రెండు భాగాలుగా విభజించారని ఆయన ఆరోపించారు. అయితే తన భూమిలోని ఒక భాగం స్వయం బిల్డర్స్ స్వాధీనంలో ఉండగా, బిజెపి ఎమ్మెల్యే నరేంద్ర మోహతాతో సంబంధాలున్న సెవెన్ ఎలెవెన్ కన్‌స్ట్రక్షన్స్ నియంత్రణలో మరో భాగం ఉన్నదని వోహ్రా తెలిపారు. తనకు యాజమాన్యపు హక్కులు ఉన్నప్పటికీ, మీరాభయందర్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం వివాదాస్పద భూమిపై నిర్మాణ అనుమతి మంజూరు చేసిందని ఆయన ఆరోపించారు. పత్రాలను తారుమారు చేయడంలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ శాఖ, స్థానిక పోలీస్ అధికారులు విఫలమయ్యారని ఆయన పేర్కొన్నారు. మరోవైపు 2015లో జరిగిన నకిలీ పత్రాల ఆరోపణలకు సంబంధించి తాను ఎఫ్ఐఆర్ దాఖలు చేయగా ఆ విషయం కోర్టుకు చేరిందని వోహ్రా తెలిపారు. కేసు నమోదైన దాదాపు 11 సంవత్సరాల తర్వాత, అంటే ఈ ఏడాదిలో ఆ కేసుపై సిఐడి నివేదిక సమర్పించిందని చెప్పారు. రాజకీయ ఒత్తిడితో అధికారులు వ్యవహరించడం వల్ల ఈ ఆలస్యం జరిగిందని పేర్కొన్నారు. తనకు ముందస్తు నోటీసు ఇవ్వకుండా లేదా తన వాదన వినిపించే అవకాశం కల్పించకుండా 2025లో తనపై ఎదురు కేసు దాఖలు చేశారని వోహ్రా ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై సిబిఐతో దర్యాప్తు జరిపించాలని ప్రధాని మోడీని ఆయన కోరారు. వివరాలతో కూడిన ఒక లేఖను ఆయనకు అందజేశారు.

ప్రధాని మోడీతో ఆయన మాజీ క్లాస్‌మేట్ వోహ్రా సమావేశం తర్వాత స్థానిక మున్సిపల్ అధికారులు ఈ భూ వివాదంపై స్పందించారు. సెప్టెంబర్ 16న విచారణకు షెడ్యూల్ చేశారు. స్వయం బిల్డర్స్, సెవెన్ ఎలెవెన్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు హాజరు కావాలని ఆదేశించారు.


## 9/11 దాడుల కంటే ముందే భారత్‌పై బిన్‌లాడెన్ కుట్ర



**వాషింగ్టన్, సెప్టెంబరు 13:** అమెరికాపై 2001 సెప్టెంబర్ 11న జరిగిన భయానక ఉగ్రదాడులకు కొన్ని సంవత్సరాల ముందే, అల్‌ఖైదా వ్యవస్థాపకుడు ఒసామా బిన్ లాడెన్ భారతదేశంలో కూడా దాడులు చేయడానికి ప్రణాళికలు రచించినట్లు వెల్లడైంది. 1998 నాటి సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ రహస్య నివేదికతో ఈ సంచలన విషయం బయట పడింది. 9/11 దాడుల 25వ వార్షికోత్సవం సందర్భంగా అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, జార్జ్ డబ్ల్యూ బుష్‌లకు సమర్పించిన 100 కంటే ఎక్కువ పేజీల రహస్య నివేదికలను సిఐఎ బయటపెట్టింది. ఆగస్టు 28, 1998 నాటి ప్రెసిడెన్షియల్ డైలీ బ్రీఫ్‌కు 'బిన్ లాడెన్ టెర్రరిస్ట్ నెట్‌వర్క్ స్టిల్ ఎ థ్రెట్' అని పేరు పెట్టారు. అందులో లాడెన్ దాడులు చేయాలని భావించిన దేశాల జాబితాలో భారతదేశం కూడా ఉంది. ఈజిప్ట్, అరేబియా ద్వీపకల్పం ముఖ్యంగా కువైట్, సౌదీ అరేబియా, యెమెన్, భారత్, పాకిస్థాన్, ఉగాండా, నైజీరియాలలో దాడులకు లాడెన్ ప్లాన్ చేశాడు. ఈ పత్రంలో భారతదేశంలోని టార్గెట్ ప్లేస్, దాడికి కరెక్ట్ తేదీ లేదా ఆపరేషనల్ ప్లాన్ వివరాలు మాత్రం పేర్కొనలేదు. ఈ సమాచారానికి ఆధారమైన ఇంటెలిజెన్స్ సోర్స్‌ను కూడా గోప్యంగా ఉంచారు. సుమారు 60కి పైగా దేశాల్లో ఉన్న నెట్‌వర్క్, అనుబంధ ఉగ్రవాద సంస్థల సహాయంతో బిన్ లాడెన్ ఈ దాడులకు పాల్పడే అవకాశం ఉందని నివేదిక స్పష్టం చేసింది. అమెరికా, బ్రిటన్‌లపై మరిన్ని దాడులు చేసేందుకు మార్గాలను వెతికాడని, అయితే ఏ నిర్దిష్ట ప్రదేశం లేదా సమయాన్ని సూచించలేదని పేర్కొంది. తిరానా, బాకు నగరాల్లో దాడులకు సిద్ధమవుతున్న లాడెన్ అనుచరులను అరెస్ట్ చేయడంలో అమెరికా అధికారుల సాయం అందిందని ఈ అంచనా వెల్లడించింది. ఉత్తర అమెరికా, యూరప్, తూర్పు ఆసియా ప్రాంతాల్లో బిన్ లాడెన్‌కు ఉన్న బలమైన వ్యవస్థల వల్ల, అక్కడ అమెరికా ప్రయోజనాలపై దాడులు జరుగుతాయన్న నివేదికలకు మరింత బలం చేకూరింది.

## ఉమ్మడి ధాన్యాల మార్కెట్‌తోపాటు బీమా వ్యవస్థ మేలు

### బ్రిక్స్ ముగింపు సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** బ్రిక్స్ దేశాలకు ఉమ్మడి ధాన్యాల మార్కెట్‌తో పాటు కొత్త బీమా వ్యవస్థ ఉంటే బాగుంటుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదించారు. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడానికి బ్రిక్ సభ్య దేశాల మధ్య బలమైన ఆర్థిక సహకారం ఉండాలని ఆయన సూచించారు. 18వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిర్గతంగా ఆర్థిక ఒత్తిడి ఉన్నా క్యాపిటల్, లేబర్, టెక్నాలజీని ఇచ్చిపుచ్చుకొనే శక్తిసామర్థ్యాలు బ్రిక్స్ సభ్య దేశాలకు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. తాను ప్రతిపాదించిన ఇన్సూరెన్స్ మెకానిజం రష్యాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. "పశ్చిమ దేశాల ఆంక్షల కారణంగా రష్యా ఇంధన ఎగుమతులపై బాగా ప్రభావం పడింది. రష్యా చమురును రవాణా చేసే నౌకలకు బీమా సదుపాయం కల్పించకుండా వెస్టర్న్ కంపెనీలను జి7, యూరోపియన్ యూనియన్, యుకె అడ్డుకున్నాయ్లు అని పుతిన్ పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాలు స్థాపించిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ పనితీరు అద్భుతంగా ఉందని పుతిన్ ప్రశంసించారు. 140 బిలియన్ డాలర్ల రూ.13 లక్షల కోట్లు విలువైన ప్రాజెక్టులను ఆ బ్యాంకు సమర్థంగా నిర్వహిస్తున్నదని కొనియాడారు. ఇక అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడానికి సమగ్ర విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఉందని బ్రిక్స్ దేశాలతో పాటు గ్లోబల్ సౌత్ దేశాలను కూడా ఆయన కోరారు. భద్రతా ముప్పులను సమిష్టిగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. బ్రిక్స్ సమావేశాల్లో పెరుగుతున్న దేశాల భాగస్వామ్యం ఈ కూటమిపై అంతర్జాతీయ ఆసక్తి పెరుగుతోందనడానికి నిదర్శనమని పుతిన్ పేర్కొన్నారు. స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం, సమిష్టిగా సమస్యలను పరిష్కరించడం, అంతర్జాతీయ చట్టాలను గౌరవించడం, ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని సూత్రాలను పాటించడం వంటి అంశాలకు బ్రిక్స్ ప్రాధాన్యత ఇస్తోందని ఆయన చెప్పారు.

# అజిత్ ధోవల్‌కు హాయ్ చెప్పిన పుతిన్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** బ్రిక్స్ సదస్సులో చోటుచేసుకున్న ఓ ఆసక్తికర సన్నివేశం ఇప్పుడు నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సమావేశమైన సమయంలో ఈ ఘట్టం ఆవిష్కృతమైంది. మోడీతో మాట్లాడుతున్న పుతిన్ ఆయన వెనుక నిలబడి ఉన్న జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్‌ను గమనించారు. వెంటనే చిరునవ్వు చిందిస్తూ, చేయి పైకెత్తి ఆయనకు ఓ ప్రత్యేకమైన సైగతో పలకరించారు. దీనికి బదులుగా దోవల్ కూడా నవ్వుతూ స్పందించారు. కేవలం రెండు సెకన్ల పాటు జరిగిన ఈ పలకరింపును సోషల్ మీడియాలో స్పైటుస్పై సెల్యూట్, ఇంటెలిజెన్స్ బ్రదర్‌హుడ్ అంటూ నెటిజన్లు అభివర్ణిస్తున్నారు. భారత ఇంటెలిజెన్స్ వ్యవస్థతో దోవల్‌కు ఉన్న సుదీర్ఘ అనుబంధం మరోసారి బయటపడింది. పుతిన్, దోవల్ ఇద్దరికీ ఇంటెలిజెన్స్ రంగంలో విశేషమైన నేపథ్యం ఉండటమే ఈ ప్రత్యేక బాండింగ్‌కు కారణం అని నిపుణులు చెబుతున్నారు. పుతిన్ గతంలో సోవియట్ యూనియన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కెజీబీలో 16యేళ్ల పాటు పనిచేశారు. లెఫ్టినెంట్ కల్నల్‌గా పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత రష్యా అధ్యక్షుడిగా ఎదిగారు.

మరోవైపు, అజిత్ దోవల్ భారత ఇంటెలిజెన్స్ బ్యూరోలో 33యేళ్ల పాటు సేవలందించారు. పాకిస్థాన్‌లోని లాహోర్‌లో ఏడేళ్ల పాటు అండర్ కవర్ ఏజెంట్‌గానూ పనిచేశారు. ప్రస్తుతం దేశ వ్యూహాత్మక, భద్రతా వ్యవహారాల్లో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరిద్దరి మధ్య ఉన్న మూడు ప్రధాన పోలికలను విశ్లేషకులు ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. ఎదుటివారి బాడీ లాంగ్వేజ్‌ను ఇట్టే పసిగట్టడం, హార్డ్ పవర్‌ను విశ్వసించడం, తీవ్రమైన జాతీయవాద దృక్పథం కలిగి ఉండటం ఈ ఇద్దరిలోని ఉమ్మడి లక్షణాలు అని చెబుతున్నారు.

# సరిహద్దులపై భారత్ - చైనా వేర్వేరు విధానాలు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల సమావేశం అనంతరం ఇరు దేశాలు విడుదల చేసిన అధికారిక ప్రకటనలు భారత్- చైనా సరిహద్దు వివాదంపై రెండు దేశాల వేర్వేరు విధానాలను స్పష్టం చేస్తున్నాయి. చైనా తన ప్రకటనలో సరిహద్దు వివాదాన్ని, ద్వైపాక్షిక సంబంధాలను పక్కపక్కనే సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించింది. సరిహద్దుల్లో శాంతిభద్రతలను కాపాడుకుంటూనే, రెండు అంశాల్లోనూ ఒకదానికొకటి పరస్పర సహకారాన్ని అందిస్తూ పురోగతి సాధించాలని పేర్కొంది. సరిహద్దు సమస్య పూర్తిగా పరిష్కారం కాకపోయినా, ఇతర ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకోవచ్చనే సంకేతాన్ని చైనా ఇచ్చింది. అయితే భారత్ మాత్రం దీనిపై పూర్తి స్పష్టమైన, విభిన్నమైన వైఖరిని ప్రదర్శించింది. సరిహద్దుల్లో శాంతిభద్రతలు నెలకొనడం అనేది ఇరు దేశాల మధ్య విస్తృత సంబంధాలు కొనసాగడానికి అత్యంత ప్రాథమిక పునాది అని ప్రధాని మోడీ బలంగా పునరుద్ఘాటించారు. సరిహద్దు వ్యవహారాలకు సంబంధించి గతంలో కుదుర్చుకున్న ఒప్పందాలు, అవగాహనలను రెండు దేశాలు ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. రెండు దేశాల ప్రకటనల్లోని ప్రధాన వ్యత్యాసం ప్రాధాన్యతా క్రమంలోనే కనిపిస్తోంది. సరిహద్దు సమస్య ముగియకపోయినా మిగిలిన సంబంధాల్లో ముందుకు వెళ్లవచ్చని చైనా భావిస్తుంటే, సరిహద్దు వద్ద ప్రశాంత వాతావరణం ఉంటేనే ఇతర అంశాల్లో ముందడుగు వేయడం సాధ్యమవుతుందని భారత్ తేల్చిచెప్పింది. ఏది ఏమైనప్పటికీ, రెండు దేశాల ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సరిహద్దు వివాదానికి న్యాయమైన, సహేతుకమైన, ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనడానికి ఇద్దరు నాయకులు తమ కట్టుబాటును వ్యక్తం చేశారు.

### నోయిడా కార్మికుల నిరసన కేసు:

## హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టుకు జిల్లా మేజిస్ట్రేట్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** నోయిడా కార్మికుల నిరసనకు సంబంధించి జాతీయ భద్రతా చట్టం కింద ఓ విద్యార్థిని నిర్బంధించిన వ్యవహారంలో రూ.5 లక్షల పరిహారాన్ని తన జీతం నుంచి వసూలు చేయాలంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ గౌతమ్ బుద్ధనగర్ జిల్లా మేజిస్ట్రేట్ మేధా రూపమ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సెప్టెంబర్ 2న అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పులో ఢిల్లీ యూనివర్సిటీలో చరిత్రలో పట్టభద్రురాలైన 25 ఏళ్ల ఆకృతి చౌదరిని నిర్బంధించడాన్ని కొట్టివేసింది. ఆమెపై మరే ఇతర కేసు లేకపోతే వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. తన అరెస్టును సవాల్ చేస్తూ ఆకృతి చౌదరి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, ఆమె నిర్బంధానికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన కథనం కల్పితంగా ఉందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. జిల్లా మేజిస్ట్రేట్ మేధా రూపమ్ జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వుల తీరుపై కూడా హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తప్పిదపూరిత అధికార యంత్రాంగం ఇదే విధంగా నిరంకుశ ధోరణిని కొనసాగిస్తే ఉత్తరప్రదేశ్ ఒక ఆర్వెలియన్ డిస్టోపియాగా మారే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించింది. ఆకృతి చౌదరికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మొత్తాన్ని నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా మేజిస్ట్రేట్ మేధా రూపమ్‌తో పాటు, కేసుకు బాధ్యులైన ఇతర అధికారుల నుంచి, సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వరకు, వారి జీతాల నుంచి వసూలు చేయాలని ఆదేశించింది. సెప్టెంబర్ 9న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో హాజరై, నిర్బంధ ఉత్తర్వులను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

## రాహుల్, ప్రియాంకలతో మలేసియా ప్రధాని భేటీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** బ్రిక్స్ సదస్సు కోసం ఇండియా వచ్చిన మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఢిల్లీలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కలిశారు. అక్కడే రాహుల్ సోదరి ప్రియాంకా గాంధీని కూడా కలుసుకున్నారు. ఆదివారం ఉదయం ఢిల్లీలోని రాహుల్ గాంధీ నివాసంలో ఆయనను కలిశారు. రాహుల్ నివాసంలో ఆయన సోదరి ప్రియాంకా గాంధీ కూడా ఉన్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. దీనికి సంబంధించిన ఫొటోల్ని కాంగ్రెస్ తాజాగా విడుదల చేసింది. అన్వర్ ఇబ్రహీం తన పర్యటన సందర్భంగా దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్‌ను గుర్తుచేసుకున్నారు. ఆయనతో తనకున్న సాన్నిహిత్యం గురించి ప్రస్తావించారు.

## కోవూరులో పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ



**కోవూరు (నెల్లూరు), సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** కోవూరు పట్టణంలోని గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆవిష్కరించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను అర్పించిన ఒక మహనీయుడి త్యాగాన్ని మన మధ్య శాశ్వతంగా నిలబెడుతున్నామని ఎంపి, ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలనే లక్ష్యంతో శ్రీ పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19న ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించి, 58 రోజుల పాటు తన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడారని తెలిపారు. చివరకు ప్రాణత్యాగం చేసిన ఆయన త్యాగం దేశవ్యాప్తంగా ఉద్యమానికి కారణమైందని, ఆయన మరణించిన నాలుగు రోజుల్లోనే 1952 డిసెంబర్ 19న అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును ప్రకటించారని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని, ఆయన ఆశయాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. సొంత నిధులతో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గాదిరాజు అశోక్‌ని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఆర్యవైశ్య సంఘం నేతలు, తదితరులు ఉన్నారు.

## 60యేళ్ల కన్నీళ్లకు 20 రోజుల్లో పరిష్కారం

### - సర్వేపల్లి కాలువకట్ట నిర్వాసితులకు శాశ్వత పట్టాలు



**నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** దశాబ్దాలుగా వెంటాడుతున్న సమస్యకు తెరపడింది. అరవై ఏళ్లుగా ఇంటి పట్టాల కోసం ఎదురుచూస్తున్న పేదల కల నెరవేరబోతోంది. సమస్యను తన దృష్టికి తీసుకొచ్చిన కేవలం 20 రోజుల వ్యవధిలోనే అన్ని శాఖలను సమన్వయం చేసి, క్యాబినెట్ ఆమోదం సాధించి 1,215 మంది నిర్వాసితులకు శాశ్వత పట్టాల మార్గాన్ని సుగమం చేసిన మంత్రి నారాయణ. నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని సర్వేపల్లి కాలువకట్టపై మంత్రి నారాయణ అదివారం పర్యటించారు. కల సాకారం చేయబోతున్న మంత్రి తమ ప్రాంతానికి రావటంతో నిర్వాసితుల దారిపొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఓ స్థానిక మహిళ మంత్రి నారాయణ పాదాలకు పాలాభిషేకం చేసి, దిష్టితీయడం అక్కడి భావోద్వేగ వాతావరణానికి అద్దం పట్టింది. కాలువకట్టలపై నివసిస్తున్న పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. ఈ సమస్యను స్థానికులు తన దృష్టికి తీసుకురాగానే ఆగస్టు 7న అధికారులను వెంటబెట్టుకుని స్వయంగా కాలువకట్టపై పర్యటించి పరిస్థితిని పరిశీలించానన్నారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించిన సాంకేతిక, పరిపాలనా సమస్యలను సమన్వయం చేస్తూ పరిష్కారానికి చర్యలు చేపట్టామని చెప్పారు. అన్ని శాఖలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సమస్యను కొలిక్కి తెచ్చామని, చివరకు క్యాబినెట్‌లో ప్రతిపాదన పెట్టి 1,215 మంది నిర్వాసితులకు శాశ్వత పట్టాల మంజూరుకు ఆమోదం పొందామని వివరించారు.